Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

శనివారం, ఏప్రిల్ 18, 2026 | సంపుటి - 20 | సంచిక 214 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## శాస్త్రిపురం ఫ్లై ఓవర్ ప్రారంభం
### ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్ :

హైదరాబాద్ నగర అభివృద్ధిలో కీలక అడుగు పడింది. నగరంలో మరో ఆర్‌వోబీ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. శుక్రవారం శాస్త్రిపురం రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌ను మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణానికి జీహెచ్ఎంసీ 71 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. సుమారు 490 మీటర్ల పొడవుతో, నాలుగు లైన్లలో ఫ్లై ఓవర్ జీహెచ్ఎంసీ నిర్మించింది.

తరువాయి 2లో





2

## రేవంత్‌ది అసదుద్దీన్ ఓవైసీ ఫార్ములా

ఉత్తరాది, దక్షిణాది పేరుతో విషం చిమ్ముతున్నారు

కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ : దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గకుండా డీలిమిటేషన్ పక్రియ జరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కొత్త నాయకత్వానికి అవకాశం వస్తుందని ప్రతిపక్షాలు డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు.

## కాళేశ్వరంపై ఎలాంటి
# దురుద్దేశ్యం లేదు
### బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ ఏర్పాటు

- నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ జైన్‌తో చర్చించాం
- వానాకాలం లోగానే సాయిల్ టెస్టింగ్ పూర్తి
- 20న సిఎం రేవంత్ మేడిగడ్డను పరిశీలిస్తారు
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



న్యూఢిల్లీ : కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్ రెడ్డికి, తమ ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 20వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మేడిగడ్డ బ్యారేజ్‌ను పరిశీలిస్తామని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్ 2లో

**కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్‌పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అనీ. పరిచిత్ మెహ్రా ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసింది. ఇంజినీర్లు, నిపుణులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. మూడు బ్యారేజీల మరమ్మతులకు సమన్వయ కమిటీ ఏర్పాటు చేసింది.**



## 30లక్షలకు పైగా ధాన్యం సేకరణ
# చేపట్టండి
### కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వినతి

న్యూఢిల్లీ : 2025-26 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల పార్ బాయిల్డ్ ధ్యానం సేకరించాలని కేంద్రమంత్రికి సిఎం రేవంత్, మంతంరి ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. అలాగే యాసంగి పంట 90 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వివరించారు. ఈ ధాన్యం మొత్తం కొనుగోలు చేసి తెలంగాణ రైతాంగానికి అండగా నిలవాలని కోరారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ నుంచి రాష్ట్రానికి రావాల్సిన 2లో




2

## తేజస్వీ వ్యాఖ్యలను తొలగించేలా చేయండి

కిషన్ రెడ్డిని కోరిన మంత్రి పొన్నం

లోక్‌సభలో మాట్లాడిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోలేం

మంత్రి పొన్నం లేఖపై డిజిపి శివధర్ రెడ్డి స్పష్టీకరణ




## ప్రపంచానికి
# ఇరాన్ శుభవార్త

హోర్ముజ్ జలసంధి తెరిచి ఉంటుందని ప్రకటన

ఇరాన్ ప్రకటనతో భారీగా తగ్గిన ఆయిల్ ధరలు

టెహ్రాన్ : ప్రపంచానికి ఇరాన్ శుభవార్త అందించింది. హోర్ముజ్ జలసంధిని తెరిచి ఉంచినట్లు ప్రకటించింది. ఇజ్రాయిల్, లెబనాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం 2లో



## పదేళ్లు అధికారంలో ప్రజలను ఎందుకు కలవలేదు

ఇప్పుడే పాదయాత్ర చేయాలని ఎందుకనో

కెటిఆర్‌పై విమర్శలు గుప్పించిన కవిత

ప్రజాసమస్యలు పరిష్కరించే వరకు ప్రభుత్వాన్ని నిదీస్తాం

జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

హైదరాబాద్ : పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉందని.. పాదయాత్ర చేస్తానని మాజీ మంత్రి కేటీఆర్ ఇప్పుడు ఎందుకు అంటున్నారని 2లో



## మనస్సాక్షిగా మహిళా బిల్లుకు
# మద్దతు ఇవ్వండి

మహిళా శక్తిని గౌరవించడానికి ఇదో పెద్ద అవకాశం

మహిళలను గౌరవించేందుకు సమిష్టిగా కృషి చేద్దాం

ఎంపింలకు ప్రధాని మోడీ పిలుపు

న్యూఢిల్లీ : పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతివ్వాలని ఎంపీలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. పార్లమెంట్ సభ్యులంతా తమ మనస్సాక్షికి అనుగుణంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. దేశంలోని మహిళా శక్తిని గౌరవించడానికి ఇదో గొప్ప అవకాశమని ఆయన కొనియాడారు. మహిళలకు తగిన హక్కులను కల్పించ డంలో అందరం సమష్టిగా చరిత్ర సృష్టించాలన్నారు. 2లో



2 లో

## తేజస్వీ సూర్య మాటల్లో తప్పేముంది

**మంత్రి పొన్నం వ్యాఖ్యలపై బండి మండిపాటు**

న్యూఢిల్లీ : తెలంగాణ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి మాటలను కాంగ్రెస్ నేతలు ఎందుకు తప్పుబడుతున్నారంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు.

## 2023లోనే ఆమోదించిన బిల్లును
# అమలు చేయండి

లేదా కొత్తగా మహిళా బిల్లును తీసుకుని రండి

ప్రస్తుత బిల్లు మహిళా సాధికరత కోసం పెట్టింది కాదు

ఆ ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం

చర్చలో మోడీ ఓ మెజీషియన్ అంటూ రాహుల్ తీవ్రంగా విమర్శలు

రాహుల్ తీరుపై మండిపడ్డ స్పీకర్ బిర్లా..కేంద్రమంత్రులు

2 లో





## మహిళా సాధికారత కోసమే
# మా ప్రయత్నం

ఉత్తర దక్షిణ పేరుతో బిభజన సరికాదు

మహిళా బిల్లును వ్యతిరేకిస్తామని చెప్పడం సరికాదు

మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కుదరవు

డీలిమిటేషన్‌తో ఎస్సీ,ఎస్టీ సీట్లు పెరుగతాయి

లోక్‌సభలో చర్చకు సమాధానం ఇచ్చిన అమిత్ షా

## వైసిపి రాజకీయ
# దురుద్దేశ విమర్శలు

వాటిని పట్టించుకోమన్న అయ్యన్న పాత్రుడు 2



# రాష్ట్రంలో ఎక్సైజ్ పాలసీలో మార్పులు

ప్రజలకు నాణ్యమైన మద్యం సరఫరా

జగన్ హయాంలో కల్తీ మద్యానికి 30వేల మంది మృతి

ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి



గుంటూరు : రాష్ట్రంలో ఎక్సైజ్ శాఖలో గణనీయమైన మార్పులు తీసుకువచ్చామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం నియంత్రణ, నాణ్యత విషయంలో ప్రత్యేక చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో నాసిరకం మద్యం సేవించి అనేక మంది అనారోగ్యానికి గురయ్యారని, దాదాపు 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. జగన్ రెడ్డి పాలనలో సరైన బ్రాండ్లు అందుబాటులో లేక ప్రజలు ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చుకుని తాగాల్సి వచ్చిందని విమర్శించారు.

తరువాయి 2లో



## శాస్త్రిపురంపై ఓవర్ ప్రారంభం

జీహెచ్ఎంసీ, సౌత్ సెంట్రల్ రైల్వేల సమన్వయంతో ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టారు. శాస్త్రిపురం ఫ్లై ఓవర్ అందుబాటులోకి రావడంతో మైలార్ దేవ్‌పల్లి నుంచి ఫలక్‌నుమా మార్గంలో ప్రయాణం సులభతరం అయింది. ఉద్దమ్‌గడ్డ రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద ఏర్పడే ట్రాఫిక్ జామ్‌కు చెక్ పడనుంది. ప్రయాణ సమయం కూడా చాలా వరకు తగ్గనుంది. మైలార్‌దేవ్‌పల్లి, వట్టెపల్లి, ఫలక్‌నుమా, ఆర్టీసీ బస్ డిపో ప్రాంతాల మధ్య కనెక్టివిటీ మెరుగుపడింది.

# రేవంత్‌ది అసదుద్దీన్ ఓవైసీ ఫార్ములా

ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని రాష్ట్రాలకు సమానంగా సీట్ల పెంపు నిర్ణయం తీసుకుంటే.. తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారు. డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని మండిపడ్డారు. మహిళల రిజర్వేషన్లకు ఎంఐఎం వ్యతిరేకం. ఈ అంశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను కలిపింది ఎంఐఎం పార్టీయే. సీఎం రేవంత్‌రెడ్డిది హైబ్రిడ్ ఫార్ములా కాదు.. అది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. అలాగే మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణ, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. విపక్షాలు రాజకీయ దురుద్దేశంతో, ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నాయని ఆయన మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలును అడ్డుకోవాలనే తప్పుడు ఆలోచనతో ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు చేస్తున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందంటూ అపోహలు సృష్టించడం సరికాదని ఆయన హితవు పలికారు. ప్రతిపక్షాలు పార్లమెంట్ సాక్షిగా పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయని, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం వారి రాజకీయ ప్రయోజనాల కోసమేనని ధ్వజమెత్తారు. దక్షిణ భారతదేశానికి న్యాయం చెయ్యడమే మోదీ ఫార్ములా. న్యాయమా, అన్యాయమా అనే దానిపై చర్చకు సిద్ధమా? అసదుద్దీన్ హైబ్రిడ్ ఫార్ములా ఇది, రేవంత్ రెడ్డి ఫార్ములా కాదు. మజ్లిస్ పార్టీ మహిళ రిజర్వేషన్లకు వ్యతిరేకం. ఈ పార్టీ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను కలిపింది. కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్ పార్టీకి లొంగిపోయి పనిచేస్తోంది. 360 మంది తెలంగాణ ఉద్యమకారులను అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం కాల్చి చంపింది. తెలంగాణ చివరి దశ ఉద్యమంలో 1200 మంది ఆత్మ బలిదానం చేసుకున్నారు. పార్లమెంట్లో బిల్లు పెట్టినప్పుడు కాంగ్రెస్ ఎంపీలే కారం పొట్లాలు, పెప్పర్ స్ప్రేలు కొట్టారు. తెలంగాణ విభజనపై ఎంపీ తేజస్వి సూర్య చేసిన తన వ్యాఖ్యలు తప్పు అయ్యాయని ఒప్పుకున్నారు. మహిళ రిజర్వేషన్, నియోజకవర్గాల పెంపు బిల్లును అడ్డుకునేవారు చరిత్రహీనులుగా మిగిలిపోతారు. దక్షిణాది రాష్ట్రాలకు నరేంద్ర మోదీ న్యాయం చేస్తున్నారని అన్నారు.

## తేజస్వీ సూర్య మాటల్లో తప్పేముంది

రాష్ట విభజన సమయంలో కాంగ్రెస్ తప్పిదాలతో పలువురు యువకులు ఆత్మబలిదానాలు చేసుకున్నారని ఎంపీ తేజస్వి సూర్య చెప్పారని తెలిపారు. 2009లో కాంగ్రెస్ తెలంగాణ ఏర్పాటుకు సహకరించి మళ్లీ వెన్నక్కి తగ్గారని.. దీని గురించే తేజస్వి సూర్య మాట్లాడారని అన్నారు. రేవంత్ రెడ్డి గతంలో సోనియాగాంధీని బలిదేవత అన్నారన్న విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి అంటూ విమర్శించారు. అలాంటి రేవంత్ కుఏబినేట్‌లో ఉన్న పొన్నం తదితరులు గతాన్ని మరిచి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కరీంనగర్‌లో రణభేరి కార్యక్రమానికి రేవంత్ రెడ్డి తుపాకీ పట్టుకొని వెళ్లారని కేంద్ర మంత్రి తెలిపారు. 1400 మంది బలిదానాలకు హత్యలకు కారణమైన పార్టీ కాంగ్రెస్ అని ఆరోపించారు. ఒక్క ఓటు, రెండు రాష్ట్రాలు అనే నినాదానికి కట్టుబడి, రాష్ట్ర విభజనకు మద్దతు ఇచ్చింది బీజేపీ అని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ కావాలని అడ్డుకుంటోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ అవినీతి గురించి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు.

## రాష్ట్రంలో ఎక్సైజ్ పాలసీలో మార్పులు

దేశంలోనే అతిపెద్ద మద్యం స్కామ్ వైసీపీ ప్రభుత్వంలోనే జరిగిందని, దాదాపు రూ.3,500 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యం నియంత్రణలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గుంటూరు, కాకినాడ, విశాఖపట్నం, చిత్తూరు ప్రాంతాల్లో అత్యాధునిక ల్యాబ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. మద్యం నాణ్యతను పరీక్షించి, ప్రజలకు హానికరంగా ఉన్న బ్రాండ్లను పూర్తిగా తొలగించినట్లు చెప్పారు. ప్రజలు విచ్చలవిడిగా మద్యం సేవించకుండా ఉండేందుకు వైన్ షాపుల్లో ప్రత్యేక గదుల (రూమ్) అనుమతులు కూడా ఇచ్చామని మంత్రి వివరించారు. ప్రజల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా మద్యం విధానంలో మరిన్ని మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

### లోయలో పడ్డ వ్యాన్... పదిమంది దుర్మరణం

చెన్నై,ఏప్రిల్17 : తమిళనాడులో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వ్యాన్ లోయలో పడ్డ ఘటనలో 10 మంది చనిపోగా.. మరి కొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. కోయంబత్తూరు జిల్లాలోని వాల్పరై ఘాట్ రోడ్డులో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం కొండ ప్రాంతంలో ప్రయాణిస్తున్న ఓ వ్యాన్ అదుపుతప్పింది. వేగంగా వెళ్లి లోయలో పడిపోయింది. పైనుంచి కిందపడ్డంతో వ్యాన్ నుజ్జునుజ్జయింది. వ్యానులో ఉన్న పది మంది అక్కడికక్కడే చనిపోయారు. మరికొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ వారిని హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు 10 మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటకలోని యాదగిరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైవేపై వేగంగా దూసుకు వెళుతున్న కారు టైర్ పేలింది. ఒక్కసారిగా అదుపుతప్పిన కారు.. వేగంగా వెళ్లి బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ మంటలు వేగంగా కారుకు వ్యాపించాయి. కారు, బస్సు మంటల్లో దగ్ధం అయ్యాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరు మంది కాలి బూడిదయ్యారు. బస్సులో ఉన్న ఇద్దరు ప్రయాణికులకు స్వల్పగాయాలు అయ్యాయి.

# వైసిపి రాజకీయ దురుద్దేశ విమర్శలు

అరకులోయ : అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో వెలసిన శ్రీ శాంతామణి దేవి పండుగ వేడుకల్లో రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పాల్గొన్నారు. సకుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్న ఆయన, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలపై అయ్యన్నపాత్రుడు తనదైన శైలిలో స్పందించారు. రాష్ట్ర ఖజానా మొత్తాన్ని కేవలం అమరావతిపైనే ఖర్చు చేస్తున్నారని వైసీపీ చేస్తున్న విమర్శలను స్పీకర్ తోసిపుచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ సంపూర్ణ సహకారంతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారు. అందరి సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యం. ఇలాంటి పవిత్రమైన పుణ్యక్షేత్రంలో వైసీపీ నేతల గురించి మాట్లాడటం ఇష్టం లేదు. వారి గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. రాజకీయ దురుద్దేశంతో చేస్తున్న విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు' అని అన్నారు.

# 30లక్షలకు పైగా ధాన్యం సేకరణ చేపట్టండి

పెండింగ్ నిధులు, ఇతర అంశాలపై చర్చించారు..కేంద్ర మంత్రితో భేటీ అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..'దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో వరిధాన్యం ఉత్పత్తి జరుగుతోంది. ఈ రబీ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేయబోతున్నాం. వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసిన 48 గంటల్లోనే మద్దతు ధర డబ్బులు వారి ఖాతాల్లో వేస్తున్నాం. ఈ రబీ సీజన్‌లో 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా తీసుకోవాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశాం. కేంద్రం నుంచి తెలంగాణకు రూ.1,400 కోట్లు రావాల్సి ఉంది. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆ నిధులను విడుదల చేయాలని కోరాం. కేంద్రం పోషకాహార పంపిణీ పథకాన్ని రద్దు చేసింది. ఇది సరైన విధానం కాదు' అని తెలిపారు. ఢిల్లీలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పర్యటన బిజీబిజీగా సాగుతోంది. డీలిమిటేషన్‌పై హైబ్రిడ్ మోడల్‌కు మద్దతు కూడగట్టేందుకు ఆయన ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు దక్షిణాది రాష్ట్రాల వాదనను జాతీయస్థాయిలో వినిపించేందుకు కృషి చేస్తున్నారు. ప్రోరేటాకు వ్యతిరేకంగా దక్షిణాది ముఖ్యమంత్రులను రేవంత్ సమన్వయం చేస్తున్నారు. అదే సమయంలో పలువురు కేంద్రమంత్రులను రేవంత్ రెడ్డి కలుస్తున్నారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, పథకాలపై చర్చిస్తున్నారు.

# ప్రపంచానికి ఇరాన్ శుభవార్త

జరిగినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఇరాన్ ప్రకటనతో ప్రపంచవ్యాప్తంగా క్రూడాయిల్ ధరలు అమాంతంగా పడిపోయాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది.ప్రపంచ రవాణాకు కీలకంగా మారిన హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్టు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ప్రకటించారు. కాల్పుల విరమణ ఒప్పంద కాలం ముగిసేవరకూ హోర్ముజ్ పూర్తిగా తెరిచి ఉంటుందని ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఇరాన్ తాజా ప్రకటనతో.. హోర్ముజ్ జలసంధిలో ఇకపై అన్ని వాణిజ్య నౌకలకు ప్రవేశం ఉంటుంది. అంతర్జాతీయ వాణిజ్య రవాణాకు కీలకమైన ఈ జలమార్గంలో వాణిజ్య నౌకల ప్రయాణాలకు మార్గం సుగమమైంది. ఇరాన్, ఇతర దేశాల మధ్య వాణిజ్య సంబంధాలపై ప్రభావం చూపే ఈ జలమార్గంపై.. కొన్ని నెలలుగా వివాదాలు కొనసాగుతున్నప్పటికీ, కాల్పుల విరమణ సమయం ముగిసేవరకూ.. యథావిధిగా వాణిజ్య రవాణా కొనసాగించవచ్చని ఇరాన్ స్పష్టం చేసింది. కాగా.. హోర్ముజ్ జలసంధి ద్వారా రోజుకు సుమారు 20 శాతం ప్రపంచ క్రూడాయిల్ సరఫరా అవుతుందన్న విషయం తెలిసిందే. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నంత వరకు హర్మూజ్ జలసంధి తెరిచే ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. అమెరికా-ఇరాన్ మధ్య శాశ్వత శాంతి ఒప్పందం కుదిరేందుకు లెబనాన్-ఇజ్రాయెల్ కాల్పుల విరమణ అంగీకారం అంశం దోహదపడే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిందని అమెరికా అధ్యక్షుడ డొనాల్డ్ ట్రంప్ కూడా తన ట్రూత్ సోషల్ ఖాతాలో పేర్కొన్నారు. దీంతో పూర్తిస్థాయిలో నౌకల రాకపోకలు కొనసాగనున్నాయని తెలిపారు. ఇరాన్ ప్రకటనతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా పతనం అయ్యాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 8 శాతం మేర క్షీణించి 90 డాలర్లకు చేరింది. డబ్ల్యూటీఐ మే నెల కాంట్రాక్ట్ 9.8 శాతం క్షీణించి బ్యారెల్ ధర 85 డాలర్లకు చేరువైంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల కాలంలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100 డాలర్లు పైనే ట్రేడవుతూ వచ్చింది. క్రూడాయిల్ తగ్గుముఖం పట్టడం వల్ల దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు మేలు చేకూరుతుంది.

# మనస్సాక్షిగా మహిళా బిల్లుకు మద్దతు ఇవ్వండి

ఏకాభిప్రాయంతో ఈ సవరణను ఆమోదించాలని, దేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ఎక్స్ వేదికగా ప్రధాని కోరారు. 'నేను ఎంపీలందరినీ కోరేది ఒక్కటే.. మీ ఇంట్లోని తల్లిని, సోదరిని, కుమార్తెను, భార్యను గుర్తుంచుకుని.. మీ మనస్సాక్షి చెప్పిందే వినండి. దేశ మహిళలకు సాధికారత కల్పించడం అనేది ఒక గొప్ప అవకాశం. వారికి కొత్త అవకాశాలను దూరం చేయకండి. ఈ సవరణ ఏకాభిప్రాయంతో ఆమోదం పొందితే.. దేశంలో మహిళా శక్తి మరింత బలోపేతమవుతుంది. ఫలితంగా.. దేశ ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. రండి.. ఈ రోజు మనమందరం కలిసి చరిత్ర సృష్టిద్దాం' అని మోదీ పిలుపునిచ్చారు. మహిళలకు వారి హక్కులు ఇచ్చేందుకు సమయం ఆసన్నమైందని అంతకముందు జరిగిన చర్చ సందర్భంగా మోదీ ప్రసంగించారు. నారీ శక్తి వందన్ అధినియమ్‌కు చేసిన సవరణలపై పార్లమెంటులో సవివరమైన, సుదీర్ఘ రీతిలో చర్చ జరుగుతోందన్నారు. ఇప్పటివరకు జరిగిన చర్చలో సదరు బిల్లుపై ఉన్న అపోహలను తొలగించామని, సభ్యుల సందేహాలన్నిం టినీ నివృతి చేశామని ఆయన తెలిపారు. ఇది చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్య అని, దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్‌ను రాజకీయం చేశారని, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో మహిళలకు సరైన ప్రాతినిధ్యం కల్పించాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు. ఈ బిల్లు లోక్‌సభలో ఓటింగ్‌కు రానున్న నేపథ్యంలో ఎంపీలంతా సంపూర్ణ మద్దతు ప్రకటించాలని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు మోదీ. సభ్యులు సున్నితంగా వ్యవహరించాలని, 'నారీ శక్తి' మనోభావాలను దెబ్బతీయవద్దని కోరారు. నారీ శక్తి వందన్ అధినియమ్‌కు సవరణలు చేసే విషయంపై పార్లమెంట్‌లోచర్చ జరుగుతోంది. నిన్నరాత్రి ఒంటిగంట వరకు చర్చ నడిచింది. బిల్లుల విషయంలో ఉన్న అపోహలను తొలగించేలా ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. నాలుగు దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఎన్నో రాజకీయాలు జరిగాయి. దేశ జనాభాలో సగ భాగంగా ఉన్నవారు తమ హక్కులను పొందడానికి సమయం ఆసన్నమైంది. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా నిర్ణయాలు తీసుకునే పక్రియలో వారికి ప్రాతినిధ్యం లేకపోవడం సరికాదు. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలకు నా విన్నపం ఒక్కటే. పూర్తి పరిశీలన తర్వాత మహిళా రిజర్వేషన్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకొని ఓటు వేయండి' అని ప్రధాని కోరారు. మహిళా శక్తికి సేవచేయడానికి, వారిని గౌరవించేందుకు ఇదొక అద్భుత అవకాశం. మహిళలకు కొత్త అవకాశాలను దూరం చేయొద్దు. చరిత్ర సృష్టించేందుకు ఈ రోజు మనమంతా ఏకమవుదాం' అని 'ఎక్స్'లో పిలుపునిచ్చారు.

# 2023లోనే ఆమోదించిన బిల్లును అమలు చేయండి

న్యూఢిల్లీ : ఇప్పటికే 2023లోనే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిందని, దానినే అమలు చేయాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ప్రస్తుతం ప్రతిపాదించిన బిల్లు మహిళల సాధికారత కోసం పెట్టింది కాదని విమర్శించారు. ఈ బిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. అంతగా కావాలంటే పాత మహిళా రిజర్వేషన్ల బిల్లును రద్దు చేసి.. ఇప్పుడు కొత్తగా మళ్లీ తీసుకురావాలని కేంద్రానికి సూచించారు. లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై లోక్‌సభలో చర్చ సందర్భంగా రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. మహిళా బిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోంది. అంతగా కావాలంటే పాత బిల్లును రద్దు చేసి.. మళ్లీ తీసుకురండి. మేం ఎలాంటి అభ్యంతరాలు చెప్పకుండా మద్దతిస్తాం. బీసీ, దళితులు, మైనార్టీలు, మహిళల పట్ల ఈ బిల్లు క్షమించరాని, క్రూరమైన చర్య. ఓబీసీ సోదరుల నుంచి అధికారం లాక్కునే ప్రయత్నం జరుగుతోందన్నారు. కులగణన ప్రారంభమైందని హోంమంత్రి అమిత్ షా చెప్పారు. ఇప్పుడు కులగణనతో సంబంధం లేకుండా డీలిమిటేషన్ ఎందుకు జరుగుతోందని, విపక్షాలన్నీ దీన్ని ఓడిస్తాయని రాహుల్ గాంధీ అన్నారు. న్యాయవ్యవస్థ, ప్రైవేటు రంగం వంటి కీలక రంగాల్లో ఓబీసీలు, దళితులు ఎక్కడున్నారు? దేశ అత్యున్నత బ్యూరోక్రసీలో వీరు ఎక్కడున్నారు? ఓబీసీలకు అధికారం, భాగస్వామ్యం ఇచ్చేందుకు భాజపా సిద్ధంగా లేదు. తన ప్రాబల్యం తగ్గిపోతోందన్న భయం ఆ పార్టీకి పట్టుకుంది. దక్షిణాది, ఈశాన్య, చిన్న రాష్ట్రాలను భాజపా గౌరవించడం లేదని రాహుల్ ధ్వజమెత్తారు. లోక్‌సభలో రాహుల్ ప్రసంగిస్తూ.. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా మోదీని పరోక్షంగా ఇంద్రజాలికుడంటూ రాహుల్ వ్యాఖ్యానిం చడం సభలో గందరగోళానికి కారణమైంది. దీనిపై స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేయగా.. భాజపా సభ్యులు కూడా రాహుల్ తీరుపై మండిపడ్డారు. ప్రధాన మంత్రిని అవమానిస్తున్నారని, ఇందుకు రాహుల్ వెంటనే క్షమాపణ చెప్పాలని కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ద్వారా దేశంలో కులగణన డిమాండ్‌ను పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందన్నారు. 'ఈ బిల్లు ఆమోదం పొందదని బీజేపీకి కూడా తెలుసు. వాళ్లంత తెలివతక్కువ వాళ్లు కాదు. ఈ బిల్లును విపక్షంలోని ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తారని వాళ్లకు తెలుసు. అయినా ప్రధాని రెండు సందేశాలు పంపాలనుకున్నారు. ఇందులో మొదటిది.. దేశ ఎలక్టోరల్ మ్యాప్‌ను ఆయన మార్చాలను కున్నారు. రెండవది.. తాను మహిళా పక్షపాతినని మరోసారి చాటిచెప్పాలని అనుకున్నారు. బాలాకోట్ మెజిషియన్, డీమోనిటైజేషన్ మెజియన్, సిందూర్ మెజిషియన్ అక్షస్మాత్తుగా పట్టుబడ్డారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు.ప్రధానమంత్రిని ఉద్దేశించి రాహుల్ చేసిన వ్యాఖ్యలపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధానిపై అభ్యంతరకరమైన భాష వాడటాన్ని తప్పుపట్టారు. బాలాకోట్ దాడులు, ఆపరేషన్ సిందూర్ ప్రస్తావనతో దేశాన్ని, మిలటరీని అవమానపరుస్తున్నారని అన్నారు. దేశ ప్రధానమంత్రి గురించి విపక్ష నేత ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని, ఆ వ్యాఖ్యాలను రికార్డులను నుంచి తొలగించాలని స్పీకర్ ఓం బిర్లాను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కోరారు. అందుకు స్పీకర్ అంగీకరించారు.

## పదేళ్లు అధికారంలో ప్రజలను ఎందుకు కలవలేదు

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉండి ఆయన ఎందుకు ప్రజల్లోకి పోలేదని నిలదీశారు. ప్రజా సమస్యలను పరిష్కరించేది అధికార పార్టీనేనని.. అందుకే కాంగ్రెస్‌ను టార్గెట్ చేశానని కవిత తెలిపారు. ఆయా సమస్యల ఆధారంగా బీఆర్ఎస్‌పైన కూడా మాట్లాడుతానని అన్నారు. పరిగిలో రైతు దీక్షకు మద్దతు ఇచ్చేందుకు వెళ్తున్నానని చెప్పి.. హరీశ్‌రావు హౌస్ అరెస్ట్ అయ్యారని తెలిపారు. ఆ సమయంలో హరీశ్‌రావు ఫోన్ చేస్తే పోలీసులు ఆయన ఇంటికి వచ్చి హౌస్ అరెస్ట్ చేశారని విమర్శించారు. హరీశ్‌రావు పరిగిదాకా కూడా పోలేదని ఎద్దేవా చేశారు. తాము పరిగి వెళ్లి రైతులకు మద్దతుగా దీక్షలో పాల్గొన్నామని స్పష్టం చేశారు. పోలీసులు తమను అరెస్టు చేశారని.. రైతులకు మద్దతుగా తాము నిలిచామని తెలిపారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఏ విధంగానైతే పోరాటం చేశామో...అదే విధంగా పరిగిలో కూడా పోరాటం చేశానని వెల్లడించారు. భవిష్యత్తులో కూడా పోరాటం చేస్తానని కవిత పేర్కొన్నారు. తెలంగాణలో అన్నివర్గాలకు అధికారం రావాలన్నదే తన ధ్యేయమని వ్యాఖ్యానించారు. అందరికీ అధికారమని మాట్లాడుతారని.. దీనిని ఆచరణలోకి తీసుకురావాలని తాను ప్రారంభించాకే తనకు కష్టాలు వచ్చాయని పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి పెట్టబోయే పార్టీకి మారోజు వీరన్న అనుచరులు, సీపీయూఎస్ఐ, దళిత బహుజన రాజ్యాధికార సంస్థ మద్దతు ఇచ్చారని తెలిపారు. శుక్రవారం జాగృతి కార్యాలయంలో కవితను పలువురు కలిశారు. ఆమెను కలిసిన వారిలో సీపీయూఎస్ఐ కేంద్ర కమిటీ కార్యదర్శి కోదండం, రాష్ట్ర కార్యదర్శి వెంకన్న, దళిత బహుజన రాజ్యాధికార కన్వీనర్ గుడిపల్లి రవన్న, మారోజు వీరన్న సహచరులు కిషన్ నాయక్ సహా పలువురు నాయకులు ఉన్నారు. ఈసమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. ప్రతి కష్టాన్ని పాఠంగా భావిస్తూ.. సామాజిక తెలంగాణ సాధించే వరకు పోరాటం చేస్తానని కవిత స్పష్టం చేశారు. సర్వోదయ తెలంగాణ తన లక్ష్యమని.. అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. మారోజు వీరన్న అనుచరుల మద్దతు ఎంతో శక్తిని ఇస్తుందని అన్నారు. తమతో మారోజు వీరన్న అనుచరులు కలవటమంటే ఇక తమను ఆపే శక్తే లేదని పేర్కొన్నారు. ఏదైనా శని ఉంటే.. అది తొలగిపోవడం కోసమే తాను వారణాసి వెళ్లి పూజలు చేశానని ప్రస్తావించారు. తాను పెట్టే పార్టీ సక్సెస్ కావాలని కోరుకున్నానని తెలిపారు. బీఆర్ఎస్‌కు చెందిన కొందరు మాజీ ఎమ్మెల్యేలు తనను కలిశారని.. పేర్లు మాత్రం తాను బయటకు చెప్పనని అన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్‌ను ముందుగా టార్గెట్ చేశానని తెలిపారు. తనను ఆ పార్టీ సస్పెండ్ చేసిందని కవిత ప్రస్తావించారు.

## తేజస్వీ వ్యాఖ్యలను తొలగించేలా చేయండి

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అవమానించే విధంగా భాజపా ఎంపీ తేజస్వీ సూర్య పార్లమెంట్‌లో మాట్లాడారని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. తెలంగాణ ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం సరికాదన్నారు. తేజస్వీ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఇందుకు లోక్‌సభ స్పీకర్‌ను ఒప్పించాలని ఆయన కోరారు. ఎంపీ విషయంలో చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డికి మంత్రి లేఖ రాశారు. ఈ లేఖపై డీజీపీ స్పందించారు. చట్టసభల్లో మాట్లాడిన అంశాలపై చర్యలు తీసుకునే అధికారం పోలీసులకు ఉండదని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా తేజస్వి మాట్లాడుతుంటే బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు మౌనంగా ఉన్నారని మంత్రి మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటును భారత్-పాకిస్తాన్ విభజనతో పోల్చడం సరికాదన్నారు. ఎంపీపై చర్యలు తీసుకోవాలని డీజీపీ శివధర్‌రెడ్డిని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో డీలిమిటేషన్‌పై చర్చలో ఎంపీ తేజస్వి సూర్య పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజనను ప్రస్తావిస్తూ.. బ్రిటీష్ వాళ్లు చేసిన భారత్-పాకిస్తాన్ విభజనకంటే దారుణంగా ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరే చేశారంటూ ఎంపీ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ విభజనపై ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి.

## కాళేశ్వరంపై ఎలాంటి దురుద్దేశ్యం లేదు

మరమ్మతులు, పునరుద్ధరణపై చర్చించామని తెలిపారు. గోదావరి వరదలు వచ్చేలోగా సాయిల్ టెస్టింగ్, డిజైన్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంపై కేసీఆర్ హయాంలో చేసిన పొరపాటు తెలంగాణ ప్రజలకు తెలుసునని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరాన్ని నిర్మించారని, అది కూలిపోయిందని అన్నారు. కాళేశ్వరంపై దాదాపు రూ.97 వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసి ఆ ప్రాజెక్టు నిర్మించారని తెలిపారు. కాళేశ్వరంపై ప్రతి ఏడాది రూ.10వేల కోట్ల వడ్డీ కడుతున్నామని తెలిపారు. ప్రజాధనం ఉపయోగించడంతోనే దాన్ని ఎలా రిపేర్ చేయాలో ఆలోచించి ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారని అన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళు న్నామని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ డ్యామేజ్ సాయిల్ టెస్ట్, డిజైన్ల ఖర్చులను కాంట్రాక్ట్ సంస్థలే భరిస్తాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## మహిళా సాధికారత కోసమే మా ప్రయత్నం

న్యూఢిల్లీ : లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై రెండ్రోజులగా సుదీర్ఘ చర్చ జరిగింది. శుక్రవారం విపక్ష నేత రాహుల్ గాంధీ, తదితరులు మాట్లాడారు. సవరణ బిల్లును ఓడిస్తామని ప్రకటించారు. అనంతరం సభలో సాయంత్రం కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇచ్చారు. మహిళా సాధికారత కోసమే ఈ బిల్లులను తీసుకొచ్చామని, వచ్చే ఎన్నికల్లో వీటిని అమలు చేసేలా ముందుకెళ్తున్నామన్నారు. అయితే, ఇండి కూటమి సభ్యులు దీన్ని వ్యతిరేకించారని అన్నారు. మూడు బిల్లులపై సమగ్రంగా చర్చ జరిగింది. 130 మంది ఎంపీలు తమ అభిప్రాయాలు చెప్పారు. 56 మంది మహిళా ఎంపీలు మాట్లాడారు. మహిళా బిల్లును విపక్షాలు వ్యతిరేకించాయి. ప్రస్తుత లోక్‌సభ నియోజకవర్గాల జనాభాలో భారీ వ్యత్యాసం ఉంది. ఒకచోట 39లక్షల మంది ఓటర్లు ఉంటే మరోచోట 60 వేల మంది ఓటర్లు ఉన్నారు. ఒక ఎంపీ లక్షలాది మంది సమస్యలను ఎలా ఆలకించగలరని ఈ సందర్భంగా ప్రస్తావించారు. నియోజకవర్గాల ఓటర్ల సంఖ్యలో సమతుల్యతను సాధించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఎంపీ తన నిధులు సమర్థంగా వినియోగించుకునేందుకు ఇది తోడ్పడుతుంది. అందుకే ఈ రాజ్యాంగ సవరణకు ఉపక్రమించామని అమిత్ షా పేర్కొన్నారు. మల్కాజ్‌గిరిలో దాదాపు 30లక్షల మందికిపైగా ఓటర్లు ఉండగా.. దిల్లీ, బెంగళూరు, గాజియాబాద్‌లో 20లక్షలకుపైగా ఓటర్లు ఉన్నారు. డీలిమిటేషన్ తర్వాత ఆయా చోట్ల రెండు సీట్లు వస్తాయి. దీనివల్ల సభ్యులకు, ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. 1972లో ఇందిరా గాంధీ ప్రభుత్వం లోక్‌సభ సీట్లను 545కు పెంచింది. ఇన్నాళ్లపాటు సీట్లు సంఖ్య పెంచకుండా అడ్డుకున్న ఘనత వారిదే అని కాంగ్రెస్‌పై అమిత్ షా విరుచుకుపడ్డారు. కాలానికి అనుగుణంగా సీట్ల సంఖ్యలోనూ మార్పు రావాలని అన్నారు. ఉత్తరాది.. దక్షిణాది.. ఆ ప్రాంతం.. ఈ ప్రాంతం అంటూ విభజన రాజకీయాలు చేస్తున్నారు. దేశమంతా ఒక్కటే. ఉత్తర, దక్షిణ బేధాలు చూపి దేశాన్ని ముక్కలు చేస్తామంటే కుదరదు. దక్షిణమే కాదు.. కేంద్రపాలిత ప్రాంతాలకు సైతం దేశంపై అంతే అధికారం ఉంటుంది. ప్రాంతాలకు అతీతంగా ఈ సభలోని సభ్యులందరికీ సమాన అధికారం ఉంటుందని అమిత్ షా పేర్కొన్నారు. మహిళా బిల్లును, డీలిమిటేషన్ బిల్లును వేరు చేస్తారా? ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం 50శాతం పెంచుతారా? అని కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. దీనికి అమిత్ షా బదులిస్తూ.. 50శాతం పెంచుతూ సవరణ తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గంట సమయం ఇస్తే బిల్లులో సవరణలు చేసుకొని వస్తామని.. బిల్లుకు మద్దతిస్తారేమో చెప్పాలని అమిత్ షా స్పష్టం చేశారు. కూటమి లక్ష్యంగా ఘాటైన విమర్శలు చేశారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే చారిత్రాత్మక నిర్ణయాన్ని 'ఇండి' కూటమి సభ్యులు వ్యతిరేకించడం విచారకరమని అమిత్ షా అన్నారు.

# రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వం

### బ్రిటన్ పౌరసత్వం కలిగి ఉన్నట్లు ఆరోపణలు

### విచారణకు ఆదేశించిన అలహాబాద్ హైకోర్టు

న్యూఢిల్లీ,ఏప్రిల్17 : ద్వంద్వ పౌరసత్వం ఆరోపణలకు సంబంధించి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయాలని అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై విచారణ జరపాలని అక్కడి లఖ్‌నవూ బెంచ్ ఉత్తర్వులిచ్చింది. ఈ కేసు దర్యాప్తును ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వమే స్వయంగా నిర్వహించాలని లేదంటే.. ఒక కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని పేర్కొంది. రాహుల్ గాంధీ పౌరసత్వం అంశంపై కొన్నేళ్లుగా వివాదం నలుగుతూనే ఉంది. రాహుల్ గాంధీ బ్రిటన్ పౌరుడని, భారత పౌరసత్వాన్ని రద్దు చేయాలంటూ భాజపా నేత సుబ్రహ్మణ్య స్వామి, కర్ణాటకకు చెందిన భాజపా కార్యకర్త విఘ్నేశ్ శిశిర్ డిమాండ్ చేస్తున్నారు. బ్రిటన్‌లో నమోదైన ఓ కంపెనీకి రాహుల్ గాంధీ డైరెక్టర్, సెక్రటరీగా ఉన్నారని సుబ్రహ్మణ్య స్వామి కొంతకాలంగా చెబుతున్నారు. ఆ కంపెనీ వార్షిక నివేదికలో తనను తాను బ్రిటిష్ పౌరుడిగా రాహుల్ గాంధీ పేర్కొన్నట్లు స్వామి తెలిపారు. వేరే దేశంలో పౌరుడిగా ఉన్న వ్యక్తి ఆ దేశ పౌరసత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవాల్సి ఉంటుందన్నారు. అలా చేయకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 9, భారతీయ పౌరసత్వ చట్టం, 1955ని ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. ఇదే అంశంపై గతంలో కేంద్రానికి కూడా లేఖ రాశారు. మరోవైపు, రాహుల్ గాంధీ పౌరసత్వానికి సంబంధించిన రికార్డులు ఉన్నాయని విఘ్నేశ్ చెబుతున్నారు. ఈ క్రమంలోనే న్యాయస్థానాలను ఆశ్రయించారు. పౌరసత్వానికి సంబంధించిన అంశాలపై నిర్ణయం తీసుకునే అధికారం తనకు లేదంటూ లఖ్‌నవూలోని ప్రత్యేక ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు గతంలో శిశిర్ పిటిషన్‌ను తోసిపుచ్చింది. దాంతో అతడు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలోనే తాజా ఆదేశాలు వెలువడ్డాయి.

# రొటేషన్‌లో మహిళలకు ప్రధాని పదవి

### కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ సూచన

న్యూఢిల్లీ,ఏప్రిల్17 : మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్‌పై తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ లోక్‌సభలో మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 2002లో డీలిమిటేషన్ చేశారు. ప్రస్తుతం మనం 2026లో ఉన్నాం. ఇప్పుడు 2011 జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన చేస్తామంటున్నారు. 15 ఏళ్లు గడిచిపోయింది. దీనిపై ప్రజలకు ఎలా న్యాయం చేస్తారు. మహిళా రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదు. కానీ, ఈ అంశాన్ని డీలిమిటేషన్‌తో లింక్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నాం. ప్రభుత్వానికి నేను కొన్ని సూచనలు చేస్తున్నా. మంత్రిత్వ శాఖలో మహిళలకు 50 శాతం రిజర్వ్ చేయాలి. ప్రధాని పదవిని కూడా రొటేషన్ పద్ధతిలో మహిళలకు రిజర్వ్ చేయాలి. ఎందుకంటే 2029 ఎన్నికల్లో భాజపా అధికారంలోకి రాదని కల్యాణ్ బెనర్జీ అన్నారు.

# బిజెపి ఎంపిలకు విప్ జారీ

### ఢిల్లీలోనే ఉండాలని ఆదేశం

న్యూఢిల్లీ,ఏప్రిల్17 : పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ బిల్లుపై కౌంటింగ్ సందర్భంగా బీజేపీ ఎంపీలకు మూడు లైన్ల విప్ జారీ చేసింది పార్టీ అధిష్ఠానం. ఎంపీలంతా తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించింది. ఈ విప్ ద్వారా బెంగాల్, తమిళనాడు ఎన్నికల ప్రచారంలో ఉన్న సభ్యులను కూడా ఢిల్లీకి రప్పించినట్టు తెలుస్తోంది. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కీలక బిల్లుల ఆమోదం కోసం హైకమాండ్ అన్ని ఏర్పాట్లు చేసినట్టు సమాచారం. బీజేపీ ఎంపీలందరూ తప్పనిసరిగా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు హాజరుకావాలని 'త్రీ-లైన్ విప్'లో పేర్కొంది హైకమాండ్. ప్రభుత్వం కొన్ని కీలకమైన బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదించే అవకాశం ఉన్నందున.. సభ్యులంతా సభకు హాజరై ప్రభుత్వానికి మద్దతు తెలపాలంది. కేంద్ర మంత్రులతో సహా ఎంపీలందరూ సభలోనే ఉండాలని, ఈ విషయంలో ఎవరికీ మినహాయింపు ఉండదని స్పష్టం చేసింది.

# మరింత పెరిగిన బంగారం ధర

హైదరాబాద్,ఏప్రిల్17 : భారత్‌లో బంగారం ధరలు గత మూడు రోజులుగా ఎంతో కొంత పెరుగుతూనే ఉన్నాయి. అంతర్జాతీయ అనిశ్చితులు తగ్గుతాయన్న సంకేతాలతో పాటు అక్షయ తృతీయ సమీపిస్తున్న తరుణంలో పసిడికి డిమాండ్ అంతకంతకూ పెరుగుతోంది. గత మూడు రోజుల్లో పసిడి ధరలు సుమారు రూ.3 వేల మేర పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ కథనం ప్రకారం, ఉదయం 6.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,55,580గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,42,610గా ఉంది. వెండి ధర దాదాపుగా స్థిరంగానే ఉంది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,74,900ల వద్ద కొనసాగుతోంది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,56,670గా ఉంది. ముంబైలో రూ.1,55,580 వద్ద, న్యూఢిల్లీలో రూ.1,55,730 వద్ద కదలాడుతోంది. దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో వెండి ధరలు రూ.2.69 లక్షల నుంచి రూ.2.74 లక్షల వరకూ ఉన్నాయి. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం ఔన్స్ (31.10 గ్రాములు) 24 క్యారెట్ల పసిడి ధర 4,787 డాలర్ల వద్ద, ఔన్స్ వెండి ధర 78 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## మద్యం కేసులో వాసుదేవరెడ్డికి బెయిల్

విజయవాడ,ఏప్రిల్17 : ఏపీ మద్యం కుంభకోణం కేసులో ఏ2 నిందితుడు వాసుదేవ రెడ్డికి ఏసీబీ కోర్టు శుక్రవారం)బెయిల్ మంజూరు చేసింది. షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. 2, 4 సోమవారాల్లో విచారణ అధికారుల ఎదుట హాజరవ్వాలని, పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని, లక్ష చొప్పున ఇద్దరు పూచీకత్తులు ఇవ్వాలని ఆదేశించింది. ఇదే కేసులో మరో నిందితుడు ప్రణయ్ ప్రకాశ్ బెయిల్ పిటిషన్‌ను ఏసీబీ కోర్టు డిస్మిస్ చేసింది.

# సిగాచీ బాధితులను నట్టేట ముంచారు

### కోటి పరిహారం హామీ ఇచ్చి మరచిన సిఎం

### మరోమారు మండిపడ్డ హరీష్ రావు




హైదరాబాద్ : సిగాచి ప్రమాద బాధితులకు ఇచ్చిన హామీని కూడా నిలుపుకోలేక తన అసమర్థతను సీఎం రేవంత్ రెడ్డి మరోసారి చాటుకున్నారని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. నాడు కోటి రూపాయల సాయం అంటూ సిగాచి బాధితులను నమ్మబలికి అందులో సగం కూడా వారికి చేర్చని రేవంత్ రెడ్డి నయవంచనలో తనను మించినవారు లేరని నిరూపించుకున్నారని అన్నారు. ఆ పూటకు మాటలు చెప్పడం.. ఆ తర్వాత తాను చెప్పిన మాటలకే విలువ ఇవ్వకపోవడం రేవంత్ రెడ్డికే చెల్లిందని విమర్శించారు. సిగాచి పరిశ్రమ అగ్నిప్రమాదంలో 54 మంది అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోతే, ఆ బాధితుల కుటుంబాలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు వివేక్, దామోదర రాజనర్సింహ.. మృతదేహాల సాక్షిగా ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించారని తెలిపారు. కానీ ఇదంతా కంటితుడుపు చర్యే అని, బాధితులకు జరిగిన న్యాయం శూన్యమని ప్రభుత్వం అసెంబ్లీలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంతో తేటతెల్లమైందని పేర్కొన్నారు. యాజమాన్యం, ప్రభుత్వం కుమ్మక్కై పరిహారం లెక్కల్లో చేస్తున్న మోసం అంతా ఇంతా కాదని హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వం అసెంబ్లీలో సమర్పించిన అధికారిక లెక్కల ప్రకారం, 54 మంది బాధితులకు కలిపి ఇప్పటివరకు చెల్లించిన రూ. 24.51 కోట్లను విభజించి చూస్తే, ఒక్కో కార్మికుడి కుటుంబానికి సగటున అందిన పరిహారం కేవలం రూ. 45.40 లక్షలు మాత్రమే అని తెలిపారు. అంటే ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన కోటి రూపాయల పరిహారంలో ఇంకా ఒక్కో కుటుంబానికి దాదాపు రూ. 54.60 లక్షల చొప్పున, మొత్తంగా రూ. 29.48 కోట్ల బకాయిని ఈ ప్రభుత్వం ఎగ్గొట్టి బాధితులను నట్టేట ముంచిందని మండిపడ్డారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ పేద బాధిత కుటుంబాలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. ఇక్కడ మరో మోసం దాగుందని విమర్శించారు. యాజమాన్యం తాము 40 నుంచి 42 లక్షలు ఇస్తున్నామని కోర్టుల ముందు ఒప్పుకుందని చెప్పారు. అసలు నిజమేంటంటే, వారు సొంతంగా ఇచ్చిన 25 లక్షలకు.. కార్మికులు చనిపోవడం వల్ల చట్టబద్ధంగా వారికి రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్సూరెన్స్ డబ్బులను కూడా కలుపుకుని ఈ లెక్కలు చూపిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, యాజమాన్య అమానవీయతకు, దిగజారుడుతనానికి పరాకాష్ట అని మండిపడ్డారు. అంతేకాదు, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన కార్మికుల వైద్య ఖర్చులను కూడా ఈ అరకొర పరిహారంలోనే కోత విధించడం దారుణమని అన్నారు. ఇక ప్రమాదంలో కాలి బూడిదై ఆచూకీ దొరకని 8 మంది కార్మికుల కుటుంబాలను డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పించుకున్న దుర్మార్గ ప్రభుత్వం ఇది అని విమర్శించారు. ఇది కేవలం ఒక ప్రమాదం కాదు, యాజమాన్యం నిర్లక్ష్యంతో జరిగిన సామూహిక హత్య అని హరీశ్‌రావు అన్నారు. ఫ్యాక్టరీలో భద్రతా ప్రమాణాలు గాలికొదిలేశారని విచారణలో ఆధారాలతో సహా స్పష్టంగా తేలిందని చెప్పారు. బాధితుల పక్షాన హైకోర్టులో కేసు వేసి, న్యాయస్థానం మొట్టికాయలు వేస్తే తప్ప పోలీసులు కదలలేదని హరీశ్‌రావు తెలిపారు. తూతూ మంత్రంగా ఎండీని అరెస్టు చేయడం, వెంటనే ఆయన బెయిల్ మీద బయటకు వచ్చేలా పరోక్షంగా సహకరించడం చూస్తుంటే.. ప్రభుత్వానికి, కంపెనీ యాజమాన్యానికి మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందాలు ఏమిటో అర్థం అవుతూనే ఉందన్నారు. ఆనాడు మృతదేహాల సాక్షిగా ఇచ్చిన మాట ప్రకారం, పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులతో సంబంధం లేకుండా ప్రతి బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# తేజస్వీ వ్యాఖ్యలపై బిఆర్ఎస్ సీరియస్

### ఢిల్లీలో ఫిర్యాదు చేసిన మాజీమంత్రి శ్రీనివాసగౌడ్

న్యూఢిల్లీ,ఏప్రిల్17 : బీజేపీ యువ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ తేజస్వి సూర్య పార్లమెంటులో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ దుమారం రేపుతున్నాయి. తెలంగాణ ఏర్పాటును పాకిస్థాన్ విభజనతో పోల్చారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ అంశంపై ఆయన ఢిల్లీలో పోలీసులకు ఫిర్యాదు చేసారు. లోక్‌సభ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో తేజస్వి సూర్య చిక్కుల్లో పడ్డారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారంటూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆయనపై ఢిల్లీలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ ఫిర్యాదు నమోదైంది. ఈ సందర్భంగా ఆయన ఎంపీ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ విభజన ప్రక్రియను పాకిస్థాన్ ఏర్పాటుతో లేదా దేశ విభజనతో పోల్చడం అత్యంత హేయమని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. వందలాది మంది బలిదానాలు, దశాబ్దాల పోరాటం తర్వాత సిద్ధించిన తెలంగాణను ఇలా అవమానించడం రాష్ట్ర ప్రజల భావాలను గాయపరచడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటు వేదికగా ఓ బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, ఓ రాష్ట్రం పట్ల ఇంతటి వివక్షతో మాట్లాడటం సరికాదని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచిన తేజస్వి సూర్యపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ గౌడ్ పోలీసులను కోరారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఓ చారిత్రక ఘట్టాన్ని తక్కువ చేసి చూపడం రాజ్యాంగ విరుద్ధమని వాదించారు. 'తెలంగాణ అంటే పోరాటాల గడ్డ' అని.. అలాంటి పవిత్రమైన ఉద్యమ ఫలితాన్ని పాకిస్థాన్‌తో పోల్చడం తేజస్వి సూర్య అజ్ఞానానికి పరాకాష్ట అని ధ్వజమెత్తారు. ఆయన వెంటనే తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై తెలంగాణ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో కూడా ఎంపీ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు.

# 9 ఏళ్ల బాలికను కాపాడిని ముగ్గరు

### వారిని పిలిచి సన్మానించిన కమిషనర్

### ప్రజా చైతన్యంతోనే పోలీసింగ్ పటిష్టం

### ప్రజలు అప్రమత్‌ంగా ఉండాలన్న సజ్జన్నార్

హైదరాబాద్,ఏప్రిల్17 : తొమ్మిదేళ్ల బాలికను కాపాడిన ముగ్గురు సామాన్య పౌరులను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రశంసించారు. చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న కామాంధుడిని ప్రాణాలకు తెగించి పట్టుకున్న సెజల్, గణపతి, కాశీనాథ్‌లను సీపీ సజ్జనార్ ప్రత్యేకంగా అభినందించారు. బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీపీ సజ్జనార్ ఈ ముగ్గురును శాలువాలతో సన్మానించి, ప్రశంసా పత్రాలతో పాటు నగదు రివార్డును అందజేశారు. 'వీరి సాహసం సమాజానికి ఒక గొప్ప సందేశమని ప్రశంసించారు. మహిళలు, చిన్నారుల రక్షణలో పౌరులు ఇలాగే అప్రమత్తంగా ఉంటే నేరాలను అరికట్టవచ్చని వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరూ 'ప్రజా పోలీస్'గా మారాలని సీపీ సజ్జనార్ సూచించారు. ఈ సందర్భంగా గతంలో గోల్కొండలో ఎనిమిదేళ్ల బాలికను కాపాడిన మహ్మద్ ఫిరోజ్ ఉదంతాన్ని కూడా సీపీ సజ్జనార్ గుర్తు చేశారు. ప్రజల చైతన్యమే నేర నియంత్రణలో పోలీసులకు కొండంత అండ అని అభిప్రాయపడ్డారు. సమాజంలో ఏవైనా అనుమానాస్పద ఘటనలు లేదా నేరాలు జరుగుతున్నప్పుడు భయపడకుండా ఈ మార్గాల ద్వారా పోలీసులను సంప్రదించాలని సీపీ సజ్జనార్ సూచించారు. అత్యవసర సహాయం కోసం డయల్ 100 లేదా హైదరాబాద్ పోలీస్ వాట్సాప్ నంబర్ 94906 16555లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, జూబ్లీహిల్స్ ఎస్ఐ సోమ శేఖర్ తదితరులు పాల్గొని సాహస యువతను అభినందించారు. ఈ నెల 14వ తేదీన సెజల్ తన స్నేహితుడు గణపతితో కలిసి యూసుఫ్‌గూడ నుంచి మాదాపూర్ వైపు బైక్‌పై వెళ్తుండగా, జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ – 10 సమీపంలో ఓ హృదయ విదారక దృశ్యాన్ని గమనించారు. ఓ వ్యక్తి చిన్నారితో అత్యంత అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. ఆ బాలిక కళ్లలో కనిపించిన భయం సెజల్, గణపతిలను కదిలించింది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వారు నిందితుడిని అడ్డుకున్నారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న కాశీనాథ్, నారాయణలు కూడా తోడవడంతో నిందితుడు తప్పించుకోలేకపోయాడు. వెంటనే డయల్ 100కు కాల్ చేసి నిందితుడిని పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో నిందితుడు యూసఫ్‌గూడకు చెందిన జావీద్ అని గుర్తించారు. బాలిక తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లిన సమయాన్ని ఆసరాగా చేసుకున్న నిందితుడు, ఐస్‌క్రీమ్ కొనిస్తానని ఆ చిన్నారిని బైక్‌పై తీసుకెళ్లాడు. నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు గురిచేశాడు. నిందితుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

# ప్రతిష్టకు భంగం కలిగేలా పోస్టులు పెడితే ఎలా?

### సజ్జల భార్గవరెడ్డిపై హైకోర్టు ఆగ్రహం

అమరావతి,ఏప్రిల్17 : ఇతరుల గౌరవ ప్రతిష్ఠలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వైసీపీ సోషల్ మీడియా మాజీ ఇన్‌చార్జ్ సజ్జల బార్గవ్ రెడ్డి , ఇతర నిందితులది ఆనాగరిక, ఆటవిక ప్రవర్తన అని ఆగ్రహించింది. ఈ క్రమంలో భార్గవ్ రెడ్డిపై న్యాయస్థానం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. తనపై జారీ చేసిన ఎల్‌ఓసీని రద్దు చేయాలని కోరుతూ సజ్జల భార్గవ్ రెడ్డి వేసిన పిటిషన్‌పై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రుల కుటుంబ సభ్యుల ప్రతిష్ఠకు భంగం కలిగించే పోస్టులు ఎలా పెడతారని న్యాయస్థానం ప్రశ్నించింది. వాక్ స్వాతంత్రం, భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు పరిమితులు ఉన్నాయని హైకోర్టు స్పష్టం చేసింది. దర్యాప్తును సక్రమంగా చేసి నిందితులకు శిక్షపడేలా చేయాలని పోలీసులను ఆదేశించింది. దర్యాప్తునకు సహకరించాలని పిటిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. కోరినప్పుడు విచారణకు హాజరు అవుతానని అఫిడవిట్ వేయాలని న్యాయస్థానం ఆదేశించింది. ఎల్‌ఓసీని రీ కాల్ చేయాలని అన్నమయ్య జిల్లా ఎస్పీకి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అభ్యర్ధన వచ్చిన వెంటనే ఎల్‌ఓసీని రద్దు చేయాలని ఇమిగ్రేషన్ అధికారులకు ఏపీ హై కోర్టు ఆదేశించింది.

# వీగిన మహిళా రిజర్వేషన్ బిల్లు

### 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు దక్కని ఆమోదం

### అనుకూలంగా 278..వ్యతిరేకంగా 211 ఓట్లు

### రాజ్యాంగ సవరణకు అవసరమైన మద్దతు కరవు

### ఐక్యతను చాటుకున్న విపక్ష ఇండి కూటమి

### ప్రధాని మోడీ పిలుపు నిష్ఫలం

న్యూఢిల్లీ,ఏప్రిల్17 : మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. లోక్‌సభలో సుదర్ఘ చర్చ అనంతరం బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో మూడొంతుల మెజార్టీని సాధించలేకపోయింది. ఈ బిల్లుతో ముడిపడిన మూడు బిల్లులపై సుదీర్ఘ చర్చ అనంతరం శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగింది. 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై ఈ ఓటింగ్ జరిగింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఓటింగ్‌లో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. బిల్లుకు అనుకూలంగా 278, వ్యతిరేకంగా 211 ఓట్లు పడ్డాయి. మొత్తం ఓటింగ్‌లో 489 మంది పాల్గొన్నారు. మహిళా రిజర్వేషన్ అమలు సవరణ బిల్లు అవసరమైన మెజారిటీ సాధించలేకపోయింది. దీనిపై శుక్రవారం లోక్‌సభలో జరిగిన ఓటింగ్ ప్రక్రియలో మొత్తం 528 మంది సభ్యులు పాల్గొన్నారు. బిల్లుకు అనుకూలంగా 298 మంది ఓటు వేయగా, వ్యతిరేకంగా 230 మంది ఓటేశారు. దీంతో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరమైన 326 ఓట్లను ఎన్డీఏ సాధించలేకపోయింది. దీంతో మిగతా రెండు బిల్లులను వెనక్కి తీసుకుంటు న్నట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. ప్రధాని మోడీ మనస్సాక్షిగా ఓటేయాలని పిలుపునిచ్చినా విపక్ష కూటమి తన బలిమిని చాటింది. ఒక్కరు కూడా అనుకూలంగా కలసి రాలేదు. రాజ్యాంగ సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. లోక్‌సభలో మొత్తం సభ్యుల సంఖ్య 540. అంటే బిల్లు ఆమోదం పొందాలంటే కనీసం 360 మంది మద్దతు కావాలి. అధికార ఎన్డీఏ కూటమికి 292 మంది సభ్యుల మద్దతు ఉంది. అందువల్ల మరో 68 మంది మద్దతు అవసరం. మరోవైపు విపక్షాల బలం 233. వీరు కాకుండా స్వతంత్రులు, తటస్థ పార్టీలకు చెందిన వారు కలిసి 15 మంది ఉన్నారు. ప్రతిపక్ష సభ్యులు ఎక్కువ మంది గైర్హాజరైతే బిల్లు గ్టటెక్కే అవకాశం ఉందని అధికార ఎన్డీఏ భావించింది. సాయంత్రం 6 గంటలకు లోక్‌సభలో హోం మంత్రి అమిత్‌షా ప్రసంగించాక, ఈ బిల్లులపై ఓటింగ్ జరిగింది. ఓటింగ్ సమయంలో ప్రధాని మోడీ కూడా సభలోనే ఉన్నారు. ఓటింగ్ అనంతరం కిరణ్ రిజిజు ప్రకటన చేశారు. దీంతో సభను శనివారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓంబిర్ల ప్రకటించారు.

## రాజ్యసభ డిప్యూటి ఛైర్మన్‌గా మరోమారు హరివంశ్

న్యూఢిల్లీ,ఏప్రిల్17 : రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ ఎన్నికయ్యారు. ప్రతిపక్ష అభ్యర్థులు ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఆయన ఉపసభాపతి బాధ్యతలు చేపట్టడం ఇది మూడోసారి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ డిప్యూటీ ఛైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన అనుభవం రాజ్యసభకు ఎంతో అవసరమని అన్నారు. ఆయన అందరినీ కలుపుకుని వెళ్లాలని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. హరివంశ్ నేతృత్వంలో సభ మరింత శక్తిమంతం అవుతుందని అన్నారు. రాజ్యసభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా నూతన ఉపసభాపతికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ప్రతిపక్షానికి కూడా తగిన ప్రాధాన్యం ఇస్తారని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఆయన అందరి వాడని అన్నారు. ఇటీవల ఆయన రాజ్యసభ పదవీకాలం ముగిసింది. దీంతో ఆయనను రాష్ట్రపతి కోటాలో నామినేట్ చేశారు.

# బాధ్యతారహితంగా రాహుల్ ప్రసంగం

### వైద్యశాఖమంత్రి సత్య కుమార్ యాదవ్ ఆగ్రహం

విజయవాడ,ఏప్రిల్17 : నారీ శక్తీ వందనం బిల్లుపై పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అత్యంత బాధ్యతారహితంగా మాట్లాడారని ఏపీ వైద్యశాఖమంత్రి సత్య కుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సాధికారిత బిల్లుపై, మహిళల అభివృద్ధి గురించి మాట్లాడమంటే ప్రధానమంత్రి నరేంద్రమోదీపై అవహేళనగా మాట్లాడారని ధ్వజమెత్తారు. ఒక దేశ ప్రధానిని పట్టుకుని జాదూఘర్, ఓ మ్యాజిషన్ అని, ఓ సైనిక శక్తిని అవహేళన చేసేలా రాహుల్ గాంధీ మాట్లాడారని.. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ.. మోదీపై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలందరికీ రాహుల్ ఫ్రస్టేషన్ అనేది తేటతెల్లమవుతుందని మంత్రి సత్య కుమార్ యాదవ్ విమర్శించారు. ఓ ప్రతిపక్ష నేతగా ఉండాల్సిన అర్హతలు రాహుల్ గాంధీకి ఏమాత్రం లేవని ఎద్దేవా చేశారు. దేశ ప్రధాని మోదీ డెసిషన్, లీడర్ షిప్‌ని ప్రజలందరూ చూశారని వ్యాఖ్యానించారు. దేశ అభివృద్ధి కళ్లముందు కనిపిస్తోందని చెప్పుకొచ్చారు. అంతర్జాతీయంగా భారతదేశానికి ఖ్యాతి తీసుకొచ్చేలా ప్రధాని మోదీ చర్యలు చేపట్టారని ఉద్ఘాటించారు. మన సైనిక శక్తిని, దేశ భద్రతను అవమానించే విధంగా రాహుల్ గాంధీ మాట్లాడటం అత్యంత హేయమని ఆగ్రహించారు. పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పేలా ప్రధాని మోదీ అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారని ప్రస్తావించారు. సైనికుల బలం మన దేశ భద్రత సత్తా ఏంటో తెలిసి పాకిస్థాన్ కూడా తమపై దాడులు జరిగాయని ఒప్పుకుందని మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. అలాంటి దేశ భద్రతపై, సైనికులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేశారని తెలిపారు. ఏ శక్తివంతమైన దేశానికి మన దేశం తీసిపోకుండా చేశారని చెప్పారు. నల్లధనాన్ని కట్టడి చేసినందుకు దేశ ప్రజలందరూ స్వాగతించారని అన్నారు. ప్రజల విజ్ఞతను రాహుల్ గాంధీ ప్రశ్నిస్తున్నారా..? అని దుయ్యట్టారు. ఎవరి హయాంలో ఎలా పాలనా సాగిందో ప్రజలందరూ మర్చిపోలేదని చెప్పారు. 2జీ స్కాం దగ్గర నుంచి కోల్ స్కాం వరకు లక్షల కోట్లు ఏవిధంగా దోచుకున్నారో అందరికీ తెలుసునని అన్నారు. మహిళల సాధికారత కోసం తీసుకొస్తున్న బిల్లును వ్యతిరేకించటం రాహుల్ గాంధీ మనస్తత్వం ఏంటో అర్థమవుతుందని విమర్శించారు. అవినీతి, ఆరోపణ లేకుండా అత్యంత పారదర్శకంగా మోదీ పాలన అందిస్తున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# సంపాదకీయం

## ప్రజలకు మరింత భారం కానున్న సీట్ల పెంపు !

మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై పార్లమెంటు సమావేశాలు వాడీవేడిగా సాగుతున్నాయి. ఈ సమావేశాలకు చాలా ప్రత్యేకత ఉంది. ఎందుకంటే ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న, చట్టసభల్లో అమలుకు నోచుకుని మహిళలకు 33శాతం రిజర్వేషన్ చట్టం నారీ శక్తి వందన్ అధినియమ్ మోడీ ప్రభుత్వం అమలు చేసేందుకు పట్టుదలగా ఉంది. నిజానికి ఇది ఎన్నో ఏళ్ల కల. ఇప్పటికే చాలా ఆలస్యం అయ్యింది. ఈ క్రమంలో దేశంలో 50శాతం ఉన్న మహిళలకు రిజర్వేషన్ అన్నది హక్కుగా దక్కాల్సిందే. పురుషాధిక్యాన్ని ఎదురొడ్డి నిలబ డాలంటే వారికి రిజర్వేషన్లు ఉండాల్సిందే. అయితే ఈ విషయంలో ఇప్పటికే ఉన్న సీట్లకు అనుగుణంగా అమలు చేయకుండా లోక్‌సభ సీట్లను 816కి పెంచడం అన్నది చాలా దారుణం. ఎందుకంటే ఉన్న లోక్‌సభ, అసెంబ్లీ సీట్లతోనే దేశం ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతోంది. ప్రజాప్రతినిధులకు ఇచ్చే జీత భత్యాలు, పెన్షన్లు, క్వార్టర్లు, విమాన ఖర్చులు ఇలా చెప్పుకుంటూ పోతే తడిసి మోపెడువుతున్నాయి. ఈ ఖర్చులను తగ్గించి, జీతభత్యాల్లో కోత విధించి, పెన్షన్లు తగ్గించాల్సి ఉన్నా వాటిపై ఎవ్వరూ మాట్లాడడం లేదు. ఉద్యోగులకు లేని పెన్షన్లు వీరికెందుకన్నది చెప్పడం లేదు. ఒక్కొక్కరు రెండేసి పెన్షన్లు పొందుతు న్నప్పటికీ ఘనత వహించిన మోడీ ప్రభుత్వం గుర్తించడం లేదు. దీనిగురించి చట్టసభల్లో అడిగేవారు లేరు. ఇప్పుడు ఎంపిలు, ఎమ్మెల్యేల ఖర్చులు వేల కోట్లల్లో ఉంటోంది. దీనిని మరింతగా పెంచడం కన్నా తగ్గించాలి. ఒకవేళ సీట్లు పెంచాల్సి వస్తే ఓ 50 లేదా 60 వరకు పెంచి వుంటే బాగుండేది. కనీసం ఓ 600 వరకు పెంచి, అందులో 250 మహిళలకు కేటాయిస్తే మంచిది. ప్రజాప్రతినిధుల సంఖ్యను పెంచి జనం మీద బాదే బదులు తగ్గిస్తే మంచిది. సీట్లు పెంచడం లాభం కనుక పెంచుతున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. కానీ మహిళా భివృద్ధి కోసం పాటుపడే లక్ష్యంలో మాత్రం అభినందించాల్సిందే. మహిళల విద్యకు, ఆర్థికంగా ఎదిగేందుకు ఊతమివ్వాలి. విద్యారంగంలో మహిళలకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి. ఉదారంగా వారికి రుణాలు ఇవ్వాలి. ఇవన్నీ చేస్తూనే కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో కూర్చోబెట్టడానికి అవకాశం కల్పించాలి. డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్న పార్టీలు ఇవన్నీ చర్చించాలి. సీట్ల సంఖ్యను పరిమితం చేసి, జీతభత్యాలన ఎత్తేసి, పెన్షన్లను రద్దు చేసేలా చర్చ చేయాలి. కేవలం రాజకీయ లబ్ధి కోసమే చేయడం అన్నది సరికాదు. బిజెపికి గత ఎన్నికల్లో కూడా మహిళా ఓటు బ్యాంకు చాలా కీలకంగా మారిందన్న గణాంకాలు ఉన్నాయి. 2014 నుంచి 2024 సార్వత్రిక ఎన్నికల్ని పరిశీలిస్తే.. మహిళల ఓట్ల వల్లే బిజెపి గెలిచిందనడంలో అతిశయోక్తి లేదు. 1998 ఎన్నికల్లో బిజెపికి మహిళా ఓటింగ్ 33 శాతం. అప్పుడు అటల్ బీహారీ వాజ్‌పేయి అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్‌కి 30 శాతమే. ఆ తర్వాత మళ్లీ బిజెపికి మహిళా ఓటింగ్ తగ్గినా.. 2014 నుంచి క్రమేణా పెరుగుతోంది. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్‌కి 22 శాతం అయితే.. బిజెపికి 36 శాతం మహిళా ఓటింగ్ నమోదైందని ఎన్‌ఇఎస్ గణాంకాలే వెల్లడించాయి. అంటే మహిళలు అండగా ఉన్నందున ప్రతి విషయంలోనూ బిజెపి వారికి అనుకూల నిర్ణయాలు తీసుకోవాలి. ఇబ్బడిముబ్బడిగా ఎంపి, ఎమ్మెల్యే సీట్లు పెంచి, మహిళల కోసమే అని చెప్పడం సరికాదు. సీట్ల సంఖ్యను పెంచకుండానే వారికి 33శాతం అమలు చేయవచ్చు. విపక్షాలు కూడా ఇదే కోరుతున్నాయి. 2019లో 89.6 కోట్ల మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిలో 46.5 కోట్ల మంది పురుషులు, 43.1 కోట్ల మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. 2024కి 96.8 కోట్ల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో మహిళా ఓటర్లు 47.1 కోట్లకి చేరారు. అంటే 2019కి కంటే 2024కి నాలుగు కోట్లమంది మహిళా ఓటర్లు పెరిగారు. ఇక ఈ ఎన్నికల్లో కొత్త ఓటర్లు 2.63 పెరగగా వారిలో 1.41 కోట్ల మంది మహిళలు, 1.22 మంది పురుషుల ఓటర్లు పెరిగారు. 2019లో 12 రాష్ట్రాల్లో రికార్డు స్థాయిలో మహిళా ఓటర్లు పెరిగారు. అయితే 2024లో 36 రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల్లో 19 రాష్ట్రాల్లో మహిళా ఓటింగ్ పెరిగింది. అందువల్ల న్యాయంగా వారికి దక్కాల్సిన సీట్లను ఇవ్వాల్సిందే. అయితే అందుకోసం ఉన్న పార్లమెంట్, అసెంబ్లీ సీట్లను భారీగా పెంచడం సరికాదు. ఇప్పుడున్న లోక్‌సభ సీట్లు 543 కాస్తా.. 816కి పెరుగుతాయని హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ సీట్ల కేటాయింపుల్లో కూడా ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకే ఎక్కువ సీట్లు వచ్చే అవకాశం ఉంది. లోక్‌సభ స్థానాల పరంగానూ, ఇటు రాష్ట్రాల పరంగానూ ఎంపి, ఎమ్మెల్యే సీట్లు పెరగడం ఓ రకంగా రాజకీయ పార్టీలకే తప్ప ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఉండదు. ÷రాజకీయంగా మహిళలు ఎదగాలన్నది, పరిపాలనలో భాగస్వామ్యం కావాలన్న విషయంపై ఎవరికీ వ్యతిరేకత లేదు. రాజకీయాల్లో ధనబలం, కండబలం నిరోధించాలంటే మహిళలను రాజకీయాల్లోకి తీసుకుని రావాల్సిందే. ఆ విషయంలో మహిళకు ఆర్థిక స్వేచ్ఛను కూడా ఇవ్వాల్సిందే. ఆస్తిలో హక్కులు కల్పించాల్సిందే. ఒకవేళ గెలిచినా.. మహిళల్ని తమ ఆలోచనలకు తగ్గట్టుగా పనిచేయనివ్వాలి. సామాజిక, ఆర్థిక పరంగా మహిళలు చైతన్యవంతంగా ఉంటే మంచి సమాజాం ఏర్పడుతుంది. సీట్ల పెంపు వల్ల పెద్దగా ప్రయోజనం లేదు. మహిళా కోటాను అమలు చేయడం కోసం సీట్లు పెంచాలనుకోవడం సరికాదు. అందువల్ల ఉన్న సీట్లలో 33శాతం అమలు చేయడమో లేదా, ఇపుడు 542ను 200కు పెంచడమో సబబుగా ఉంటుంది. ఏకంగా 816కు పెంచడం దేశంపై ముఖ్యంగా పన్నులు కట్టే ప్రజలపై భారం మోపడమే అవుతుంది.

# నాడు భూదానం.. నేడు భూదాహం



ఒక ఉద్యమం ఫలితంగా లభించిన భూదాన భూముల్ని పేదలకు పంచాల్సి ఉండగా, తెలంగాణలో ఇంకా పంచకుండా మిగిలిన వాటిని ఎలా కాజేయాలనే కుట్రలు తీవ్రస్థాయిలో సాగుతున్నాయి. స్పష్టమైన రికార్డులున్న భూదాన భూముల నుంచి ఆక్రమణదారులు తొలగట్లేదు. తాజా కబ్జాలకు కొన్ని చోట్ల యత్నాలు సాగుతున్నాయి. అక్కడక్కడా వారికి ప్రభుత్వాలే వత్తాసు పలుకడం ఆందోళన కలిగిస్తోంది. సాగుకు యోగ్యమైన సుమారు 8000 ఎకరాలపైనే అందరిదీ కన్ను. భూదానోద్యమంలో భాగంగా సేకరించిన వాటిలో పెద్ద మొత్తం భూముల్ని పేద రైతులకు, ప్రభుత్వ రంగ సంస్థలకు, ఇతర స్వచ్ఛంద సేవా సంఘాలకి, పేదల ఇళ్ల నిర్మాణానికి ఇది వరకే ఇచ్చారు. దేశ భవిష్యత్‌పై ఈ ఎన్నికల ప్రభావం ఇవి కాకుండా భూదాన భూములు పలు చోట్ల అన్యాక్రాంతమయ్యాయి. న్యాయస్థానాల జోక్యంతో కొన్ని చోట్ల వాటిని వెనక్కి తెచ్చినప్పటికీ ఇంకా కొన్ని భూములు అక్రమార్కుల కబ్జా కోరల్లోనే ఉన్నాయి. వాటిని కాపాడుతూ, దురాక్రమణలపై చర్యలు తీసుకోవాల్సిన భూదాన బోర్డు ఇప్పుడు ఉనికిలోనే లేకుండా పోయింది. బోర్డును రద్దు చేశాక చట్టప్రకారం ఆరు మాసాల్లో పునరుద్ధరించాల్సి ఉండేది. ఆ గడువును చట్ట సవరణ ద్వారా మూడేళ్లకు పెంచారు. కానీ, ఎనిమిదేళ్లవుతున్నా బోర్డు ఏర్పాటు అతీగతీ లేదు. గత ప్రభుత్వం భూదాన భూముల కోసం ప్రత్యేక అధికారిని నియమించినా, విచక్షణాధికారాల పరంగా, స్ఫూర్తిపరంగా వారు పూర్తిస్థాయిలో పనిచేయలేని పరిస్థితి! భూదాన భూముల్ని సంరక్షించి పేదలకు పంచాల్సిన చోట సర్కార్ల వ్యవహారం సందేహాలకు తావిచ్చేదిగా ఉంటోంది. స్ఫూర్తిది ఒక వారసత్వం అనుకోని పరిస్థితుల్లో భూదానోద్యమం 75 ఏళ్ల కింద మొదలైంది. నికార్సయిన గాంధేయవాది, గాంధీ మెచ్చిన శిష్యుడు భారతరత్న ఆచార్య వినోబా భావే దీనికి కారకుడు. 18 రాష్ట్రాల్లో ఎనభై వేల కిలోమీటర్లు ఆయన పాదయాత్రతో, 44 లక్షల ఎకరాల భూమిని.. ఉన్నవాళ్ల నుంచి లేని వాళ్ల కోసం బదలాయించిన 'భూదాన ఉద్యమం'కు తెలంగాణ నడిబొడ్డునున్న నల్గొండ జిల్లాలోని చీరల పోచంపల్లిలో బీజం పడింది. అందుకే, అప్పట్నుంచి అది 'భూదాన్ పోచంపల్లి' అయింది. ఏడాదిగా సాగిన వజ్రోత్సవాలు రేపటితో ముగుస్తున్నాయి. 1951 ఏప్రిల్‌లో శివరాంపల్లిలో సర్వోదయ సమ్మేళనానికి వచ్చిన వినోబా ఒక సాయంత్రం పోచంపల్లిలో ఉన్నారు. తెలంగాణలో నాడు తీవ్రస్థాయిలో ఉన్న సాయుధ పోరు గురించి ఆయన కలత చెంది, 'ఎందుకీ రక్తపాతం?' అన్నపుడు, 'మాకు గంటెడు భూమి లేదు, ఉంటే సాగుచేసుకొని బతికే వాళ్లం' అని ఆ గ్రామ పేదలు బదులిచ్చారు. 'అవును మీకు భూమి కావాలి, ఎవరిస్తారు? వచ్చే నెల ఒక భేటీ ఉంది, నేను దేశ ప్రధాని నెహ్రూతో మాట్లాడుతాను' అని అనునయించి, ఆ సాయంత్రపు ప్రార్థన సమావేశం ముగించారు. మరుసటి రోజు ఉదయం సమావేశమైనపుడు, ఆ గ్రామపు మోతుబరు రైతు వెదిరె రామచంద్రారెడ్డి వంద ఎకరాల తమ భూమి పేదల కోసం దానంగా ఇస్తానని వినోభా సమక్షంలో ప్రకటించారు. అలా మొదలయింది భూదానోద్యమం. వందలువేల మంది దాతలు ముందుకు వచ్చారు. దాన పత్రాలు స్వీకరిస్తూ, రెవెన్యూ రికార్డులు సవరిస్తూ అలా లభించిన భూముల రక్షణకు, తదుపరి కార్యాచరణ నిర్వహణకు భూదాన, గ్రామదాన బోర్డును ప్రత్యేక చట్టాన్నే తెచ్చారు. దురాక్రమణదారుల కన్నుపడటంతో తరచూ వివాదాస్పదం అవుతూ వచ్చింది. వేర్వేరు ప్రభుత్వాల్లో మాజీ ఉప ముఖ్యమంత్రి కోనేరు రంగారావు కమిటీతో సహా వివిధ కమిటీలు నివేదికలిచ్చాయి. 2006లో కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం తెలంగాణలో మొత్తం 1,71,404 ఎకరాల భూదాన భూమి ఉండగా, 65,660 ఎకరాలు రాళ్లు, రప్పలతో సాగుకు యోగ్యం కానిదని పేర్కొన్నారు. యోగ్యమైన 99,616 ఎకరాల భూమిని 36,236 మంది రైతులకు పంపిణి చేశారు. 6581 ఎకరాల భూమి మిగిలింది. దురాక్రమణల నుంచి 1235 ఎకరాల భూమిని కోర్టు ఉత్తర్వుల ద్వారా బోర్డు తిరిగి స్వాధీనపరచుకుంది. 2000 ఎకరాల భూమిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలకు ఇచ్చారు. 371 ఎకరాల్లో పదివేల మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత 201417 మధ్య జరిగిన పలు పరిణామాల్లో భూదాన భూములపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రభుత్వం ప్రత్యేక అధికారిని నియమిస్తూ జిఒ ఇచ్చింది. బోర్డు నుంచి బలవంతంగా రికార్డుల్ని స్వాధీనపరచుకుంది. ఆరు మాసాల గడువును మూడేళ్లకు పొడిగిస్తూ ప్రభుత్వం చట్ట సవరణ చేసింది. ఆ గడువు కూడా తీరినా బోర్డును ఏర్పాటు చేయకపోవడం, భూదాన భూముల్ని పలువురు కబ్జా చేయడం, పాపయ్యగూడ వంటి చోట్ల పేదల ఇళ్లు కూల్చడం వంటి ఎన్నో పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ప్రస్తుత ప్రభుత్వం ఇటీవల కూల్చిన నిరుపేదల వెయ్యి ఇళ్లున్నది భూదాన భూములేనని, వారంతా పట్టాలు పొందిన వారేనని రికార్డులు చెబుతున్నాయి. కలువల రాజారావ్ ఈ భూముల్ని స్వయంగా వినోబా భావేకు దానమిచ్చారు. ఇక్కడి ఇండ్లను కూల్చే విఫలయత్నమొకటి గత ప్రభుత్వ హయాంలోనే జరిగింది. భూదాన బోర్డుకు చెందిన 400 ఎకరాల సాగుభూమి నాగులపల్లి అడవిలో పదిహేనేళ్లుగా అన్యాక్రాంతమై ఉంది. భూదాన భూముల వివాదాల్ని పరిష్కరించే అధికారం బోర్డుకే తప్ప రెవెన్యూ అధికారులకు లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. భూములన్నీ మాయం! భూముల ధరలు అడ్డగోలుగా పెరిగిన తర్వాత రాష్ట్రంలో భూఅరాచకాలకు హద్దులు చెరిగాయి. మానవ సంబంధాలు మంటగలిశాయి. కుటుంబ సభ్యులు, రక్తసంబంధీకుల నడుమ హత్యానేరాలు నిత్యకృత్యమయ్యాయి. ప్రతి గ్రామంలో భూవివాదాలే! ధరణి వచ్చినా, అది పోయి భూభారతి వచ్చినా భూవివాదాలు, దురాక్రమణలు, దాడులు, హత్యానేరాలు పెచ్చుమీరుతున్నాయే తప్ప తగ్గట్లేదు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత ప్రభుత్వ హయాంలోని రకరకాల భూములు అమ్మకానికో, ఆక్రమణలకో గురవుతున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. బంజరు భూము లు, లావాణీ భూములు, గైరాన్ భూములు, అసైన్డ్ స్థలాలు, దేవాదాయ, వక్ఫ్, కాంధిశీకుల భూములు, అటవీ భూములు, గ్రామ కంఠాలు... ఇలా అన్నీ కనుమరుగవుతున్నాయి. భూదాన భూముల్ని కూడా ఖతం చేసే చర్యలు ముమ్మరమయ్యాయి. నాటి స్ఫూర్తి భూదానమయితే నేటి స్వార్థం భూదాహం కావటం వల్లే ఈ విపరిణామాలిలా పెచ్చుమీరుతున్నాయి.

## దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం

### డీలిమిటేషన్ పక్రియపై శశిథరూర్

న్యూఢిల్లీ,ఏప్రిల్17 : పార్లమెంట్‌లో లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై చర్చ తీవ్రరూపం దాల్చింది. జనాభా ఆధారంగా సీట్ల సంఖ్యను పెంచాలనే ఉద్దేశ్యంతో, కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ పక్రియకు సంబంధించి చొరవ తీసుకుంటోంది. అయితే డీలిమిటేషన్ బిల్లును ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. శుక్రవారం రెండో రోజు కూడా డీలిమిటేషన్ బిల్లుపై చర్చ కొనసాగింది. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అన్నారు. లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.. దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగదని ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతున్నారని, వారి మాటలకు విరుద్ధంగా డీలిమిటేషన్ బిల్లు రూపొందించారని ఆయన విమర్శించారు. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలు రాజకీయంగా మరింత నష్టపోతాయని శశిథరూర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకురావడం మంచిదేనని, అయితే దీని అమలకు 2011 జనాభా లెక్కలకు, నియోజకవర్గాల పునర్విభజన పక్రియకు ముడిపెట్టడారని ఆయన విమర్శించారు. ఒకేసారి 816 మంది సభ్యులకు సీట్లు పెంచడం ఆషామాషీ కాదన్నారు. దీంతో ఎన్నో సమస్యలు వస్తాయని హెచ్చరించారు. మరోవైపు లోక్ సభలో ఈ మూడు బిల్లుల ఓటింగ్ ఉత్కంఠ రేపుతోంది. సాయంత్రం 4 గంటలకు స్పీకర్ ఓంబిర్లా ఓటింగ్ చేపట్టనున్నారు. విపక్షాల్లోని పలు పార్టీలతో ఎన్డీయే నేతలు మంతనాలు చేస్తున్నారు. మరోవైపు ఓటింగ్ వేళ ఇండియా కూటమి వ్యూహరచన చేపట్టింది. ఇండియా కూటమికి భేటీకి ఆర్జేడీ హాజరుకావడంతో రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ఒక్కొక సభ్యుడు ఉన్న పార్టీలను కూడా ఈ కూటమి సంప్రదిస్తోంది.

## తేజస్వీ వ్యాఖ్యలు

### పార్లమెంట్ ముందు ఎంపిల నిరసన

న్యూఢిల్లీ,ఏప్రిల్17 : పార్లమెంట్ ఆవరణలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు ఆందోళనకు దిగారు. ప్లకార్డులు పట్టుకుని బైఠాయిచారు. తెలంగాణ ఏర్పాటును భారత్ - పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ భాజపా ఎంపీ తేజస్వీ సూర్య లోక్‌సభలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని అవమానించవద్దని ప్లకార్డులు ప్రదర్శించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వ్యతిరేకంగా కూడా ఎంపీలు నినాదాలు చేశారు. ఎంపిలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, వేం నరేందర ÷- రెడ్డి, కడియం కావ్య తదితరులు పాల్గొన్నారు.

## రెండోరోజూ నల్లదుస్తులతో డిఎంకె సభ్యులు

### ఆదరాబాదరాగా చట్టాలను తేవడంపై కనిమొళి అభ్యంతరం

న్యూఢిల్లీ,ఏప్రిల్17 : మహిళా రిజర్వేషన్ అమలు, లోక్‌సభ సీట్ల పెంపు బిల్లులపై పార్లమెంటులో రెండోరోజు చర్చ ప్రారంభమైంది. ప్రతిపక్షాల నిరసనల నడుమ సభ సాగుతోంది. ప్రభుత్వ తీరుపై మరోసారి ప్రతిపక్షాలు మండిపడ్డాయి. సభలో చర్చ జరుగుతుండగా మహిళా రిజర్వేషన్‌పై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారని ఆక్షేపించాయి. కేంద్ర ప్రభుత్వం తీరుపై డీఎమ్‌కే ఎంపీ కనిమొళి మండిపడ్డారు. డిఎంకె ఎంపిలు వరుసగా రెండోరోజూ నల్లదుస్తులతో సభకు హాజరయ్యారు. హోం మంత్రి అమిత్ షా పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని ఈ సందర్భంగా కనిమొళి అన్నారు. రోజుల వ్యవధిలో బిల్లులు ఆమోదింపచేసుకోవాలనే ప్రయత్నంలో రాజకీయ లెక్కలు కనిపిస్తున్నాయని అన్నారు. ఇది అసలైన సమాఖ్య స్ఫూర్తి కాదని అన్నారు. రాష్ట్రాల హక్కులను ఈ ప్రభుత్వం గుర్తించట్లేదని అన్నారు. ఢిల్లీ సార్ల కోసమే రాష్ట్రాలు ఉన్నట్టు కేంద్రం వ్యవహరిస్తోందని అన్నారు. కేంద్రం చర్యలపై మండిపడ్డారు. డీలిమిటేషన్‌కు మహిళా రిజర్వేషన్ బిల్లు బందీగా మారిందని అన్నారు. ఈ వ్యవహారాన్ని డీలిమిటేషన్‌తో లంకె పెట్టకూడదని అన్నారు. మహిళా బిల్లుకు అభ్యంతరం లేదని, కేవలం డీలిమిటేషన్ విషయంలోనే ఇంత తొందరెందుకని ప్రశ్నించారు. కావాలంటే ఉన్న సీట్లతోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు.

## భీమిలి వద్ద కారు బోల్తా ..నలుగురికి గాయాలు

భీమిలి,ఏప్రిల్17 : విశాఖ జిల్లా భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాతి ఓ కారు బోల్తా పడింది. భీమిలి బీచ్ రహదారి మీదుగా వేగంగా వస్తున్న కారు.. కే.నగరపాలెం జంక్షన్ వద్ద అదుపుతప్పి టెలిఫోన్ స్తంభాన్ని ఢీకొంది. కారు బోల్తా పడటంతో ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. అందులోని నలుగురు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించారు.

## ధ్యానయోగం.. దైవమార్గం

ఆలోచనా ప్రవాహాన్ని ఒక ప్రత్యేకమైన వస్తువు మీద గానీ, ఒక భావం మీద గానీ,అవిచ్ఛిన్నమైన తైలధారగా స్థిరంగా ఉంచగలిగితే దానిని 'ధ్యానం' అంటారు.ధ్యానమంటే మనసు లోతును కొలిచే సాధనంగా నిర్వచిస్తారు తాత్వికులు. ఆలోచనల వెనుక అంతర్నిహితంగా దాగిఉన్న శక్తిని పరిశీలించటమే ధ్యాన లక్ష్యం. మరి ఈ ఆలోచనల వెనుక ఉన్నది ఏమిటి? అసలు ఎటువంటి ఆలోచనలు లేని మనసును ఊహించగలమా? ఎప్పుడూ మంచి చెడులు, తప్పు ఒప్పులనే పరస్పర విరుద్ధాలైన ద్వంద్వాల చుట్టూ పరిభ్ర మించే ఈ మనసు వెనుక ఉన్నది ఏమిటి? మనసును శోధించటం ద్వారా ఆలోచనలను పరిష్కరించటం, సమాధానపరచటం.. ఇదే ధ్యానం. క్రమక్రమంగా ధ్యానంలో పురోగమిస్తూ ఉన్నత స్థాయిని అందుకున్నప్పుడు ఈ మనసు మనం అనుకున్నంత చెడ్డదేమీ కాదని అవగతమవుతుంది. ధ్యానం సిద్ధించినప్పుడు మనసు నుంచి విషయవాసనలన్నీ తొలగిపోతాయి. అప్పుడు మనసు శుద్ధమై ఆధ్యాత్మిక పరిధిలోకి వస్తుంది. 'ధ్యానం చేసేవారికి దేహాభిమానం తొలగుతుంది. భగవంతుని సాక్షాత్కారం కలుగుతుంది. ఈ జన్మలోనే ముక్తిని పొందుతారు' అంటోంది వేదాంత పంచదశి. హృదయంలో బొటనవేలు పరిమాణంలో ఆత్మ ఉందని కఠోపనిషత్తు చెబుతుంది. నిరాకార నిర్గుణ పరమాత్మ ధ్యానం ఈ హృదయంలో చేయాలి. ఈ హృదయాకాశంలో జ్యోతిని పరమాత్మగానూ, ఆ జ్యోతి మధ్యలో ఉన్న చిన్న జ్యోతిని తన ఆత్మగానూ ధ్యానించాలని స్వామి వివేకానంద ఉద్ఘాటించారు. అలాంటి మహాత్ములు ఆత్మ, పరమాత్మలు ఒకటని చెప్పారు. అందుకే ఏకత్వాన్ని ధ్యానించాలి. హృదయాకాశంలో ద్వాదశ దళాల కమలంపై ఇష్టదేవత చిన్మయమూర్తి ఆసీనుడై ఉన్నట్లుగా భావించి ధ్యానించాలి.



ఆధ్యాత్మికం

# ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లో సాయం ప్రాణదానంతో సమానం






## గోదావరిఖని వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి

**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్ లో అందించే సాయం ప్రాణదానంతో సమానమని గోదావరిఖని వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. శుక్రవారం అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా గోదావరిఖని వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ ప్రజల ప్రాణరక్షణలో అత్యంత కీలకమైన గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రమాదాలు జరిగిన మొదటి గంటలో తీసుకోవాల్సిన చర్యలు, ఫస్ట్ ఎయిడ్, గాయపడిన వారికి తక్షణ సహాయం, సురక్షిత రవాణా విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించే గోల్డెన్ అవర్ లో సరైన చర్యలు తీసుకుంటే అనేక ప్రాణాలను కాపాడవచ్చని వెల్లడించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో సహాయం చేయడానికి ముందుకు రావాలని సూచించారు. ప్రమాద స్థలంలో వేగవంతంగా స్పందించడం,



అంబులెన్స్ సేవలను సమన్వయం చేయడం వంటి అంశాలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్ టౌన్ ఎస్.ఐ రమేష్, పోలీస్ సిబ్బంది, అంబులెన్స్ డ్రైవర్‌లు, వీ లవ్ ఫౌండేషన్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్తాన్‌తో పోల్చిన బిజెపి ఎంపీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్

**కరీంనగర్ టౌన్, ఏప్రిల్17(ది క్రైమ్ న్యూస్):** ఎందరో అమరవీరుల ప్రాణ త్యాగాల ఫలితంగా, రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర విభజన గురించి భారత పార్లమెంటు సాక్షిగా పాకిస్తాన్ తో పోల్చిన భారతీయ జనతా పార్టీ పార్లమెంటు సభ్యుడు తేజస్వి సూర్య పార్లమెంటు సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేయాలని సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో బిజెపికి చెందిన ఎంపీ తేజశ్రీ సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్తాన్ తో పోల్చి రాష్ట్ర ప్రజలను అవమానించారని, సూర్య మాట్లాడుతున్న సందర్భంగా పార్లమెంటులో ఉన్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన బిజెపి ఎంపీలు మౌనంగా ఉండి ఆయన ప్రసంగాన్ని అడ్డుకోకపోవడం సిగ్గుచేటని, రాష్ట్రం కోసం ఆనాడు బిజెపి పోరాడిన విషయాన్ని మరిచిపోయారా అని, ఉద్యమకారులుగా పేరు ప్రఖ్యాతలు సంపాదించిన రఘునందన్ రావు, ఈటల రాజేందర్,బండి సంజయ్ కుమార్,కొండా విశ్వేశ్వర్ రెడ్డి లాంటి వారు ఆయన వ్యాఖ్యలపై తక్షణమే స్పందించకపోవడం దారుణమని శ్రీనివాస్ అన్నారు. గతంలో బీహార్ ఎన్నికల సందర్భంగా ప్రధాని మోడీ లాంటి వారు కూడా తెలంగాణ రాష్ట్రంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, పదేపదే రాష్ట్ర విభజన పై బిజెపి నాయకులు విమర్శలు గుప్పిస్తూ మాట్లాడడం చూస్తుంటే రాష్ట్రంపై వారికి ఏమాత్రం ప్రేమ లేదని అర్థమవుతుందన్నారు.తెలంగాణ ప్రాంతం అంటేనే పోరాటాల గడ్డ అని, నిజాం నవాబులను ఎదిరించి, ఈ ప్రాంతాన్ని దేశంలో విలీనం చేసిన చరిత్ర ఈ ప్రాంతానికి ఉందని, చరిత్ర తెలియకుండా దాన్ని వక్రీకరించి బిజెపి నేతలు పబ్బం గడుపుకుంటున్నారని, 60 ఏళ్లకు పైగా తెలంగాణ ప్రాంత ప్రజల చిరకాల కోరిక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అని, వేలాదిమంది విద్యార్థులు యువకులు, ప్రజలు రాష్ట్రం కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఆత్మ బలిదానాలు చేసుకొని,భారత రాజ్యాంగాన్ని అనుసరించి,రాష్ట్ర ఏర్పాటు బిల్లును ఆమోదింప చేసుకొని, రాష్ట్రాన్ని సాధించుకొని 16 సంవత్సరాలు అవుతున్నప్పటికీ తెలంగాణపై ఇంకా విషం చిమ్ముతున్న బిజెపి నేతలను రాష్ట్ర ప్రజలు ఉపేక్షించకూడదని శ్రీనివాస్ అన్నారు.ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయినప్పటి నుండి రాష్ట్రం నుండి కేంద్రానికి పన్నుల రూపంలో కోట్లాది రూపాయలు చెల్లిస్తున్నప్పటికీ తిరిగి రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులను ఇవ్వకుండా, పునర్విభజన చట్టంలో పేర్కొన్న వాటిని అమలు చేయకుండా వివక్షత చూపుతున్నారని, వీటన్నింటినీ తెలంగాణ రాష్ట్రానికి చెందిన బిజెపి ఎంపీలు కల్లుండి చూడలేని కబోదిల్లాగా వ్యవహరిస్తూ మోడీ దగ్గర మోకరిల్లుతున్నారని శ్రీనివాస్ ఆరోపించారు. మతోన్మాద ముసుగులో పరిపాలన కొనసాగిస్తున్న బిజెపి నాయకులు పదేపదే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పై చులకన చేసి మాట్లాడితే రాష్ట్ర ప్రజలు చూస్తూ ఊరుకోరని బిజెపిని రాష్ట్రంలో



తరిమికొట్టక తప్పదని, తక్షణమే బిజెపి ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఉపసంహరించుకొని రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని, పార్లమెంట్ స్పీకర్ ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించి సూర్య పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలని పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

# అక్రమ కట్టడాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలేవి?

- బాధితులకు సమయం ఇవ్వకుండా ఖాళీ చేయించిన అధికారులు - అనుమతులు ఇచ్చిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలి: ప్రజల డిమాండ్






**పటాన్‌చెరు (ఐలాపూర్ - కిష్టా రెడ్డిపేట), ఏప్రిల్ 17(ది క్రైమ్ న్యూస్ ):** అమీన్పూర్ డివిజన్ పరిధిలోని ఐలాపూర్ -- కిష్టా రెడ్డిపేట గ్రామంలో అక్రమంగా నిర్మించిన ఆరు అంతస్తుల అపార్ట్మెంట్, ఐలాపూర్ లోని గెస్ట్ హౌస్ పై అధికారుల చర్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. సుమారు 45 కుటుంబాలు నివసిస్తున్న ఈ భవనాన్ని ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఉదయం 6 గంటల సమయంలో ఖాళీ చేయాలని హైడ్రా అధికారులు ఆదేశించారు. 2--3 గంటల్లో ఖాళీ చేయమని ఆదేశాలు బాధితులకు సరైన గడువు ఇవ్వకుండా కేవలం 2 నుంచి 3 గంటల్లోనే ఇళ్లు ఖాళీ చేయాలని చెప్పడంతో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. పిల్లలు, వృద్ధులతో ఉన్న కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. ఉదయం నుంచి ఎటువంటి ఆహారం తినకుండా వాహనాలను ఏర్పాటు చేసుకొని ఆరంతస్తుల పై నుండి మెట్ల ద్వారా దిగుతూ కిరాయి ఉన్న కుటుంబాలు వారి సామాగ్రిని కిందికి దింపారు. విద్యుత్ నిలిపివేతతో మరింత ఇబ్బంది. సామాన్లను దిగజార్చే సమయంలో లిఫ్టులు పనిచేయకుండా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు మరింత కష్టాలు పడ్డారు. తక్కువ సమయంలో సామాన్లు తరలించడం వారికి భారంగా మారింది. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం ఈ ఘటనపై ప్రజల్లో పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణమని తెలిసినా విద్యుత్ కనెక్షన్ ఎలా ఇచ్చారు? నీటి కనెక్షన్ మంజూరు ఎలా జరిగింది? రెవిన్యూ, మున్సిపల్ అధికారులు ఎందుకు ముందే చర్యలు తీసుకోలేదు? బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బాధితులకు న్యాయం చేయాలి రెండు నెలల అడ్వాన్స్ అద్దెను చెల్లించమని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అద్దెకు మరో ఇల్లు దొరకక అద్దెకు ఉన్న వారు ఎటు వెళ్లాలో అర్థం కాక, కొందరు బంధువుల ఇండ్లలో, మరికొందరు చెట్ల కింద సామాన్లను భద్రపరచుకున్నారు. ఖాళీ చేసిన కుటుంబాలకు తక్షణ సహాయం అందించడంతో పాటు, వారికి ప్రత్యామ్నాయ నివాసం కల్పించాలని ప్రజా సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

# ఆలయ ఉత్సవాలకు మంత్రిని ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులు



**ధర్మపురి, ఎప్రిల్ 17, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో నిర్వహించే వేడుకలకు హాజరు కావాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ని ఆలయాల ధర్మకర్తల మండలి తరపున శుక్రవారం ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆహ్వాన పత్రికలను అందజేశారు. ప్రముఖ పుణ్య క్షేత్రమైన ధర్మపురి లోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఈనెల 22వ తేదీ నుండి 30వ తేదీ వరకు 9 రోజులపాటు నిర్వహించే నరసింహ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని ఆలయ ఈవో శ్రీనివాస ఆధ్వర్యంలో ఆలయ పూజారులు మంత్రి అడ్లూరి కి ఆహ్వాన పత్రికను అందజేశారు. అలాగే వెల్గటూర్ మండలం కోటిలింగాల గ్రామంలో ని శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మరియు కళ్యాణోత్సవ ఆహ్వాన పత్రికను ఆలయ కమిటీ సభ్యులు ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 20 నుంచి ప్రారంభమయ్యే వేడుకలకు హాజరుకావాలని మంత్రి ని ఆహ్వానించారు. ధర్మారం మండలం ఖిలా వనపర్తి గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం మంత్రి కి అందజేశారు. ఈనెల 25వ తేదీ నుండి మే 2వ తేదీ వరకు నిర్వహించే శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని కమిటీ సభ్యులు, ఆలయ పూజారులు దేవాదాయ శాఖ అధికారులు ఆహ్వాన పత్రికను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాల ధర్మకర్త ల మండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## చైర్మన్ పర్యవేక్షణలో హాలియాలో అభివృద్ధి పనులు



**నల్గొండ,ఏప్రిల్ 17 ప్రతినిధి(ది క్రైమ్ న్యూస్):** నల్గొండ జిల్లా హాలియా మున్సిపాలిటీలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమాలపై మున్సిపాలిటీ చైర్మన్ చింతల చంద్రా రెడ్డి పర్యవేక్షణ చేపట్టారు. హాలియా పట్టణంలోని ప్రధాన రహదారిపై నాటిన హరితహారం మొక్కల చుట్టూ పాదులు తీయించి, కలుపు మొక్కలను తొలగించారు. అలాగే పేరూరు రహదారిలో పంటకాలువ వెంబడి పేరుకుపోయిన మట్టి కుప్పలు, రాళ్లు, చెత్తాచెదారాన్ని శానిటేషన్ సిబ్బంది ద్వారా తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేయించారు. ఈ సందర్భంగా పట్టణ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి 200 సిమెంట్ బ్యాగులు విరాళంగా అందించిన నరసింహ గౌడ్

- ఆలయ నిర్మాణానికి దాతల ముందుకు రావాలి: నందారం నరసింహ గౌడ్



**పటాన్చెరు(జిన్నారం),ఏప్రిల్ 17(ది క్రైమ్ న్యూస్ ):** జిన్నారం మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న పోచమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని అమీన్పూర్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ పిలుపునిచ్చారు. ఆలయాల అభివృద్ధితో దైవభక్తి పెంపొందుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన తన వంతు సహకారంగా ఆలయ నిర్మాణానికి 200 బ్యాగుల సిమెంట్‌ను అందజేశారు. ఆలయ నిర్మాణం కోసం గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు దైవభక్తితో ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో తనను భాగస్వామిగా చేసుకున్నందుకు జిన్నారం గ్రామస్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆలయ కమిటీ సభ్యులు నందారం నరసింహ గౌడ్‌ను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకుడు జిన్నారం వెంకటేష్ గౌడ్, భోజిరెడ్డి, మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, తోట నర్సింగ్ రావు, ఏర్పుల లింగం, మోహన్, నిఖిల్ గౌడ్, దుర్గేష్, శేఖర్, దుర్గయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలోనే కోర్టు నిర్మించాలి కోర్టు కోసం నిరాహార దీక్ష

- పదో రోజుకు చేరిన అడ్వకేట్ల నిరాహార దీక్ష
- హామీలు మరిచిన నేతలు... న్యాయం కోసం లాయర్ల పోరాటం - ప్రభుత్వం స్పందించాలి- లాయర్ల డిమాండ్
- సంఘీభావం ప్రకటించిన కట్కూరి సందీప్



పెద్దపల్లి కోర్టు పరిధిలో న్యాయవాదుల నిరాహార దీక్ష

**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లాలో కోర్టు నిర్మాణం కోసం అడ్వకేట్లు చేపట్టిన నిరాహార దీక్ష పదో రోజుకు చేరుకోవడంతో ఉద్యమం మరింత ఉధృతమైంది. జిల్లా ప్రజలకు సులభంగా, సమయానికి న్యాయం అందేలా కొత్త కోర్టును జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ లాయర్లు కోర్టు ఆవరణలో రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. జిల్లా ప్రధాన కేంద్రం అయిన పెద్దపల్లిలోనే కోర్టు నిర్మాణం జరగాలని, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా న్యాయ సేవలు విస్తరించాలని అడ్వకేట్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడుతూ ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించడమే తమ లక్ష్యమని వారు స్పష్టం చేశారు. ఇప్పటికే ఎన్నికల సమయంలో జిల్లా కేంద్రంలో కోర్టు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన నాయకులు ఆ హామీని విస్మరించడంతో న్యాయవాదులు ఈ నిరసనకు దిగారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కోర్టు నిర్మాణంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. పదో రోజుకు చేరుకున్న ఈ నిరాహార దీక్షలో సీనియర్, జూనియర్ అడ్వకేట్లు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కట్కూరి సందీప్ దీక్షలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల డిమాండ్ పూర్తిగా సమంజసమని, జిల్లా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయవాదుల పోరాటానికి ప్రజల మద్దతు పెరుగుతుండగా, ప్రభుత్వం స్పందించే వరకు తమ నిరసన కొనసాగుతుందని అడ్వకేట్లు స్పష్టం చేశారు.

## స్మశాన వాటిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : కాంగ్రెస్ నాయకుడు గౌతమ్ గౌడ్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** హఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని ప్రకాష్ నగర్ స్మశాన వాటిక అభివృద్ధిపై కాంగ్రెస్ నాయకుడు బాలింగ్ గౌతమ్ గౌడ్ ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం ఉదయం ఆయన స్వయంగా స్మశాన వాటికను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ప్రకాష్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, సాగర సంగం, క్రిస్టియన్ సంఘం సభ్యుల విన్నపం మేరకు ఈ పర్యటన చేపట్టినట్లు తెలిపారు. స్మశాన వాటికలో ఉన్న మౌలిక సదుపాయాల లోపాలు, అభివృద్ధి అవసరాలపై స్థానికులతో చర్చించారు. ఈ సందర్భంగా ఏఈ ప్రతాప్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ పాల్గొని ప్రస్తుతం ఉన్న ఏర్పాట్లు, చేపట్టాల్సిన పనులపై వివరాలు అందించారు. అనంతరం గౌతమ్ గౌడ్ ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి అభివృద్ధి పనులను వేగవంతం చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్ నగర్ కాలనీ అధ్యక్షుడు చింతకింది పవన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, పరమేశ్వర్ ముదిరాజు, బెనర్జీ, రాజారాం, ఆంజనేయులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి





**కరీంనగర్ టౌన్, ఏప్రిల్17(ది క్రైమ్ న్యూస్):** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ భారత దేశంలో విశిష్టమైన పాత్ర పోషించారని వారు చేసిన సేవలు చరిత్ర పుటల్లో నిలిచిపోతాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వినరేందర్ రెడ్డి వారి వర్ధంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసినటువంటి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ రాష్ట్రపతిగా భారతదేశ మొదటి ఉపరాష్ట్రపతిగా అనేక సేవలు అందించారని వారి యొక్క పరిజ్ఞానంతో ప్రజలకు అనేక పథకాలను ప్రవేశపెట్టి ప్రజల యొక్క శ్రేయస్సు కోరిన గొప్ప రాజనీతిఙ్ఞుడని కొనియాడారు. వారిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఉపాధ్యాయ వృత్తిని నమ్ముకొని విద్యార్థులకు ఎన్నో విధాలుగా సేవలను అందించి ఉత్తమమైన స్థానాలలో స్థిరపరచి వారి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు వారు చేసిన సేవలకు మరియు రూపొందించిన పథకాలకు భారతదేశ ప్రభుత్వం అత్యున్నత పురస్కారమైన భారతరత్నతో సత్కరించి మరియు వారి జన్మదిన ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం జరిగిందని వారు చెప్పారు. వివిధ కళాశాలల్లో ప్రొఫెసర్ గా పనిచేసి విద్యా జీవితం యొక్క ప్రాముఖ్యతను తన యొక్క మాటల ద్వారా తెలిపి విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడంలో విజయ వంతులైనారని చెప్పవచ్చు. భారత రాయబారిగా ఆయన చేసిన సేవలు చాలా సమాజహితమైనవని, హిందూ వేదాంతాన్ని పాశ్చాత ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప తత్వవేత్తని కొనియాడారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఇతర దేశాలకు రాయబారిగా పనిచేసి భారతదేశం యొక్క ఔన్నత్యాన్ని స్వస్తిరపరచి ఎన్నో సేవలు చేశారని వారు గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ వారిని ఆదర్శంగా తీసుకోవాలని వారి శ్రమించిన తీరు చాలా ప్రేరేపించదగినదని అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గోల్డెన్ అవర్‌లో అందించే సరైన వైద్యం ప్రాణాలను కాపాడుతుంది






## పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి

**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** గోల్డెన్ అవర్‌లో అందించే సరైన వైద్యం ప్రాణాలను కాపాడుతుందని పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి తెలిపారు. శనివారం ఎరైవ్ అలైవ్ రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, ప్రమాదాల నివారణ కార్యక్రమంలో భాగంగా ఎన్టీపీసీ ధన్వంతరి ఆసుపత్రి, ఎన్టీపీసీ ప్రాంగణాల్లో అంబులెన్స్ డ్రైవర్లు, స్వయంసేవకులకు ఫస్ట్ ఎయిడ్, గోల్డెన్ అవర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే మొదటి గంట అత్యంత కీలకమని, ఈ సమయంలో వైద్య సహాయం అందిస్తే ప్రాణాలను కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని వివరించారు. ప్రతి పౌరుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల సమయంలో బాధితులకు వెంటనే సహాయం చేయడం సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. ప్రమాదాల సమయంలో బాధితులకు త్వరితగతిన సమర్థవంతమైన సహాయం అందించడం, ఫస్ట్ ఎయిడ్ పద్ధతులపై ప్రాక్టికల్ శిక్షణ, గాయపడిన వ్యక్తులను సురక్షితంగా ఆసుపత్రికి తరలించడం, రక్తస్రావం ఆపడం, శ్వాసక్రియలను పరిశీలించడం వంటి కీలక విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, రామగుండం సీఐ టి. ప్రవీణ్ కుమార్, ఎస్.ఐ ఉదయ్ కిరణ్, ఎన్టీపీసీ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, అంబులెన్స్ డ్రైవర్లు, స్వయంసేవకులు కలిపి 100 మందికి పైగా పాల్గొన్నారు.

# ఆసుపత్రిలో వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి

- ఓపీ తర్వాత కూడా వైద్యులు ఆసుపత్రిలో ఉండాలి
- అవసరమైన వైద్యులు, సిబ్బందిని కాంట్రాక్ట్ విధానంలో వెంటనే నియమించాలి
- ప్రైవేట్ ఆసుపత్రులకు అవసరం లేకుండా రిఫర్ చేయరాదు అన్ని సేవలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందాలి
- మందులు, పరికరాల కొరత లేకుండా స్టాక్ నిర్వహణ, యంత్రాల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఆసుపత్రిలో వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఓపీ సంఖ్యలు తగ్గుతున్న అంశంపై వెంటనే దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో గోదావరిఖని జనరల్ ఆసుపత్రి పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఆసుపత్రిలో రోజువారీ ఓపీ వివరాలను సమీక్షిస్తూ రోజుకు ఎంతమంది రోగులు వస్తున్నారో తెలుసుకున్నారు. అన్ని విభాగాల్లో అవసరమైన వైద్యులను కాంట్రాక్ట్ విధానంలో వెంటనే నియమించాలని, ఎటువంటి ఖాళీలు లేకుండా చూడాలని ఆదేశించారు. వైద్యులు సమయానికి విధులకు హాజరు కావడంతో పాటు ఓపీ సమయం ముగిసిన తర్వాత కూడా ఆసుపత్రిలో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత వైద్యులు అందుబాటులో లేరనే ఫీడ్‌బ్యాక్ ఉన్నందున ఇటువంటి పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదని హెచ్చరించారు. ఆసుపత్రిలో వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రిలో ఓపీ సంఖ్యలు తగ్గుతున్నాయని పేర్కొంటూ దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏ రోగి కూడా సేవల నుండి వెలుపల ఉండకూడదని స్పష్టం చేశారు. కొంతమంది రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారనే ఫీడ్‌బ్యాక్ ఉన్నందున అవసరం లేకుండా ప్రైవేట్ ఆసుపత్రులకు పంపకూడదని ఆదేశించారు. ఆసుపత్రిలో అవసరమైన పరికరాలు లేనప్పుడు తరచుగా కేసులు వస్తున్నట్లయితే వెంటనే ప్రతిపాదనలు పంపించాలని, అవసరమైన పరికరాలు సమకూర్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే రోగికి అవసరమైన అన్ని సేవలు అందేలా చూడాలని సూచించారు. ప్రభుత్వ స్టాక్‌లో లేని కానీ అవసరమైన మందుల జాబితాను సిద్ధం చేసి సమర్పించాలని, జిల్లా నిధులతో కనీసం మూడు నెలల స్టాక్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మందులు, ఔషధాలు లేదా ఇతర అవసరమైన వస్తువుల కొరత ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదని ఆదేశించారు. వైద్య పరీక్షల కోసం అవసరమైన సామగ్రి స్టాక్‌ను నిరంతరం తనిఖీ చేయాలని, యంత్రాల్లో లోపాలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. ఆసుపత్రికి అవసరమైన కొత్త ఏసీల కోసం ప్రతిపాదనలు పంపించాలని, వెంటనే ఆమోదం ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సెక్యూరిటీ గార్డుల అవసరాన్ని సమర్పించాలని, వాటి ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటామని చెప్పారు. అత్యవసర కేసుల్లో పేషెంట్ కేర్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తూ, శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సిబ్బంది మొత్తం 120 మంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 115 మంది మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. ఈ సిబ్బంది మూడు షిఫ్టులలో పనిచేస్తారని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన అదనపు సిబ్బందిని కాంట్రాక్ట్ విధానంలో నియమించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డాక్టర్. కృపా బాయ్ డాక్టర్.రాజు.డాక్టర్.ప్రసాద్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి పద్మభూషన్ అవార్డు ఇవ్వాలే...

- హామీలు అమలు చేయకుండా అన్ని చేసినమంటున్న మంథని ఎమ్మెల్యే - ఆనాడు తిరస్కరించిన కరెంటోళ్లను కీర్తించేలా చేసిన మాజీ సీఎం కేసీఆర్ - న్యాయపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలి - మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**రామగిరి, ఏప్రిల్ 17(ది క్రైమ్ న్యూస్):-** ప్రజలను మోసం ఎలా చేయాలో మోసం చేసి ఎలా దర్జాగా ఉండాలో చూపిస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి పద్మభూషన్, పద్మశ్రీ అవార్డులు ఇవ్వాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఎద్దేవా చేశారు, తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత పది రోజులుగా మంథని డివిజన్ కార్యాలయం మరియు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని సూపరెంట్ సర్కిల్ ఆపరేషన్ కార్యాలయం ఎదుట తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ ఆర్టిజన్, అన్‌మ్యాన్డ్, పీస్‌రేటు కార్మికుల నిరవధిక సమ్మె దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలుపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మార్పు పేరుతో అన్ని వర్గాలను మోసం చేసిందని,గత 28నెలలుగా ఇబ్బందులు పెడుతోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం ఏ విదంగా ఉంటుందో అధికారం వచ్చిన తర్వాత ఏ విధంగా ఉంటుందో 18ఏండ్ల ఓటు హక్కు కల్గిన వ్యక్తి యాభై ఏండ్ల వరకు గుర్తుండే విధంగా పరిపాలన చేయడం అధ్భుతంగా బావించవచ్చున్నారు. దేశంలో పద్మశ్రీలు, పద్మభూషన్‌లు అవార్డులు సేవలు చేసే వారికి మాత్రమే ఇస్తారని, కానీ ఇందిరమ్మ మార్పు పేరుతో ఇందిరమ్మ ప్రజా పాలన పేరుతో మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఈ అవార్డులు ఇవ్వాలని ఆయన అన్నారు. గ్రామాల్లో ని కార్యకర్త నుంచి రాహుల్ గాంధీవరకు ఈ విధంగానే వ్యవహరిస్తున్నారని, మహిళలకు 2500లు ఇయ్యకుండా ఇచ్చినట్లు, బీసీ రిజర్వేషన్‌లు ఇవ్వకుండా ఇచ్చినమని చెప్తున్నారని అన్నారు. అన్ని చేసినమని చిత్రగుప్తుడు మానిఫెస్టో కమిటి చైర్మన్ 420హామీల రూపశిల్పి మంథని ఎమ్మెల్యే ఇటీవల జీ తెలుగు ఇంటర్వూలో చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అబద్దాలు ఆడటంలో ఏ మాత్రం వెనుకడుగు వేయడం లేదని, ప్రజలు ఆలోచన చేయడం లేదని, అవగాహన, చైతన్యం లేదని కాంగ్రెస్ పార్టీ బావిస్తోందని అన్నారు. ఈనాటి వరకు ఎదిరిస్తలేం , నిలదీస్తలేం కనుకనే అలా చెప్పుకుంటూ పోతున్నరన్నారు. ఆనాడు పాదయాత్ర చేసిన సీఎల్పీ లీడర్ భట్ట విక్రమార్క విద్యుత్ కార్మికుల హామీ ఇచ్చి ఈనాడు విస్మరించారన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసం చేయడంలో అద్భుతాలు సృష్టిస్తోందని విమర్శించారు. ఈనాటికి రిటైర్డ్ మెంట్ వరకు వచ్చినా ఇంకా సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నయో వాటిని పూర్తి చేయడం కోసం కార్మికులు చేపట్టిన సమ్మె సరైందన్నారు. ఆనాడు కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడక ముందు కేసీఆర్ రాకముందు కరెంటు వాళ్లను ఎలా తిరస్కరించుకునే పరిస్థితి ఉందో చూశామని, కానీ పదేళ్ల కాలంలో అదే కరెంటోళ్లను కీర్తించే స్థాయికి కేసీఆర్ తీసుకువచ్చారని అన్నారు. కొన్ని సమస్యలు పరిష్కారం కాకపోవచ్చు కానీ గౌరవించే వరకు తీసుకువచ్చారని అన్నారు. ఇందిరమ్మ పాలన అంటే చీకటి మోస దగా పాలన అనే రీతికి తీసుకువచ్చిండ్లని, కార్మికుల నిరవధిక సమ్మె ఇందుకు ఉదాహరణ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి పదేండ్ల తర్వాత ప్రజలు కొంత వ్యతిరేకించవచ్చు కానీ ఈనాడు రెండున్నర ఏండ్లకే కాంగ్రెస్ పార్టీ అంటే ప్రజల్లో తీవ్ర వ్యతిరేక ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని, ప్రభుత్వం ఎలాంటి ఒత్తిడిలకు భయపడవద్దని, బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని ఆయన భరోసా కల్పించారు.

# అబోడ్ స్కూల్‌లో రీసైక్లింగ్ డ్రైవ్

## 1,000 కిలోల వ్యర్థాల సేకరణ





**పటాన్చెరు(తెల్లాపూర్), ఏప్రిల్ 17(ది క్రైమ్ న్యూస్):** పటాన్చెరు నియోజకవర్గంలో పర్యావరణ పరిరక్షణ,వ్యర్థాల వర్గీకరణపై అవగాహన పెంపొందించేందుకు తెల్లాపూర్ లోని అబోడ్ స్కూల్‌లో నిర్వహించిన రీసైక్లింగ్ డ్రైవ్ విజయవంతంగా ముగిసింది. మున్సిపల్ కార్పొరేషన్ ప్రోత్సాహంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ డ్రైవ్‌లో 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొని, మొత్తం 1,000 కిలోలకు పైగా రీసైక్లింగ్‌కు అనుకూలమైన వ్యర్థాలను సేకరించారు. విద్యార్థులలో పర్యావరణంపై అవగాహన పెరుగుతోందని, స్థిరమైన జీవన విధానాలపై వారి కట్టుబాటు ఈ కార్యక్రమం ద్వారా స్పష్టమైంది. ఈ కార్యక్రమాన్ని రియల్ ఇంపాక్ట్ ఇన్నోవేషన్స్ సంస్థ, ఐటీసీ వావ్ , ఎంఏఆర్ఐ ఫౌండేషన్‌లతో కలిసి నిర్వహించారు. విద్యాసంస్థలు ఇలాంటి కార్యక్రమాల ద్వారా పర్యావరణ సంరక్షణలో కీలక పాత్ర పోషించగలవని ఈ రీసైక్లింగ్ డ్రైవ్ స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు స్టేషనరీ, సర్టిఫికెట్లను అందజేసి ప్రోత్సయించారు.

# ఏఎంసీ ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

## - ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు



**రామగిరి,ఏప్రిల్ 17(ది క్రైమ్ న్యూస్):-** కమాన్ పూర్ మార్కెట్ కమిటీ ని ఆదర్శ మార్కెట్ కమిటీ గా తీర్చిదిద్దుతామని ఏఎంసీ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు అన్నారు. గత రెండు రోజులుగా కర్ణాటక రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ధార్వాడ్ జిల్లా, చివరి రోజు అనగా శుక్రవారం హవేరి జిల్లా జిల్లాలోని ప్రముఖ మార్కెట్ కమిటీలను మార్కెట్ కమిటీ సభ్యులతో కలిసి పర్యటించారు. అక్కడ పలువురు రైతులను కలవడం జరిగింది. అలాగే అధ్యయన కేంద్రంలో శాస్త్రవేత్తలు ఆధునిక వ్యవసాయంపై సలహాలు సూచనలు చైర్మన్ తో పాటు డైరెక్టర్లకు సూచించడం జరిగింది. అలాగే సుమారు 450 ఎకరాల్లో గల పంట విస్తీర్ణాన్ని సైతం పరిశీలించారు. అధికారులు పూర్తిస్థాయిలో అక్కడి వివరాలను క్లుప్తంగా వివరించారు. అలాగే రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సహాయ సహకారాలతో త్వరలోనే మార్కెట్ కమిటీ భవనాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. దీనికిగాను గుండారం వద్ద స్థలాన్ని సైతం పూర్తిస్థాయిలో సభ్యులు పరిశీలించడం జరిగింది. జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు వచ్చే విధంగా చేసి మార్కెట్ కమిటీ భవనాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ స్టడీ టూర్ లో డైరెక్టర్లు గుమ్మడి వెంకన్న, దాసరి గట్టయ్య, గూగుల్ ప్రవీణ్ కుమార్, సిద్ధం మురళి కృష్ణ, ఆ రెల్లి శ్రీనివాస్, పుల్లెల సతీష్,ముసుకుల నరేందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# శ్రీరాంసాగర్ కాలువలలో భారీగా పేరుకపోయిన చెత్తా చెదారం తొలగింపు



**రామగిరి, ఏప్రిల్ 17(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని 7 వ వార్డులో (నాగపల్లి క్రాస్ రోడ్డు) శ్రీరాంసాగర్ కాల్వలో భారీగా చెత్తాచెదారం, మురుగునీరు పేర్కొనిపోయింది. ఈ మేరకు జె.సి.బి ద్వారా వీటిని తొలగించే కార్యక్రమాన్ని సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు ప్రారంభించారు. శ్రీరాంసాగర్ కాలువలో పేరుకపోయిన చెత్తా చెదారం, మురుగునీరు, పిచ్చి మొక్కలు, చెట్ల మూలంగా దుర్వాసన వెదజల్లడం, దోమలు భారీగా పేర్కొనపోగా స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వీటిని తొలగించే కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డ్ సభ్యులు ఖండే సాహితీ పోశం, సెక్రెటరీ గంగుల సంతోష్, స్థానిక నాయకులు భవాని సదానందం, ఆరెపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పాడి గేదెల పథకానికి దరఖాస్తు గడువు పొడిగింపు

## కార్యనిర్వహక సంచాలకులు జి. శ్రావణ్ కుమార్

**రామగిరి, ఏప్రిల్17(ది క్రైమ్ న్యూస్):-** వార్షిక ప్రణాళిక 2025-26 సంవత్సరమునకు గాను రెండు పాడి గేదెల పెంపకం పథకమునకు జిల్లాలోని ఎస్సీ వర్గానికి చెందిన నిరుద్యోగ యువతి యువకులు ఆన్లైన్ దరఖాస్తు గడువును తేది.23.04.2026 వరకు పొడగించడం జరిగిందని ఆన్లైన్ దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత మున్సిపల్,మండల పరిషత్ కార్యాలయంలో సమర్పించాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు జి. శ్రావణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆన్లైన్ చేసుకోవటానికి ఆధార్ కార్డ్, రేషన్ కార్డు, ఫుడ్ సేక్యూరిటీ కార్డు, కుల ధృవీకరణ పత్రం (మీసేవ జారీ చేసింది), ఆదాయ ధృవీకరణ పత్రం (మీసేవ జారీ చెసింది) పాడి గేదల పథకం కోసం కనీసం 10 గుంటల భూమి కలిగి ఉండాలని అలాగే పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు అవసరమవుతాయన్నారు. కావున ఆసక్తి గల షేడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగ యువతి యువకులు తేది. 23.04.2026 "లోపు వెబ్ సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని, ఇట్టి వికాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు జి. శ్రావణ్ కుమార్ కోరారు.

# కాంగ్రెస్ పోవాలి - కెసిఆర్ రావాలి

- జగిత్యాల జైత్ర యాత్ర సభ ఈ ప్రభుత్వం పై ధిక్కరణ స్వరం వినిపించే సభ
- కెసిఆర్ పాలనే శ్రీ రామరక్ష ● 20న బిఆర్ఎస్ జగిత్యాల సభను విజయవంతం చేయాలి
- మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ పిలుపు



**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఈనెల 20న జగిత్యాలలో జరిగే బిఆర్ఎస్ బహిరంగ సభ తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఒక కొత్త మలుపనీ, రాష్ట్రంలో రేవంత్ పోవాలి-కెసిఆర్ రావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని, 20న జరిగే బహిరంగ సభను మనమందరం విజయవంతం చేయాలని బిఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు రామగుండం మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం గోదావరిఖని లో రామగుండం కార్పొరేషన్ లోని 60 మంది ఇంచార్జ్ లు పాలకుర్తి-అంతర్గాం మండలాల 27 మంది ఇంచార్జ్ లతో ముఖ్య నాయకులతో జగిత్యాల సభకు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలోని సీనియర్ నాయకులను తొక్కి పెడుతూ, నియంతల వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి జగిత్యాల నియోజకవర్గం సీనియర్ నాయకులు జీవన్ రెడ్డిని పక్కన పెట్టడం అత్యంత దారుణమని, నాలుగు దశాబ్దాల రాజకీయ నాయకున్ని విస్మరించడం బాధాకరమని, రేవంత్ రెడ్డి పాలన తో తెలంగాణ ప్రజలు విసిగిపోయారని, హామీలను పక్కన పెట్టి స్కాములతో పైసల వేటలో పడ్డారని, మూసి ప్రక్షాళన పేరుతో లక్షల కోట్ల దోపిడీకి రంగం సిద్ధం చేశారని, కష్టనష్టానికి ఓర్చుకొని మధ్యతరగతి కుటుంబాలు ఇల్లు కట్టుకుంటే దయలేని ప్రభుత్వం హైడ్రా పేరుతో వాళ్ళ ఇల్లు నేలమట్టం చేస్తూ వారి కుటుంబాలను రోడ్డుపాలు చేశారని, అడిగిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రజలకు ఇచ్చిన హామీలను ఆటకెక్కించి, మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డిని దించి మళ్లీ కేసిఆర్ ని ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ పాలనే శ్రీరామరక్ష అని, జగిత్యాల సభ కేవలం ఒక రాజకీయ సభ మాత్రమే కాదని, రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయ ముఖ చిత్రాన్ని మార్చబోయేది జగిత్యాల సభ అని ఇది ఒక చారిత్రాత్మక ఘట్టమని అన్నారు. జగిత్యాల సభకు కార్యకర్తలు, పార్టీ ముఖ్య నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి కెసిఆర్ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్పొరేటర్లు సర్పంచ్ లు పట్టణ అధ్యక్షులు మండల అధ్యక్షులు మాజీ జడ్పిటిసి లు మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచ్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆసుపత్రిలో మెరుగైన సేవలు ప్రజలకు అందించాలి

- గోదావరిఖని జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ● సీసీ రోడ్డు పనులు, పరిశుభ్రత, శానిటేషన్ పనితీరును మెరుగుపర్చాలని అధికారుల సూచన ● అదనపు ఓపీ బ్లాక్ ఏర్పాటు పై ప్రత్యేక దృష్టి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష





**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గోదావరిఖని జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆసుపత్రిలోని మెడికల్ ఓపీ, న్యూ బ్లాక్, ఐసీయూ బ్లాక్, ఎమర్జెన్సీ విభాగం, డ్యూటీ డాక్టర్స్ గదులను పరిశీలించి,రోగులకు అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకుని, అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ఆసుపత్రి ప్రాంగణంలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. శానిటేషన్ పనితీరును మెరుగుపర్చాలని సంబంధిత ఏజెన్సీకి సూచిస్తూ, తక్షణమే తనను కలవాలని ఆదేశించారు. రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని బెడ్ స్ట్రెంగ్త్ పెంపు కోసం చర్యలు చేపట్టాలని, మెడిసిన్ విభాగానికి అదనంగా ఒక ఓపీ బ్లాక్ ఏర్పాటు చేయాలని సూచించారు. ల్యాబ్ యంత్రాలు, ఏసీ వంటి పరికరాల్లో ఎలాంటి లోపాలు వచ్చినా వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట డాక్టర్ లు కృపా బాయి, రాజు, సంబంధిత అధికారులు, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# శెట్టిపాలెం ఇండియన్ గ్యాస్ గోదాంలో గోల్‌మాల్..!

## ప్రజలకు గ్యాస్ దొరకదు - హోటళ్లకు విచ్చలవిడిగా సరఫరా..!

**నల్గొండ,ఏప్రిల్ 17 ప్రతినిధి(ది క్రైమ్ న్యూస్):** నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం ఇండియన్ గ్యాస్ ఏజెన్సీపై వినియోగదారులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. గ్యాస్ బుక్ చేసి 15 నుండి 20 రోజులు గడిచినా సిలిండర్లు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. మండలంలోని పలు గ్రామాల ప్రజలు గ్యాస్ కొరతతో ఒక పూట వంట చేయడమే కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ లేక కొంతమంది పస్తులుండాల్సిన పరిస్థితి వచ్చిందని చెబుతున్నారు. ప్రశ్నిస్తే దురుసు సమాధానాలు..! గ్యాస్ డెలివరీ ఎందుకు ఆలస్యం అవుతుందని అడిగితే, ఏజెన్సీ సిబ్బంది "మా దగ్గర లేవు... మీ ఇష్టం ఏం చేసుకుంటారో చేసుకోండి" అంటూ నిర్లక్ష్యంగా, దురుసుగా స్పందిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. కొంతమందిని ఏజెన్సీ వద్దకు రమ్మని చెప్పి, అక్కడికి వెళ్లిన తర్వాత సరైన సమాధానం ఇవ్వక ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. హోటళ్లకు విచ్చలవిడిగా సరఫరా..? ప్రజలకు గ్యాస్ అందుబాటులో లేకపోయినా, హోటళ్లకు మాత్రం విచ్చలవిడిగా సిలిండర్లు సరఫరా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాణిజ్య సిలిండర్లు ఇవ్వాల్సిన చోట, గృహ వంట గ్యాస్ సిలిండర్లను అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమంగా లాభాలు ఆర్జిస్తున్నారని అంటున్నారు. వివరాలు వెల్లడించాలంటూ డిమాండ్ గోదాంలో ఎన్ని కనెక్షన్లు ఉన్నాయో, రోజుకు ఎన్ని బుకింగ్స్ వస్తున్నాయో, ఎన్ని సిలిండర్లు సరఫరా చేస్తున్నారో పూర్తి వివరాలు వెల్లడించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. గ్యాస్ కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గోదాంలో జరుగుతున్న అక్రమాలపై పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోందని అంటున్నారు. తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి అక్రమ గ్యాస్ సరఫరాను అరికట్టి, అర్హులైన వినియోగదారులకు సమయానికి సిలిండర్లు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.




# మహిళా రిజర్వేషన్లలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు 'కోటాలో కోటా' కల్పించాలి

### - కాంగ్రెస్ మహిళా నాయకురాలు షబానా మహమ్మద్



**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 17(ది క్రైమ్ న్యూస్):** ఇప్పటికే స్థానిక సంస్థల్లో బీసీ మహిళలకు రిజర్వేషన్లు అమలవుతున్న నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రస్తుత మహిళా రిజర్వేషన్ బిల్లు వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ బిల్లు అన్ని వర్గాల మహిళలకు సమాన అవకాశాలు కల్పిస్తుందా? లేక సామాజికంగా ఇప్పటికే బలంగా ఉన్న వర్గాలకే మళ్లీ పెద్దపీట వేస్తుందా? అనే అంశాన్ని లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ మహిళా నాయకురాలు షబానా మహమ్మద్ అన్నారు. మహిళా సాధికారత అంటే కేవలం ప్రాతినిధ్యం పెరగడం మాత్రమే కాదు; బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలకు చట్టసభల్లో సముచిత న్యాయం జరిగినప్పుడే అది సాధ్యమవుతుంది. సరైన రక్షణలు లేకుండా సాధారణ మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే, వెనుకబడిన వర్గాల మహిళలకు అవకాశాలు దక్కక సామాజిక అసమానతలు మరింత పెరిగే ప్రమాదం ఉంది.కావున, ప్రతి సామాజిక వర్గానికి న్యాయం జరిగేలా ఈ బిల్లును తక్షణమే పునఃపరిశీలించాలి. అవసరమైన సవరణలు చేసి, అన్ని వర్గాల మహిళలకు వాటా కల్పించకపోతే.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళలందరినీ ఏకం చేసి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజాస్వామ్య పోరాటం చేస్తామని హెచ్చరిస్తున్నాము. సమానత్వం పేరుతో ఏ ఒక్క వర్గానికి అన్యాయం జరగకుండా ప్రభుత్వం తక్షణమే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి.

# తెలంగాణ రగ్బీ జట్టులో నల్గొండకు గౌరవ స్థానం

## అందుగుల శివలింగం ఎంపికతో జిల్లా గర్వం





**నల్గొండ,ఏప్రిల్ 17 ప్రతినిధి(ది క్రైమ్ న్యూస్):** సీనియర్ నేషనల్ రగ్బీ 7స్ ఛాంపియన్‌షిప్--2026 కోసం తెలంగాణ పురుషుల జట్టును ప్రకటించారు. ఈ పోటీలు బీహార్ రాష్ట్రంలోని రాజ్‌గిర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏప్రిల్ 20, 21 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ ప్రతిష్టాత్మక పోటీలకు రాష్ట్రం తరఫున ఎంపికైన జట్టులో నల్గొండ జిల్లాకు చెందిన ఆటగాళ్లు చోటు దక్కించుకోవడం విశేషం. కర్నాటి ఆకాష్, అందుగుల శివలింగం ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. ముఖ్యంగా మల్లెపల్లి మండలం చింతకుంటల గ్రామపంచాయతీ పరిధిలోని దేశముఖ వారి కుంట గ్రామానికి చెందిన అందుగుల శివలింగం జట్టులో స్థానం సంపాదించడం స్థానికులకు ఆనందాన్ని కలిగించింది. ఆయన తల్లిదండ్రులు పెద్ద ముత్యాలు, రమణ ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం 12 మంది ఆటగాళ్లతో జట్టును ఎంపిక చేయగా, కోచ్‌గా ఎ. వెంకటేశన్, మేనేజర్‌గా తరుణ్, ఫిజియోగా సి. ప్రేమ్ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఈ సందర్భంగా స్థానిక క్రీడాభిమానులు జట్టుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

# ముడుపుల మత్తులో హాలియా ఆబ్కారి శాఖ

### - గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం ప్రతినిత్యం ప్రజల గొంతుక: కొండేటి శీను కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు



**నల్గొండ,ఏప్రిల్ 17 ప్రతినిధి(ది క్రైమ్ న్యూస్):** నల్లగొండ జిల్లా అనుముల మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను ఆబ్కారీ శాఖ అధికారులపై తీవ్ర ఆరోపణలు చేశారు. హాలియా సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో మద్యం ఏరులై పారుతున్నా, పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు మాత్రం ముడుపుల కోసం చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కొన్ని సందర్భాల్లో కల్తీ మద్యం బయటపడినా, వైన్స్ షాపుల యాజమాన్యంతో కుమ్మక్కై ముడుపుల కోసం అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. అంతర్గతంగా, బాహాటంగా ఈ విషయాలపై చర్చ జరుగుతున్నప్పటికీ, అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. దసరా పండుగ సమయంలో హాలియా సర్కిల్‌లోని బెల్ట్ షాపుల వద్ద రూ.1,000 నుండి రూ.3,000 వరకు వసూళ్లు చేస్తున్నారని, గ్రామాల్లో రైడింగ్ పేరుతో ప్రజల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా, పర్మిట్ రూమ్‌లలో కనీస సౌకర్యాలు లేవని, అనుమతి లేని పర్మిట్ రూమ్‌లను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల యజమానులు ప్రతి క్వార్టర్‌పై రూ.30 నుంచి రూ.50 వరకు అధికంగా వసూలు చేస్తున్నారని, అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల వల్ల పేద ప్రజలు, యువత మద్యానికి బానిసలై అప్పుల పాలవుతూ, కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలో జిల్లా కలెక్టర్ మరియు ఆబ్కారీ శాఖ సూపరింటెండెంట్‌ను కలిసి పూర్తి వివరాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దైద శ్రీను, జిల్లా కమిటీ సభ్యులు దొంతల నాగార్జున, దోరేపల్లి మల్లయ్య, మేకల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపల్లిలో పోషణ పక్షం కార్యక్రమం అవగాహన సమావేశం, ప్రతిజ్ఞ ర్యాలీ



**నల్గొండ,ఏప్రిల్ 17 ప్రతినిధి(ది క్రైమ్ న్యూస్):** నల్లగొండ జిల్లా అనుముల మండలంలోని కొత్తపల్లి వన్, టూ అంగన్వాడి కేంద్రాల్లో పోషణ పక్షం కార్యక్రమం భాగంగా అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప సర్పంచ్ గార్లపాటి గోవర్ధన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీడీపీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ, స్థానికంగా లభించే చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు ఆహారంలో ఎక్కువగా చేర్చుకోవాలని సూచించారు. సమతుల ఆహారం తీసుకోవడం వల్ల పిల్లలు, పెద్దలు అనారోగ్యానికి గురికాకుండా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అలాగే ఆహారం తీసుకునే ముందు చేతులు పరిశుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన త్రాగునీరు ఎక్కువగా తీసుకోవడం అవసరమని వివరించారు. కిశోర బాలికలు ఐరన్, కాల్షియం అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం బాలబాలికలతో కలిసి పోషణపై ప్రతిజ్ఞ చేయిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ సువర్ణ, సూపర్వైజర్లు రమాదేవి, విజయలక్ష్మి, వార్డు సభ్యురాలు స్పందన, అంగన్వాడి టీచర్లు వజ్రమ్మ, గోవిందమ్మ, తల్లిదండ్రులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

# రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమం.. నిరసనలకు పిలుపు



**నల్గొండ,ఏప్రిల్ 17 ప్రతినిధి(ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమ పంథాను ఎంచుకున్నట్లు తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సేవా సంఘం ప్రకటించింది. హైదరాబాద్‌లోని రెవెన్యూ భవన్‌లో ఈ నెల 7వ తేదీన నిర్వహించిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు మరియు విరమణ పొందిన ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యంగా నాలుగు ప్రధాన సమస్యలను గుర్తించారు. వాటిలో వేతన సవరణ, పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపు, ఆరోగ్య కార్డుల అమలు, నూతన పెన్షన్ విధానం రద్దు అంశాలు ఉన్నాయి. అదేవిధంగా రెవెన్యూ ఉద్యోగులకు సంబంధించిన పదోన్నతులు, బదిలీలు, పెండింగ్‌లో ఉన్న కరుణ నియామకాలు, క్రమబద్ధీకరించబడిన గ్రామ సహాయకుల సేవా సమస్యలు, పూర్వ గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యలు తదితర అంశాల పరిష్కారానికి ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా ఈ నెల 17వ తేదీన మండల, జిల్లా కేంద్రాల్లో భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని, మే 5వ తేదీన జిల్లా కేంద్రాల్లో ఒకరోజు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే, మరింత తీవ్ర ఉద్యమ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఐక్య కార్యాచరణ కమిటీ స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన సకల జనుల సమ్మె స్ఫూర్తితో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, విరమణ పొందిన ఉద్యోగులు ఐక్యంగా పోరాటం చేయాలని సంఘం పిలుపునిచ్చింది. ప్రతి రెవెన్యూ ఉద్యోగి ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొని వాటిని విజయవంతం చేయాలని కోరింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో చందర్రావు, ఉప ఎమ్మార్వో రఘు, సీనియర్ సహాయకుడు సత్యసాయి రామారావు, జూనియర్ సహాయకులు పూర్ణచంద్రారావు, వెంకటేశ్వర్లు, అనిల్, జయమ్మ, వెంకన్న, గ్రామ తపాలా అధికారులు సంపత్ కుమార్, సైదులు, రికార్డ్ అసిస్టెంట్ క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలి

**• ఆయుష్ సేవలపై ప్రత్యేక దృష్టి • యోగా కేంద్రాల ఏర్పాటు పరిశీలన • జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులకు సూచించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించిన సందర్భంగా కలెక్టర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆయుష్ ఆసుపత్రుల పనితీరును పరిశీలించిన కలెక్టర్, ఆయుర్వేదం, హోమియోపతి సేవలపై ప్రజల స్పందన, రోజువారీ ఓపీ సంఖ్య వివరాలు తెలుసుకున్నారు. యోగా కేంద్రాల ఏర్పాటు కోసం స్థలాల లభ్యతపై పరిశీలించాలని సూచించారు. అవసరమైన ఔషధాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ఎక్స్-రే, 2డీ ఎకో యంత్రాల పనితీరును పరిశీలిస్తూ రోజువారీ పరీక్షల సంఖ్య పెంచాలని, ప్రజలకు ఎక్కువ సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రోగులకు పరీక్షల ఫలితాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. హెచ్‌పీవీ టీకా కార్యక్రమంలో ప్రగతి తక్కువగా ఉన్నదని, గత నెలలో 800 మాత్రమే అందించారని తెలిపారు. రాబోయే రెండు నెలల్లో 6 వేల టీకాలు పూర్తి చేసేలా లక్ష్యంగా పెట్టుకుని ఆశా, ఏఎన్ఎం సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. 14--15 ఏళ్ల బాలికలు తప్పనిసరిగా ఈ టీకా తీసుకోవడం ద్వారా కాన్సర్ నుండి రక్షణ పొందవచ్చని వివరించారు. తదుపరి ఒక నెలలో అన్ని అంగన్‌వాడీలను ఆర్బీఎస్కే బృందాలు సందర్శించి పిల్లల ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, టిబి ప్రభావిత ప్రాంతాల్లో పరీక్షలు చేపట్టి రోగులను గుర్తించి తగిన చికిత్స అందించాలని సూచించారు. అబార్షన్ ఆడిట్ తప్పనిసరిగా నిర్వహించాలని,



అనధికార స్కానింగ్‌లను అరికట్టాలని ఆదేశించారు. గర్భిణీలకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ సమయానికి ఔషధాలు, పోషకాహారం అందేలా చూడాలని తెలిపారు. అధిక ప్రమాద గర్భిణీలను గుర్తించి ప్రత్యేక సంరక్షణ అందించాలని, ఎక్కువ శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డయాలిసిస్ రోగులకు నిరంతర చికిత్స సజావుగా అందేలా చూడాలని, ఆసుపత్రుల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఆసుపత్రి పరిసరాల్లో ఎక్కడా ధూళి, చెత్త లేకుండా శుభ్రంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, డిసిహెచ్ ఓ డాక్టర్ శ్రీధర్, అదనపు వైద్యాధికారి వాణిశ్రీ ,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అనుమతి లేని దారి కట్టారు.. అమాయక రైతును ముంచారు

**• నదిలో టోల్గేట్.. చట్టం ఎక్కడ? • నాసిరకం నిర్మాణం- ట్రాక్టర్ బోల్తా • తృతిలో తప్పిన ప్రాణాపాయం• రైతు కష్టం నీళ్ల పాలైన వైనం**

**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** ఎండాకాలం వస్తే నదులు,వాగులు, వంకలు ఎండిపోవడం సహజం. కానీ మానేరు నదిలో టోల్ గేట్లు మొలకెత్తడం అసహజం. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కనగర్తి మరియు వీణవంక మండలం మల్లారెడ్డి పల్లి గ్రామాల మధ్యగల మానేరు నదిలో ఇప్పుడు చట్టం కాదండి కలిసికట్టుగా దందా నడుస్తున్నది. రాత్రికి రాత్రే మొరంపోసి రోడ్డు నిర్మించేశారు. ఇరువైపులా గేట్లు పెట్టి టోల్ ఫీజు పేరుతో వసూళ్లు స్టార్ట్ చేశారు. కానీ ప్రభుత్వ అనుమతి మాత్రం ప్రశ్నార్థకం. ఏమిటని అడిగితే కారణాలు రెడీగా ఉన్నాయి. ఆలయాల అభివృద్ధి పేరు తో, గ్రామ సేవ పేరుతో సమాధానాలు లభిస్తున్నాను. కానీ అసలు విషయం కాసులు దండుకోవడమే. ఈరోజు జరిగిన ఒక ప్రమాదంతో ఈ అక్రమ దారి అసలు రూపం బయటపడింది. దూరం తగ్గుతుందని భావించి ఒక రైతు వరి ధాన్యపు లోడుతో ఉన్న ట్రాక్టర్ను తీసుకొని ఈ మార్గం నుండి వెళు ్తుండగా.. నాసిరకపు నిర్మాణం బలహీనమైన దారి కారణంగా ట్రాక్టర్ బోల్తా పడింది. ఫలితం సుమారు 30 క్వింటాళ్ల వరి ధాన్యం క్షణాల్లో నీటి ప్రవాహంలో కలిసి కొట్టుకుపోయింది. మేల్ ఫిమేల్ ధాన్యంగా అందిన సమాచారం ప్రకారం ఆ రైతుకు లక్షల్లో నష్టం వాటిల్లింది. ట్రాక్టర్ ట్రాలీ మాత్రమే బోల్తా పడి రైతు ప్రాణాపాయ స్థితి నుండి బయటపడ్డాడు. ఇది ప్రమాదమా? లేక అక్రమ దందా చేసిన నేరమా? అనే ప్రశ్నలు ఇప్పుడు జోరుగానే వినబడుతున్నాయి. ఈ దారిని నిర్మించిన వారు ఎవరు? ఎవరి అండతో నిర్మించారు? ఇప్పుడు ఆ రైతుకు జరిగిన నష్టానికి బాధ్యులు ఎవరు? అధికారులకు ఇది కనిపించడం లేదా? లేక



కనగర్తి - మల్లారెడ్డి పల్లి గ్రామాల మధ్య మానేరులో బోల్తా పడిన ట్రాక్టర్

కనిపించనట్టు నటిస్తున్నారా? లాంటి అనేక ప్రశ్నలు లోలోపలే వినబడుతున్నాయి. ఇక్కడ చట్టం అనేది మానేరులో నీరు లాగే ఎండిపోయింది. ఇకనైనా అధికారులు వెంటనే స్పందించి ఈ హరహా రహదారులను మూసివేయాలి, నష్టపోయిన రైతుకు పరిహారం అందించాలి, వసూళ్లపై విచారణ జరపాలి. లేదంటే ఆ రైతు లాగే మరికొందరు కూడా నష్టపోయే ప్రమాదం ఉందన్న భావన బలంగా వినబడుతున్నది.

# బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణా ప్రజలకు క్షమాపన చెప్పాలి

**రామగిరి, ఏప్రిల్ 17(ది క్రైమ్ న్యూస్):-** తెలంగాణ రాష్ట్ర ప్రజల మనోభావాలు దెబ్బతీస్తూ రాష్ట్ర విభజన అంశాన్ని దేశ విభజనతో పోల్చిన బీజెవైఎం జాతీయ అధ్యక్షుడు, బెంగుళూరు దక్షిణ నియోజక వర్గం లోక్ సభ సభ్యులు తేజశ్రీ సూర్య తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బేషరత్తుగా క్షమాపణ చెప్పాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు నూనె రాజేశం,రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు పోతు జ్యోతి రెడ్డి లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామగిరి మండలం సెంటినరీ కాలనీ రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణములో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సమావేశం నిర్వహించి ఏంపీ తేజస్వి సూర్య నిన్న పార్లమెంట్లో మాట్లాడిన మాటలను ఖండించిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు నూనె రాజేశం, రాష్ట్ర కార్యదర్శి బత్తుల శంకర్,రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు పోతు జ్యోతి రెడ్డి,కొండ సమ్మయ్య, యాకుబ్ లావణ్య తదితర ఉద్యమకారులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు భారత రాజ్యాంగ నిబంధనలకు లోబడి ఆర్టికల్ ప్రకారం ఏర్పాటు జరిగిందన్న విషయం గుర్తుంచుకోవాలని ఆయన తెలిపారు. ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాష్ట్ర ప్రజల మనోభావాలను గాయపరిచాయని వెంటనే ఆయన క్షమాపణ చెప్పాల్సిన అవసరం ఉందని తెలిపారు. లేకుంటే తెలంగాణ ప్రజల పట్ల బీజేపీ వైఖరి స్పష్టమైనదిగా భావించాల్సి వస్తుందని పేర్కొన్నారు.నిన్న జరిగిన పార్లమెంటు సమావేశాల్లో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్తాన్ తో పోల్చడం సరైంది కాదు, అని ఇది అతని అవగాహన లేని తనానికి నిదర్శనం, అన్నారు ఆరు దశాబ్దాలుగా తెలంగాణ ప్రజలు ఆంధ్ర దోపిడికి వ్యతిరేకంగా ఆత్మగౌరవం కోసం పోరాడి రాష్ట్రాన్ని సాధించుకున్నారు, నీళ్లు నిధులు నియామకాల కోసం ఎంతో రక్తతర్పణ చేశారు,1969 తొలి దశ ఉద్యమం లో 369 మంది మరవీరుల త్యాగాలు మరువలేనిది అన్నారు



అలాగే ,మాలి దశ ఉద్యమం లో 1200 మంది అమరవీరుల బలి దానంతో వచ్చిన తెలంగాణను పాకిస్తాన్ తో పోల్చడం తేజస్వి సూర్య సిగ్గులేని, చేటని అవగాహన లేని తనానికి అర్ధరహిత వ్యాఖ్యలను ఖండించారు , తెలంగాణ రాష్ట్రం ఏడల బిజెపి వైఖరి ఇదేనా ? దీనిపై బిజెపి పార్టీ సమాధానం చెప్పాలి, లేదా ఎంపీ తేజశ్రీ సూర్యని పదవి నుండి వెంటనే సస్మేంట్ చేయాలి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తేజస్వి సూర్య వెంటనే క్షమాపణలు చెప్పాలి, ఎంపీ తేజస్వి సూర్య క్షమాపణలు చెప్పేదాకా తెలంగాణ ప్రజలు వదిలే ప్రసక్తి లేదని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమం లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు నూనె రాజేశం, రాష్ట్ర కార్యదర్శి బత్తుల శంకర్,రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు పోతు జ్యోతి రెడ్డి,కొండ సమ్మయ్య, యాకుబ్ లావణ్య తదితరు లు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి పరిధిలో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం

**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** శేరిలింగంపల్లి, మియాపూర్, ఆల్విన్ కాలనీ సర్కిళ్ల పరిధిలోని డివిజన్లలో నెలకొన్న సమస్యలు చేపట్టవలసిన అభివృద్ధి పనులపై శుక్రవారం పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ అధ్యక్షత కీలక సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, సిఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ డివిజన్లలో ఉన్న సమస్యలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా ఉండాలని, అధికారులు నిర్లిప్తతను విడిచి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. కాలనీల్లో ఉన్న రోడ్ల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అవసరమున్న చోట కొత్త పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, మంజూరైన పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. పనుల్లో ఆలస్యం చేయకుండా సమయపాలన పాటించాలని హెచ్చరించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాలాల విస్తరణ, పూడికతీత పనులను వేగవంతం చేయాలని, నీటి ప్రవాహం సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరద ముప్పు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే అసంపూర్తిగా ఉన్న రోడ్ల పనులను



త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు పనిచేయాలని, కాలనీల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాలని గాంధీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఎంసీ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఈఈ శిరీష, డిఈ శ్రీదేవి, డిఈ మౌనిక, ఏఈ భాస్కర్, ఏఈ యుగేందర్, వర్క్ ఇన్స్పెక్టర్లు మహాదేవ్, రవి తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహార లోపం లేకుండా చూడటం ప్రభుత్వ సంకల్పం : పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పోషణ అభియాన్ లక్ష్యంగా ప్రతి గ్రామంలో పోషకాహార లోపం లేకుండా చూడటం ప్రభుత్వ సంకల్పమని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం, పోషన్ అభియాన్‌లో భాగంగా ఆల్విన్ సర్కిల్ పరిధిలోని అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. వివేకానంద నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ పాల్గొని 26 మంది అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ రేణుక, మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు మెరుగైన సేవలు అందించేందుకు ఈ మొబైల్ ఫోన్లు ఎంతో ఉపయోగ పడతాయని పేర్కొన్నారు. సమాచార మార్పిడి, రోజువారీ కార్యకలాపాల నిర్వహణ, పిల్లల బోధనలో ఈ ఫోన్లు సహాయపడతాయని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల్లో చదువుతున్న పిల్లలకు ఉచిత యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా పిల్లలకు పౌష్టికాహారం సమయానికి అందించాలని, గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సూచించారు. పరిశుభ్రమైన వాతావరణంలో మంచి విద్య అందించి పిల్లల భవిష్యత్తును బలోపేతం చేయాలని కోరారు. అర్హులైన దివ్యాంగులకు స్కూటీలు అందజేయనున్నట్లు కూడా ఈ సందర్భంగా తెలిపారు. టీచర్లకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి, మారేళ్ల శ్రీనివాస్, బ్రిక్ శ్రీనివాస్, ఎండి ఇబ్రహీం, గుమ్మడి శ్రీనివాస్ అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



# ప్రజాక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం

## పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం ప్రజాక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతిగా నిలుస్తున్నారని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. శుక్రవారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్ కాలనీకి చెందిన మహ్మద్ సోహైల్ కి అత్యవసర వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ పత్రాన్ని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు ఒక గొప్ప ఆధారమని అన్నారు. ఆపదలో ఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఆపన్నహస్తంలా నిలిచి, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. అత్యవసర సమయంలో తమకు సహాయం అందించినందుకు ఆరెకపూడి గాంధీకి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘునాథ్ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ఎండి ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

# ఆ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం : జగదీశ్వర్ గౌడ్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కించపరిచేలా వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా, వి జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటును అవమానించే విధంగా మాట్లాడిన తేజస్వి సూర్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని, ఆయన ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కోసం ఎన్నో సంవత్సరాలు సాగిన పోరాటం, త్యాగాల ఫలితంగా రాష్ట్రం ఏర్పడిందని, అలాంటి రాష్ట్రాన్ని చిన్న చూపు చూడటం అసహ్యకరమని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని, ప్రస్తుతం రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నదీ కాంగ్రెస్ పార్టీనే అని ఆయన స్పష్టం చేశారు. బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడినందుకు తేజస్వి సూర్య వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ చరిత్రను, ప్రజల భావాలను గౌరవించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని, తెలంగాణను అవమానించడం అంటే ప్రజల త్యాగాలను అవమానించడం అవుతుందని ఆయన అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యను బలోపేతం చెద్దాం

**- వేసవి సెలవుల్లో మరమ్మత్తు పనులు పూర్తి చేయండి**

**- ధర్మపురి నియోజకవర్గ విద్యాశాఖ సమీక్షలో మంత్రి అడ్లూరి సూచనలు**



**ధర్మపురి, ఎప్రిల్ 17, (ది క్రైమ్ న్యూస్):** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. ధర్మపురి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పై జగిత్యాల జిల్లా కలెక్టరేట్ లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని అన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని మంత్రి కోరారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు తీసుకువస్తానని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ప్రాథమిక అవసరాలను గుర్తించి నివేదికలు తయారు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆయన ఆదేశించారు. ప్రస్తుతం వేసవి సెలవులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో తిరిగి తరగతులు ప్రారంభమయ్యే నాటికి పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు మంత్రి సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీ పని, ఇతర వ్యవసాయ పనులు చేసుకునేవారు తమ పిల్లల్ని పాఠశాలకు పంపే సమయంలో ఉదయం పూట టిఫిన్ చేసే పరిస్థితి లేదని గమనించిన ముఖ్యమంత్రి ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి అల్పాహారం అందించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అల్పాహార వసతి పై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు పెరిగే విధంగా కృషి చేయాలని మంత్రి అడ్లూరి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# మహిళా పోలీసుల సాధికారతే లక్ష్యం : రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి









**కరీంనగర్, ఏప్రిల్17(ది క్రైమ్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, తెలంగాణ పోలీసు శాఖ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "అరైవ్ - అలైవ్" రోడ్డు భద్రత వారోత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర డీజీపీ శ్రీ శివధర్ రెడ్డి గారు శుక్రవారం కరీంనగర్ విచ్చేశారు. రోడ్డు భద్రత అవగాహన సదస్సు అనంతరం, కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో విజయవంతంగా కొనసాగుతున్న "షీ లీడ్స్" మహిళా పోలీసుల ప్రత్యేక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిజర్వేషల్లు మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసు శాఖలో మహిళల ప్రాతినిధ్యం పెరగాలని, రాష్ట్ర ఏర్పాటు అనంతరం సివిల్ విభాగంలో 33 శాతం, ఏఆర్ విభాగంలో 10 శాతం రిజర్వేషన్లు కల్పించినట్లు డీజీపీ తెలిపారు.షీ టీమ్స్,, భరోసా కేంద్రాలు: తెలంగాణలో ప్రారంభమైన 'షీ టీమ్స్' నమూనాను నేడు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని ఆయన కొనియాడారు. 2016లో హైదరాబాద్‌లో ప్రారంభమైన 'భరోసా' కేంద్రాలు ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 35 కేంద్రాలకు విస్తరించాయని, వీటి పనితీరును గౌరవ సుప్రీంకోర్టు సైతం అభినందించడం రాష్ట్ర పోలీసు శాఖకు గర్వకారణమని పేర్కొన్నారు. కరీంనగర్ సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ "షీ లీడ్స్" కార్యక్రమ విశిష్టతను వివరిస్తూ ఈ క్రింది అంశాలను వెల్లడించారు సమగ్ర శిక్షణ: మహిళా పోలీసులకు నాయకత్వ లక్షణాలు, సైబర్ క్రైమ్ అవగాహన, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ మరియు అత్యవసర సమయాల్లో ప్రాణాలను రక్షించే సిపిఆర్ పై నిపుణులతో శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. ఆరోగ్య సంరక్షణ: సిబ్బంది ఆరోగ్యం కోసం 52 పరామితులతో కూడిన ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. సామగ్రి పంపిణీ: క్షేత్రస్థాయిలో విధుల నిర్వహణ కోసం 40 మంది బ్లూ కోల్ట్ సిబ్బందికి 20 స్కూటీలు, పెప్పర్ స్ప్రేలు మరియు హాట్ బాక్సులను డీజీపీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. స్నేహిత కార్యక్రమం: విద్యార్థుల్లో సైబర్ సేఫ్టీ మరియు డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించేందుకు "స్నేహిత" కార్యక్రమాన్ని విస్తృతంగా చేపడుతున్నట్లు సీపీ వివరించారు. మహిళా పోలీసులు వృత్తిపరంగానే కాకుండా, సామాజికంగా శక్తివంతమైన నాయకులుగా ఎదిగేందుకు "షీ లీడ్స్" ఒక గొప్ప వేదికగా నిలిచిందని ఈ సందర్భంగా అధికారులు అభిప్రాయపడ్డారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించండి



**మానకొండూర్,ఎప్రిల్17, (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల జాయింట్ యాక్షన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు తహసీల్దార్ కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించి, 2004సెప్టెంబర్1 నోటిఫికేషన్ తర్వాత నియామకమైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. పెండింగ్ బిల్లులు, డీఏలను విడుదల చేసి హెల్త్ కార్డులు అమలు చేయాలని,గత హామీ ప్రకారం 61 నిండిన వీఆర్ఏల సమస్యలను పరిష్కరించి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు సాధారణ బదిలీలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణను ప్రకటించి, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ ఎంఎల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలాలని, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలు, పిఆర్సిలో ఎస్జిటి, ఎస్ఏల మధ్య వేతన వ్యత్యాసాలు సవరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులు కరివేద మహిపాల్ రెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ టి. సమ్మయ్య భావన,కె శైలజ, జె రాములు ,జి నరసయ్య, వేణుమాధవ్, కే శ్రీనివాస్, శైలజ, పద్మ, మాధవి, సుభాషిని, రాము, శ్రీనివాస్, జిపిఓలు, కార్యాలయ సిబ్బంది వినతి పత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం పని చేసే ప్రభుత్వం

- గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాగితాలకే పరిమితమైన ప్రభుత్వం
- సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్





**ధర్మపురి, ఎప్రిల్ 17, (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల కోసం పని చేసే ప్రభుత్వమని గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం కాగితాలకు మాత్రమే పరిమితమైన ప్రభుత్వమని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ లక్ష్మీనరసింహ సదన్ ను మంత్రి లక్ష్మణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రూ. 5 కోట్ల అంచనాలతో ప్రారంభించిన శ్రీ లక్ష్మీనరసింహ సదన్ నిర్మాణానికి గత ప్రభుత్వం కేవలం కోటి రూపాయలు మాత్రమే నిధులు విడుదల చేసిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే లక్ష్మి నరసింహ సదన్ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క చొరవతో నిధులు విడుదల చేయించినట్లు మంత్రి అడ్లూరి తెలిపారు. శ్రీ లక్ష్మి నరసింహ సదన్ నిర్మాణానికి గత ప్రభుత్వం రూ. కోటి విడుదల చేస్తే తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే శ్రీ లక్ష్మీనరసింహ సదన్ ను అందుబాటులోకి తీసుకురావడానికి రూ. 2.24కోట్లు విడుదల చేయించినట్లు మంత్రి తెలిపారు. కొత్తగా నిర్మించిన గదుల్లో ఫర్నిచర్ కోరకు రూపాయలు కోటి వరకు వెచ్చించినట్లు మంత్రి తెలిపారు. సుదూర ప్రాంతాల నుండి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దైవదర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆరు వీఐపీ గదులతో పాటు సామాన్య భక్తుల కోసం 60 గదులు అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు మంత్రి వివరించారు. శ్రీ లక్ష్మీ నరసింహ సదన్ మరింత ఆకర్షణీయంగా కనిపించడానికి అధికారులకు మంత్రి లక్ష్మణ్ కుమార్ పలు సూచనలు చేశారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి సదన్ పరిశుభ్రంగా ఉంచడానికి ప్రత్యేక ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ నియమించి పరిశుభ్రతను కాపాడాలని అధికారులకు సూచించారు. దేవాదాయ శాఖ అధికారులతో పాటు రెవెన్యూ అధికారులు వారంలో ఒకసారి సదన్ ను సందర్శించి పరిసరాల పరిశుభ్రత మౌలిక సదుపాయాల మెరుగుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.
మంత్రి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వేముల రాజేష్‌తో పాటు ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్లు, దేవాదాయ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, ధర్మపురి మున్సిపల్ అధికారులతో పాటు రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

# మేడిపల్లి రైతులతో లీడ్ బ్యాంకు మేనేజర్ సమావేశం

**-తహసీల్దార్ పర్నింది సుమన్ -లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేష్**



**రామగిరి, ఏప్రిల్ 17(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో శుక్రవారం జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేష్, తహసీల్దార్ పర్నింది సుమన్ లు మేడిపల్లి రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ శ్రీ కోయ హర్ష బ్యాంకర్ లను రైతుల వద్దకు పంపించారు. ఇండస్ట్రియల్ పార్క్ కింద రామగిరి ఖిల్లాలోని మేడిపల్లి శివారులో ప్రభుత్వం 200 ఎకరాల వ్యవసాయ భూమిని తీసుకుంది. ఈ క్రమంలో రైతులు కలెక్టర్ వద్ద పలు ప్రతిపాదనలు చేశారు. రైతులకు షూరిటి లేకుండా రూ.10 లక్షల రుణం ఇవ్వాలని, క్రాప్ లోన్ మాఫీ చేయాలని బ్యాంక్ అధికారులకు తేల్చి చెప్పారు. రైతులు మంగళవారం లోపు తమ ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ తో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని అధికారులు తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు, రత్నాపూర్ యూనియన్ బ్యాంక్ మేనేజర్ కొత్తరా మురళి, పెద్దపల్లి మేనేజర్ శ్రీధర్, రామగిరి ఆర్.ఐ కె.మహేష్ పంచాయతీ సెక్రెటరీ గంగుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# నాగేపల్లి, పన్నూర్ క్రాస్ వద్ద న్యూ మోడల్ బస్ షెల్టర్ల నిర్మాణం

**- బస్ షెల్టర్ల నిర్మాణానికి రూ. 20 లక్షల నిధులు మంజూరు - నాగేపల్లి ఎక్స్ రోడ్ బస్ షెల్టర్ నిర్మాణానికి రూ. 10 లక్షలు**
**- పన్నూర్ బస్ షెల్టర్ నిర్మాణానికి రూ. 10 లక్షలు - స్థల పరిశీలన చేసిన మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్**

**రామగిరి, ఏప్రిల్ 17(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండల పరిధిలోని నాగేపల్లి,పన్నూర్ ప్రాంతాల్లో న్యూ మోడల్ బస్ షెల్టర్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 లక్షల నిధులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు ప్రత్యేక చొరవతో ఈ నిధులు మంజూరు సాధ్యమయ్యాయని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ అన్నారు.మంత్రి ఆదేశాల మేరకు మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ ముందుగా పన్నూర్ గ్రామంలో పర్యటించి, అనంతరం నాగేపల్లి ఎక్స్ రోడ్ ప్రాంతాన్ని సందర్శించి, బస్ షెల్టర్ల నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంజూరైన నిధులతో అత్యాధునిక సౌకర్యాలతో బస్ షెల్టర్ల నిర్మాణం చేపట్టి, ప్రయాణికులకు త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక దృష్టి సారించారని, గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పన్నూర్ గ్రామ సర్పంచ్ చిందం మహేష్ , నాగేపల్లి గ్రామ సర్పంచ్ కొండావేన దివ్య సుధాకర్ లు తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ లకి పన్నూర్,నాగేపల్లి గ్రామ పంచాయితీ పాలకవర్గం నాగేపల్లి ఉపసర్పంచ్ యాసం సతీష్, వార్డు సభ్యులు బాద్రపు శ్రీనివాస్, రామినేని గోపాలక్రిష్ణ, పందుల సోము, గ్రామ ప్రజలు,నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎల్లే రామ్మూర్తి, మాజీ సర్పంచ్లు తీగల సమ్మయ్య, ఎరుకల ఓదెలు, ఆదివారం పేట సర్పంచ్ ఇల్లందుల సంజీవ్, రామగిరి మండలం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కండె పోషం, సెంటెనరి కాలనీ టౌన్ అధ్యక్షులు కాటం సత్యం, గ్రామ శాఖ అధ్యక్షులు తీగల సదయ్య, సీనియర్ కాంగ్రెస్ పార్టీ





నాయకులు ఒర్రె సది, గొల్లపల్లి రాజమల్లు, ఐఎన్టీయూసీ నాయకులు పెద్ది సమ్మయ్య, అర్జున్ రావు, పన్నూర్ గ్రామ యూత్ అధ్యక్షులు ఏరావేనే అజయ్, యూత్ ఉపాధ్యక్షులు సిద్ధం బన్నీ, నాగేపల్లి యూత్ అధ్యక్షులు వేగోలపు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కలిసి కట్టుగా పని చేయాలి

**-రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం అరైవ్ అలైవ్ కార్యక్రమాలు - రోడ్డుప్రమాదం సంభవిస్తే 'గోల్డెన్ అవర్' కీలకం - ప్రతీఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి - రామగిరి ఎస్సై తాడవేని శ్రీనివాస్**




**రామగిరి, ఏప్రిల్ 17(ది క్రైమ్ న్యూస్):-**రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు కలిసికట్టుగా పని చేయాలని రోడ్డుప్రమాదం జరిగినపుడు 'గోల్డెన్ అవర్' అనేది కీలకమైన సమయమని రామగిరి ఎస్సై తాడవేని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సెంటినరీ కాలనీ లోని వీటీసీ ట్రైనింగ్ సెంటర్ లో ఆరైవ్ ఆలైవ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామగిరి ఎస్సై తాడవేని శ్రీనివాస్ మాట్లాడుతూ ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల మధ్యలో జరుగుతున్నాయని చెప్పారు. గోల్డెన్ అవర్ అనేది ప్రమాదం తర్వాత మొదటి గంట అని, ఇది చాలా కీలకమైన సమయం అని ఈ సమయంలో అవసరమైన వైద్య సహాయం అందించేందుకు తోడ్పడాలన్నారు. ప్రమాదం జరిగిన మొదటి గంటలో సరైన వైద్యం అందితే ప్రాణాలను కాపాడవచ్చునని అన్నారు. ద్విచక్రవాహనాలు నడిపేవారు హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీటుబెల్టు తప్పకుండా పెట్టుకోవాలన్నారు.మద్యం సేవించి వాహనాలు నడపడం కారణంగా అనేక మంది మృత్యువాత పడుతున్నారన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించకపోవడం, ట్రిపుల్ రైడింగ్, సీట్‌బెల్ట్ వాడకపోవడం, అతివేగం, ఫోన్లు మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని అన్నారు. అలాగే సిపి ఆర్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పురుషోత్తం దివ్య, బేగంపేట్ వైద్యాధికారి ప్రదీప్ కుమార్, వీటిసి మేనేజర్ సుజిత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అలుగునూరులో చలివేంద్రం ఏర్పాటు చేసిన ముంజ స్వాతి-శ్రీకాంత్ గౌడ్



**తిమ్మాపూర్, ఎప్రిల్ 17(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరు చౌరస్తా వద్ద యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షురాలు ముంజ స్వాతి- శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎండాకాలం నేపథ్యంలో గ్రామస్తులు,వాహనదారుల దాహార్తిని తీర్చడం భాధ్యతగా భావించి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.నాయకులు సింగిరెడ్డి స్వామి రెడ్డి, గోపు మల్లారెడ్డి,కంది లక్ష్మీనారాయణ రెడ్డి, కంది అశోక్ రెడ్డి,ముంజ రాములు,పురంశెట్టి అనోహర్,సింగం శ్రీనివాస్,గూడ కనకయ్య,తాళ్ళపెల్లి ప్రశాంత్, పడాల రమేష్,కుంభాల లింగయ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సీవోఈల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



**రామగిరి, ఏప్రిల్ 17(ది క్రైమ్ న్యూస్):-** ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలోని ప్రతిభా కేంద్రాలు (సీవోఈ), జూనియర్ కాలేజీలు, సైనిక్, ఒకేషనల్, ఫైన్ ఆర్ట్స్ కాలేజీల్లో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మంథని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాల (బాలురు) ప్రిన్సిపాల్ వూటూరి శ్రీనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీ కార్యదర్శి ఆదేశాల మేరకు ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు 25 లోగా ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూ చించారు.మే 15న రాష్ట్రవ్యాప్తంగా పరీక్ష ఉంటుందని వెల్లడించారు. వివరాలకు వెబ్ సైట్ సందర్శించాలని సూచించారు.



## బీట్ రూట్ మార్చండి!

ఆడవాళ్లలో రక్త వృద్ధికి సూచించే కూరగాయల్లో మొదటి స్థానంలో ఉంటుంది బీట్‌రూట్. అలాగని దాన్ని కీరా, క్యారెట్లలాగా అమాంతం తినడం అంత సులభం ఏం కాదు. అలాగని విటమిన్–సి తో పాటు ఐరన్, ఫోలేట్‌లాంటి ఎన్నో పోషకాలు ఉండే దీన్ని వదిలేయడమూ మంచి విషయమేం కాదు. అందుకే ఈ దుంపను సులభంగా ఆహారంలో భాగం చేసుకునే మార్గాలు చూద్దాం. సలాడ్లు తినేప్పుడు బీట్‌రూట్‌ను తురిమి కలుపుకొని, దానితో పాటు చియా, అవిసెలాంటి గింజల్ని జోడించుకుంటే మరీ వెగటు రాకుండా పచ్చి బీట్‌రూట్‌ని తినొచ్చు. అలాగే నారింజ, ఆపిల్‌లాంటి పండ్లతో కలిపి జ్యూస్‌లా చేసుకుని తాగినా మరిన్ని పోషకాలు శరీరానికి అందుతాయి. కాస్త ఉడికించి మిక్సీ పడితే ఇడ్లీలు, దోశల పిండిలో కలుపుకొని లాగించొచ్చు. అలాగే కొబ్బరి తురుము, కొంచెం ఆవాలు, కరివేపాకు నూనెలో వేసి తరిగిన బీట్‌రూట్ ముక్కలు కూడా జోడించి స్టిర్‌ఫ్రై చేసి కూడా నేరుగా తినొచ్చు. పరాఠాల్లో స్టఫింగ్ కోసం ఆలూ బదులు బీట్‌రూట్ వాడొచ్చు.

## వ్యాక్స్ వద్దు..

ఇప్పుడు చాలామంది ముఖంపై అవాంఛిత రోమాలతో బాధపడుతున్నారు. హార్మోన్లలో లోపాలు, ఇతర ఆరోగ్య కారణాలతో.. ఈ సమస్యబారిన పడుతున్నారు. వీటిని తొలగించుకోవడానికి నానా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో చాలామంది 'వ్యాక్స్' చేయించుకుంటున్నారు. అయితే.. వ్యాక్సింగ్ అనేది అన్నివేళలా మంచిదికాదని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. చర్మ తత్వాన్ని బట్టి వ్యాక్సింగ్‌ను ఎంచుకోవాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం అనేక సౌందర్య ఉత్పత్తుల సంస్థలు 'వ్యాక్స్ స్ట్రిప్స్'ను అందిస్తున్నాయి. అయితే, ఇవి సున్నితమైన చర్మం ఉన్నవారిలో తీవ్రమైన ఇబ్బందులు కలిగిస్తాయట. వ్యాక్సింగ్ వల్ల చర్మంపై దద్దుర్లు రావడం, ఎర్రగా మారడం, ముడతలు పడటంతోపాటు చర్మం మరింత సున్నితంగా మారుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తద్వారా ఎండలోకి వెళ్లినప్పుడు ముఖమంతా కందిపోవడం, ర్యాషెస్ వంటి సమస్యలు వస్తాయని చెబుతున్నారు. కాబట్టి బయట దొరికే ఫేషియల్ వ్యాక్స్, ఇంట్లో తయారుచేసుకున్న ప్యాక్స్ వేసుకునే ముందు.. చర్మ తత్వాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు. దేన్నయినా ముఖంపై అప్లయి చేసుకునే ముందు ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మేలని సలహా ఇస్తున్నారు.



# అతిగా నిద్రిస్తున్నారా? అయితే ఈ రోగాలకు వెల్కమ్ చెప్పినట్టే



అధిక నిద్ర.. ఇది పెద్ద అనారోగ్య సమస్య. దీర్ఘకాలిక ఆరోగ్య పరిస్థితులతో అతి నిద్రకు అవినాభావ సంబంధం ఉంది. అధిక నిద్ర మధుమేహం మరియు రక్తపోటు సమస్యలను పెంచుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎక్కువ నిద్రపోయిన, కావలసినంత నిద్ర పోకపోయినా కూడా అనారోగ్యం వెంటాడుతోందని హెచ్చరిస్తున్నారు.
అతి నిద్రతో అనారోగ్య సమస్యలు చాలామంది ఎక్కువ సేపు నిద్ర పోవటం మంచిదని భావించి తరచూ నిద్ర పోవటంపైనే శ్రద్ధ చూపిస్తారు. నిద్ర అవసరం అయినప్పటికీ, ఎక్కువగా నిద్ర పోవటం హానికరంగా ఉండవచ్చు. ఈ ప్రమాదాలను నివారించడానికి నిపుణులు సరైన నిద్ర షెడ్యూల్ అలవాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. అతి నిద్ర తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని పరిశోధనలు చూపుతున్నాయి.
అతి నిద్రతో మధుమేహం, రక్తపోటు సమస్యలు మధుమేహం మరియు రక్తపోటు సమస్యలు అతిగా నిద్రపోయే వారిలో కచ్చితంగా వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యాధులు భారతదేశంలో లక్షలాది మందిని ప్రభావితం చేస్తూ మన ఆరోగ్యాన్ని సవాల్ చేస్తున్నాయి. ప్రతీరోజూ ఏడు నుండి ఎనిమిది గంటల పాటు నిద్ర పోతే మంచిది కానీ ఎప్పటికీ తొమ్మిది గంటల కంటే ఎక్కువగా నిద్రించడం సమస్యలకు హేతువుగా మారుతుంది.
అధిక నిద్రతో మెటబాలిక్ మార్పులు ఈ నమూనా శరీరంలోని సహజ రిథమ్స్‌ను భంగం చేస్తుంది, మెటబాలిక్ మార్పులకు దారితీస్తుంది. ఇటువంటి అంతరాయాలు దీర్ఘకాలిక వ్యాధులను అభివృద్ధి చేసే ప్రమాదాన్ని పెంచుతాయి. అందుకే ఆరోగ్య నిపుణులు ఎక్కువగా నిద్ర పోకూడదని, రాత్రికి ఏడు నుండి ఎనిమిది గంటల నిద్రను లక్ష్యంగా పెట్టుకోవాలని సలహా ఇస్తున్నారు. ఈ పరిధి ఆప్టిమల్ ఆరోగ్యాన్ని మద్దతు ఇస్తుంది.
నిద్ర విషయంలో స్థిరమైన సమయం పైన దృష్టి దీర్ఘకాలిక అనారోగ్య పరిస్థితుల సంభావ్యతను తగ్గిస్తుంది. క్రమబద్ధంగా నిద్ర అలవాటు మొత్తం శ్రేయస్సు మరియు శక్తి స్థాయిలను మెరుగుపరుస్తుంది. అధిక నిద్రను ఎదుర్కోవడం జీవనశైలి మార్పులను కలిగి ఉంటుంది. కనుక వ్యక్తులు స్థిరమైన సమయం పైన దృష్టి పెట్టాలి. పడుకునే ముందు స్క్రీన్ సమయాన్ని పరిమితం చేయడం, పడుకునే ముందు మనసుకు ఆహ్లాదం కలిగించే సంగీతాన్ని ఆస్వాదించటం వంటి చర్యలు సౌకర్యవంతమైన నిద్ర వాతావరణాన్ని నిర్ధారిస్తాయి. కనుక నిద్రను కూడా ఒక క్రమ పద్ధతిలో పోవటానికి ప్రాధాన్యతను ఇవ్వాలి.

# ఆస్తమాతో అనర్థం!



ఆస్తమా.. మనదేశంలో అత్యంత ప్రబలంగా ఉన్న దీర్ఘకాలిక సమస్యల్లో ఒకటి. ఊపిరితిత్తులపై ప్రభావం చూపే ఈ మాయదారి వ్యాధి.. మహిళలకూ ఇబ్బందికరంగా పరిణమిస్తున్నది. ముఖ్యంగా, వారి పునరుత్పత్తిపై ప్రభావం చూపుతున్నది. సంతానోత్పత్తి తగ్గడం, గర్భధారణ సమస్యలకు కారణం అవుతున్నది. మనదేశంలో ఏటా 3.7 కోట్ల మంది ఉబ్బసం బారిన పడుతున్నారు. వారిలో.. నగర, నగర శివారు ప్రాంతాల్లో నివసించే మహిళలే ఎక్కువగా ఉంటున్నారు. సాధారణ మహిళలతో పోలిస్తే.. ఆస్తమా బాధితులు గర్భం దాల్చడంలో ఇబ్బంది పడుతున్నట్లు న్యూఢిల్లీలోని 'ఆల్ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్' చెబుతున్నది. అంతర్జాతీయంగా నిర్వహించిన అనేక పరిశోధనలు కూడా ఇదే విషయాన్ని వెల్లడిస్తున్నాయి. ఉబ్బసం వ్యాధిగ్రస్తుల్లో తక్కువ ఆక్సిజన్ స్థాయిలు, ఇన్‌ఫ్లమేషన్, ఇతర సమస్యలు.. పునరుత్పత్తి ప్రక్రియకు ప్రధాన అడ్డంకులుగా గుర్తించాయి. వీరిలో గైనిక్ సమస్యలు, అధిక ఒత్తిడి, నిద్రలేమి సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. ఇవన్నీ.. వారు గర్భం దాల్చడాన్ని మరింత కష్టతరం చేస్తున్నాయి. ఉబ్బసం బాధితుల్లో పునరుత్పత్తి అవయవాలకు ఆక్సిజన్ ప్రవాహం తగ్గుతుందనీ, తద్వారా అండాల నాణ్యతతోపాటు గర్భాశయ ఆరోగ్యంపైనా ప్రభావం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇందుకు ప్రధాన కారణాలను వివరిస్తూ.. మనదేశంలో ఆస్తమాను చాలామంది నిర్లక్ష్యం చేస్తుంటారు. దగ్గు, శ్వాస ఆడకపోవడం వంటి లక్షణాలను సాధారణంగానే చూస్తారు. వైద్య సహాయం తీసుకోవడానికి ఇష్టపడరు. దోమల మందులు, అగరుబత్తీలు, వంటగదిలో వాయు కాలుష్యం వంటివి.. బాధితులను మరింత ఇబ్బంది పెడతాయి. ఈ క్రమంలో గర్భధారణ కోసం చూసే ఆస్తమా బాధితులు.. కొన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కొందరు ఉబ్బసం నుంచి ఉపశమనం కలిగిన వెంటనే మందులను ఆపేస్తారు. అది ఏమాత్రం మంచిదికాదు. వైద్యులు సూచించినన్ని రోజులు మందులు వాడాల్సిందే! ఆస్తమా రోగుల్లో అలర్జీలకు కొన్ని ఆహార పదార్థాలు కారణం అవుతాయి. అలాంటి వాటిని పక్కన పెట్టడమే మంచిది. లేకుంటే.. అవి సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయి. కాలుష్యం, పొగ, దుమ్ముకు దూరంగా ఉండాలి. బయటికి వెళ్లేటప్పుడు మాస్క్ ఉపయోగించాలి. ప్రాణాయామం లాంటి యోగాసనాలు ఊపిరితిత్తుల పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఒత్తిడి, ఆందోళనను తగ్గించడంలో ముందుంటాయి. కాబట్టి, యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి.

# మార్కెట్

## చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం.. సోషల్ మీడియా ద్వారా యూజర్లు ఫిర్యాదు


ఓపెన్ ఏఐకి చెందిన చాట్‌బాట్ చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం ఏర్పడింది. ఫలితంగా భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది యూజర్లు ఈ సమస్యను ఎదుర్కొన్నారు. చాట్‌బాట్‌ను ఓపెన్ చేస్తుంటే.. ఎర్రర్ మెసేజ్‌లు వస్తున్నాయి. చాట్ హిస్టరీ లోడ్ అవ్వట్లేదు. దీనిపై యూజర్లు సోషల్ మీడియా ద్వారా ఫిర్యాదులు చేస్తున్నారు. డౌన్‌డిటెక్టర్ ప్రకారం.. భారత్ సహా ఉత్తర అమెరికా, ఐరోపా, ఆసియా దేశాల్లోని యూజర్లు ఈ సమస్యలు ఎదుర్కొన్నారు. దాదాపు 82 శాతం మంది యూజర్లు చాట్‌జీపీటీ సేవలు పొందలేకపోతున్నారు. మొబైల్ యాప్, వెబ్ రెండింటిలోనూ ఈ సమస్యను ఎదుర్కొన్నట్లు యూజర్లు ఫిర్యాదు చేస్తున్నారు. అంతేకాదు లాగిన్, నెట్‌వర్క్ ఎర్రర్, యాప్ సంబంధిత ఇతర సమస్యలు కూడా ఎదుర్కొంటున్నట్లు ఫిర్యాదు చేస్తున్నారు. తాజా సమస్యపై 'ఓపెన్‌ఏఐ (%ాజూవఅూ×%)' సంస్థ స్పందించింది. సమస్యను గుర్తించామని, దాన్ని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. చాట్‌జీపీటీ రికార్డ్ మోడ్, సోరా, కోడెక్స్ వంటి సేవల్లో అంతరాయం ఉన్నట్లు తెలిపింది.




## క్రెడిట్‌కార్డులు తెగ వాడేస్తున్నారు..!
# తక్కువ వేతనాలు కారణమట..!





దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం భారీగా పెరుగుతోంది. ఈ ఏడాది తొలి ప్రథమార్థంలో దేశవ్యాప్తంగా క్రెడిట్ కార్డుల ద్వారా జరిగిన లావాదేవీలు 15శాతం పెరిగినట్లు ఆర్‌బీఐ గణాంకాలు చెప్పాయి. ఇ–కామర్స్, ఫుడ్ డెలివరీతో పాటు ఇతర అవసరాల కోసం క్రెడిట్‌కార్డుల వినియోగం పెరిగినట్లు భావిస్తున్నారు. బ్యాంకులు సైతం ఈఎంఐ ఆఫర్లు, క్యాష్‌బ్యాక్, రివార్డ్ పాయింట్ల పేరుతో ఆఫర్లు సైతం ఇస్తున్నాయి. తాజాగా ఓ అధ్యయనంలో కీలక విషయాలు వెల్లడయ్యాయి. తక్కువ ఆదాయం ఉన్న వ్యక్తులు క్రెడిట్‌కార్డులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నట్లు పేర్కొంది. థింక్ 360 ఏఐ అధ్యయనం ప్రకారం.. నెలకు రూ.50వేల కంటే తక్కువ జీతం ఉన్న వారిలో 93శాతం మంది క్రెడిట్‌కార్డులపై ఆధారపడుతున్నట్లు చెప్పింది. అదే సమయంలో స్వయం ఉపాధి పొందుతున్న 85శాతం మంది సైతం క్రెడిట్‌కార్డులపై ఆధారపడుతున్నట్లుగా అధ్యయనం వెల్లడించింది. ఇప్పుడు పే తర్వాత (బీఎన్‌పీఎల్) సేవలను 18శాతం స్వయం ఉపాధి, వేతన జీవులు 15శాతం మంది ఉపయోగిస్తున్నట్లు డేటా పేర్కొంది. ఈ అధ్యయనం రూ.20వేల మంది ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులపై నిర్వహించింది. ఈ సందర్భంగా థింక్ 360 ఏఐ ఫౌండర్, సీఈవో అమిత్ దాస్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న భారతదేశ క్రెడిట్ ల్యాండ్ స్కేప్‌లో క్రెడిట్‌కార్డులు, బీఎన్‌పీఎల్ ఇప్పుడు వేతన జీవులతో పాటు ఉపాధి పొందుతున్న వారికి ప్రతీ ఒక్కరికీ అవసరంగా మారాయన్నారు. పెరుగుతున్న ఫిన్ టెక్ కంపెనీలు డిజిటల్ లోన్ రెవల్యూషన్‌ను తీసుకువచ్చాయన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీలు రూ.92వేల కోట్లకుపైగా వ్యక్తిగత రుణాలు ఇచ్చాయి. ఇది మొత్తం రుణాల సంఖ్యలో 76శాతం ఉన్నట్లుగా సూచిస్తుందని పేర్కొన్నారు.




## అల్లు అర్జున్ రాకాలో షారూఖ్ ఖాన్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు మాస్ కమర్షియల్ డైరెక్టర్ అట్లీ కలయికలో తెరకెక్కనున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'రాకా' పై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. అయితే ఈ అంచనాలను మరింత పెంచుతూ తాజాగా ఒక బిగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమాలో బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ ఒక పవర్‌ఫుల్ పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. అట్లీ ఇప్పటికే షారుఖ్‌తో 'జవాన్' వంటి భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. అదే చొరవతో 'రాకా'లో ఒక కీలకమైన అతిథి పాత్ర కోసం షారుఖ్‌ను అడిగారని, అందుకు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. అల్లు అర్జున్ స్టైలిష్ యాక్షన్, అట్లీ టేకింగ్, దానికి తోడు షారుఖ్ ఖాన్ చరిష్మా తోడైతే ఈ చిత్రం గ్లోబల్ లెవల్‌లో రికార్డులు సృష్టించడం ఖాయమని మేకర్స్ భావిస్తున్నారు. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.





## చిరాగ్ పాశ్వాన్‌తో ఎలాంటి రిలేషన్ లేదు

### క్లారిటీ ఇచ్చిన నటి కంగనా రనౌత్

కంగనా రనౌత్, చిరాగ్ పాశ్వాన్ ఆ ఇద్దరూ ఇప్పుడు ఫుల్ బిజీ అయ్యారు. పబ్లిక్ ఈవెంట్స్‌లో తరుచూ కనిపిస్తున్నారు. దీంతో కొందరు డౌట్స్ వ్యక్తం చేస్తున్నారు. ఆ ఎంపీలు ఇద్దరూ రొమాంటిక్ రిలేషన్‌లో ఉన్నారా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫిల్మ్ స్టార్ , ఎంపీ కంగనా రనౌత్ క్లారిటీ ఇచ్చారు. ఆ రూమర్స్‌కు ఆమె చెక్ పెట్టారు. చిరాగ్ పాశ్వాన్ కేవలం ఫ్రెండ్ మాత్రమే అని ఆమె చెప్పారు. తమ మధ్య రొమాన్స్ లేదని కంగనా పేర్కొన్నది. తమ మధ్య చాన్నాళ్ల పరియం ఉందని, పదేళ్ల క్రితం ఇద్దరం కలిసి సినిమా తీశామని, ఒకవేళ తమ మధ్య ప్రేమాయణం సాగి ఉంటే, మాకు పిల్లలు పుట్టేవారని కంగనా రనౌత్ పేర్కొన్నది. పాశ్వాన్‌తో తన రిలేషన్ చాన్నాళ్ల నుంచి అలాగే ఉందన్నారు. ఒకవేళ తనకు రొమాన్స్ కావాలనుకుంటే, అది జరిగేదని, కానీ అలాంటిది ఏమీ లేదని, అది కేవలం ఫ్రెండ్లీ పరిచయం మాత్రమే అని, అతను కూడా ఫిల్మ్ ఇండస్ట్రీ నుంచి వచ్చాడని, అందుకే తమ మధ్య పరిచయం కాస్త చనువుగా ఉంటుందని ఆమె అన్నారు. 2011లో రిలీజైన మిలే నా మిలే హమ్ చిత్రంలో కంగనా, చిరాగ్ పాశ్వాన్ కలిసి నటించారు. తన్వీర్ ఖాన్ ఆ చిత్రాన్ని డైరెక్ట్ చేశారు. ఆ తర్వాత ఇద్దరూ రాజకీయాల్లో రాణించారు. కానీ కంగనా అడపాదడపా చిత్రాల్లో నటిస్తోంది. చివరిసారి ఆమె ఎమర్జెన్సీ చిత్రంలో యాక్ట్ చేశారు.



## త్రివిక్రమ్‌తో ఎన్టీఆర్ మరో సినిమా

ఎన్టీఆర్ వరుసగా భారీ ప్రాజెక్టులతో తన ఫ్యాన్స్‌కు ఫుల్ ట్రీట్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే స్టార్ దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'డ్రాగన్' అనే యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్న తారక్, తన తదుపరి చిత్రాన్ని మాటల మాంత్రికుడు శ్రీనివాస్‌తో చేయనున్న విషయం తెలిసిందే. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన అరవింద సమేత వీర రాఘవ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించడంతో, ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింతగా పెరిగాయి. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం ఆధ్యాత్మికత, కమర్షియల్ ఎలిమెంట్స్ మేళవింపుతో కూడిన విభిన్న కథాంశంతో తెరకెక్కనుంది. ముఖ్యంగా కుమారస్వామి నేపథ్యం ఉండబోతుందని, విజువల్ వండర్‌గా మలచడానికి త్రివిక్రమ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరో ఆసక్తికర అంశం టైటిల్. సోషల్ మీడియాలో వినిపిస్తున్న ప్రచారం ప్రకారం, ఈ చిత్రానికి 'గాడ్ ఆఫ్ వార్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను పరిశీలిస్తున్నారట. టైటిల్‌ను బట్టి చూస్తే, ఈసారి ఎన్టీఆర్‌ను మరింత ఉగ్రరూపంలో, శక్తివంతమైన పాత్రలో చూపించే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదిలా ఉంటే, ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ రెండు సినిమాలకు సంబంధించిన కీలక అప్‌డేట్స్ రావొచ్చని ఫిలింనగర్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. ఒకే రోజు త్రివిక్రమ్ ప్రాజెక్ట్ అధికారిక ప్రకటనతో పాటు, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలోని 'డ్రాగన్' నుంచి కూడా అప్డేట్ వచ్చే అవకాశం ఉందట. ఈ డబుల్ అనౌన్స్‌మెంట్స్ ఎన్టీఆర్ అభిమానులకు నిజమైన పండుగలా మారనుండడం ఖాయం. ఒకవైపు భారీ యాక్షన్ డ్రామా, మరోవైపు ఆధ్యాత్మిక బ్యాక్‌డ్రాప్‌లో విజువల్ గ్రాండియర్ ఇలా రెండు విభిన్న జానర్లలో సినిమాలు చేయడం ద్వారా తారక్ తన గ్లోబల్ ఇమేజ్‌ను మరింత బలోపేతం చేస్తున్నాడు. మొత్తంగా ఎన్టీఆర్ తన కెరీర్‌లో అత్యంత కీలక దశలో ఉన్నాడని చెప్పాలి. వరుసగా భారీ ప్రాజెక్టులు, స్టార్ డైరెక్టర్లతో కాంబినేషన్లు, విభిన్న కథలు అన్నీ కలిసి టాలీవుడ్‌లో మరో సెన్సేషన్ సృష్టించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇక ఈ సినిమాలు ప్రేక్షకులను ఎలా అలరిస్తాయో చూడాలి.




## సంక్రాంతికి వస్తున్నాం.. నాకెంతో ప్రత్యేకం

విక్టరీ వెంకటేష్ హీరోగా దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం గతేడాది ప్రేక్షకుల ముందుకు వచ్చి బ్లాక్ బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రికార్డులను సృష్టించడమే కాకుండా తాజాగా ప్రతిష్టాత్మక అవార్డును కూడా సొంతం చేసుకుంది. ముంబైలో జరిగిన ఇండియన్ నేషనల్ సినీ అకాడమీ అవార్డుల వేడుకలో అనిల్ రావిపూడి తెలుగు విభాగంలో 'ఉత్తమ దర్శకుడు' పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కెరీర్‌లో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా అత్యంత ప్రత్యేకమైనదని తెలిపాడు. కేవలం రూ.50 కోట్ల రూపాయల బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా రూ.300 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి, పెట్టిన పెట్టుబడికి ఆరు రెట్ల లాభాలను తెచ్చిపెట్టడం ఒక దర్శకుడిగా తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని ఆయన వెల్లడించారు. ఈ సినిమాకు కమర్షియల్ సక్సెస్‌తో పాటు విమర్శకుల ప్రశంసలు మరియు జాతీయ స్థాయి అవార్డు దక్కడం పట్ల అనిల్ రావిపూడి హర్షం వ్యక్తం చేశారు.

## టీవీ చుట్టూ అల్లిన పల్లెటూరి కథ




టీవీలు అప్పుడప్పుడే ఊళ్లలోకి ప్రవేశిస్తున్న 90వ దశకం నేపథ్యంలో తిమ్మరాజుపల్లి అనే పల్లెటూళ్లో జరిగే కథ ఇది. శివరాత్రి వచ్చిందంటే ఊరి వాళ్లంతా కలిసికట్టుగా చందాలేసుకుని పండగ ఘనంగా జరిపించడం.. ఆ సాయంత్రం అద్దెకి తెచ్చుకున్న టీవీలో కొత్త సినిమాలు చూసి ఆనందించడం పరిపాటి. అలాంటి ఊళ్లోకి తొలిసారి సొంతంగా ఓ టీవీ కొనుక్కుని తెచ్చుకుంటాడు రాజప్ప (ప్రదీప్ కొట్టె). ఎప్పుడైతే ఆ ఇంట్లోకి టీవీ వచ్చిందో.. అప్పటి నుంచి ఊరి వాళ్ల బుల్లితెర వినోదాలకు రాజప్ప ఇల్లు చిరునామాగా మారిపోతుంది. ఆ ఊళ్లో చిల్లర దొంగతనాలు చేస్తూ గడిపేసే సతీష్ (సాయితేజ్) కూడా టీవీ చూడటానికని వచ్చి.. రాజప్ప చెల్లి శారద (వేద జలంధర్)తో ప్రేమాయణం సాగిస్తుంటాడు. ఓసారి ఈ ప్రేమ విషయం రాజప్పకి తెలియడంతో పెద్ద గొడవ జరుగుతుంది. సతీష్‌ని తీవ్రంగా అవమానించడంతో.. 'ఏ టీవీని చూసైతే విర్రవీగుతున్నావో దాన్ని లేకుండా చేస్తాన'ని సవాల్ విసురుతాడు. సరిగ్గా అదే రాత్రి రాజప్ప ఇంట్లో టీవీ దొంగతనం జరగడంతో ఆ నింద సతీష్‌పై పడుతుంది. మరి ఆ తర్వాత ఏమైంది? నిజంగా ఆ టీవీని ఎవరెత్తుకెళ్లారు? తనపై నింద తప్పని నిరూపించుకునేందుకు సతీష్ ఏం చేశాడు? ఊరి పెద్దలిచ్చిన రెండు వారాల గడువు లోపల ఆ టీవీని.. అసలు దొంగల్ని తను కనిపెట్టాడా? లేదా? ఈక్రమంలో తనకెదురైన సవాళ్లేంటి? అన్నది మిగిలిన కథ. ఇప్పుడు అరచేతిలోకి వినోదాలు వచ్చేశాక టీవీ ప్రాధాన్యం ఎవరికీ పెద్దగా తెలియట్లేదు కానీ.. 80–90ల తరానికి టీవీ అంటే ఓ ఎమోషన్. బుల్లితెరతో పెనవేసుకున్న అనుబంధాలు.. దాని చుట్టూ అల్లుకున్న జ్ఞాపకాలు బోలెడన్ని. ఈ 'తిమ్మరాజుపల్లి టీవీ'తో ఆ జ్ఞాపకాల్ని.. ఆ అనుబంధాల్ని మరోసారి గుర్తు చేసే ప్రయత్నం చేశాడు దర్శకుడు మునిరాజ్. మలయాళ సినిమాల్లోలా చాలా సింపుల్ లైన్‌పై నడిచే చిత్రమిది. ఈ కథ ప్రధానంగా ఓ టీవీ దొంగతనం చుట్టూ తిరుగుతుంటుంది. సింగిల్ లైన్ కథలతో ప్రేక్షకుల్ని రెండు గంటల పాటు థియేటర్లలో కూర్చోబెట్టడం అంత తేలికేం కాదు. కథలో బలమైన డ్రామా పండినప్పుడే అది సాధ్యం. ఈ విషయంలో 'తిమ్మరాజుపల్లి టీవీ' పాసైంది. దర్శకుడు ఈ కథకి ఎలాంటి కమర్షియల్ హంగులు జోడించకుండా చాలా నిజాయితీగా తెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. ఆ ఊరివాళ్ల మనస్తత్వాల్ని.. అక్కడి సంస్కృతి, సంప్రదాయాల్ని పరిచయం చేస్తూ కథని ఆరంభించిన తీరు బాగుంటుంది.

నాయకానాయికల ప్రేమకథ ఎప్పుడైతే రాజప్పకి తెలుస్తుందో.. అక్కడి నుంచి కథలో సంఘర్షణ మొదలవుతుంది. ఇక తన ఇంట్లో టీవీ దొంగతనానికి గురైనప్పటి నుంచి కథ మరింత రసవత్తరంగా మారుతుంది. ఈక్రమంలో వచ్చే విరామ సన్నివేశాలు ఫర్వాలేదనిపిస్తాయి. తెరపై కనిపించేదంతా కొత్త వా÷–లళైనా ప్రేక్షకులకు అదెక్కడా ఇబ్బందిగా అనిపించదు.

నాయకానాయికలతో పాటు తెరపై కనిపించే ప్రతి పాత్రా సహజమైన నటనతో గుర్తుండిపోతుంది. ఎల్లమ్మ పాత్రతో ఇచ్చిన ట్విస్ట్ ఆకట్టుకుంటుంది. దర్శకుడు తాను అనుకున్న కథని నిజాయితీగా చెప్పడంలో విజయం సాధించాడు. దీన్ని పూర్తిగా ఓ ప్లలెటూరిలోనే చాలా సహజంగా తెరకెక్కించారు. కిరణ్ అబ్బవరం నిర్మాతగా తొలి ప్రయత్నంలో చాలా తక్కువ బడ్జెట్‌లో ఆహ్లాదభరితమైన సినిమా చూపించగలిగారు. పాటలన్నీ కథలో భాగంగా ఉన్నాయి. నేపథ్య సంగీతం సినిమాకి మంచి ఫీల్‌ని జోడించింది. విజువల్స్ ఆకర్షణగా నిలుస్తాయి.

Printed, Published & Owned by Dr. JBL, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S), RNI NO. APTEL/2006/19056


స్పోర్ట్స్

# సన్ రైజర్స్ జట్టుకు గాయాల బెడద

**సీమర్ డేవిడ్ పేన్ చీలమండ గాయం**

**ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యే చాన్స్!?**

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టును గాయాల బెడద వెంటాడుతూనే ఉంది. త్తజాగా ఈ మాజీ ఛాంపియన్ కు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇంగ్లాండ్ లెఫ్ట్ ఆర్మ్ సీమర్ డేవిడ్ పేన్ చీలమండ గాయం కారణంగా ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ఈ విషయాన్ని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా అధికారికంగా ధృవీకరించింది. 35 ఏళ్ల పేన్ ఈ సీజన్‌లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో రెండు వికెట్లు తీసి పర్వాలేదనిపించాడు. ముఖ్యంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. అతను త్వరగా కోలుకోవాలని టీమ్ సభ్యులు ఆకాంక్షించారు. నిజానికి ఈ సీజన్‌లో ఎస్ఆర్‌హెచ్ ప్లేయర్లు గాయపడటం ఇది మొదటిసారి కాదు. అంతకుముందు ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ బ్రైడన్ కార్స్ చేతి గాయంతో టోర్నీ ప్రారంభంలోనే నిష్క్రమించాడు. అతని స్థానంలో శ్రీలంక ఫాస్ట్ బౌలర్ దిల్షాన్ మధుశంకను జట్టులోకి తీసుకున్నారు. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఐదు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు, మూడు ఓటములతో నాలుగో స్థానంలో ఉన్న హైదరాబాద్ జట్టుకు ఈ గాయాలు ఒక పెద్ద సవాలుగా మారాయి. ప్రస్తుతం జట్టు నెట్ రన్ రేట్ ం0.576 గా ఉంది.ఒకవైపు డేవిడ్ పేన్ దూరం




అవ్వడం ఇబ్బంది కలిగించినా, మరోవైపు ఎస్ఆర్‌హెచ్ ఫ్యాన్స్‌కు ఒక అదిరిపోయే గుడ్ న్యూస్ అందింది. జట్టు రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్ ఫిట్‌నెస్ టెస్ట్ క్లియర్ చేశాడు. త్వరలోనే అతను స్క్వాడ్‌తో చేరబోతున్నాడు. ఏప్రిల్ 25న జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో జరగనున్న మ్యాచ్‌లో కమిన్స్ బరిలోకి దిగే అవకాశం ఉంది. కమిన్స్ అందుబాటులో లేని సమయంలో ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. కిషన్ సారథ్యంలో టీమ్ రెండు మ్యాచ్‌ల్లో గెలిచి తన ఉనికిని చాటుకుంది. గత సోమవారం టేబుల్ టాపర్స్ రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ అద్భుత విజయం సాధించింది. 217 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించిన ఎస్ఆర్‌హెచ్, ప్రత్యర్థిని 159 పరుగులకే కట్టడి చేసింది. అరంగేట్రం చేసిన యువ బౌలర్లు ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ చెరో నాలుగు వికెట్లు తీసి రాజస్థాన్ పతనాన్ని శాసించారు. 57 పరుగుల తేడాతో గెలిచిన ఆరెంజ్ ఆర్మీ ఇప్పుడు ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉంది. శనివారం తమ హోమ్ గ్రౌండ్ అయిన ఉప్పల్ స్టేడియంలో ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ తో తలపడనుంది. హోమ్ క్రౌడ్ ముందు రుతురాజ్ సేనను ఓడించి విజయ పరంపరను కొనసాగించాలని హైదరాబాద్ ప్లాన్ చేస్తోంది. సొంతగడ్డపై రాయల్స్ పై గెలుపొందడం, చెన్నైతో మ్యాచ్ కూడా సొంతగడ్డపైనే జరుగనుండటంతో ఈ విజయంపై కన్నేసింది. ఇక డబుల్ హెడర్ లో భాగంగా శనివారం రాత్రి ఈ మ్యాచ్ జరుగుతుంది. ఇప్పటికే ఈ మ్యాచ్ పై ఫుల్ క్రేజ్ ఉండగా, టికెట్లకు భారీ డిమాండ్ ఉంది.


## గుజరాత్ టైటాన్స్‌కు బిగ్ షాక్..

**టోర్నీ నుంచి టామ్ బాంటన్ ఔట్!**

ఐపీఎల్ 2026 సీజన్ మధ్యలో గుజరాత్ టైటాన్స్ జట్టుకు బిగ్ షాక్ తగిలింది. ఆ జట్టులోని స్టార్ ప్లేయర్, జోస్ బట్లర్ దేశస్థుడైన ఇంగ్లాండ్ బ్యాటర్ టామ్ బాంటన్ గాయం కారణంగా ప్రస్తుత సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. వేలి గాయంతో బాధపడుతున్న టామ్ బాంటన్ టోర్నీలో మిగిలిన మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడని ఐపీఎల్ అధికారికంగా శుక్రవారం ప్రకటించింది. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుతో జరగనున్న కీలక మ్యాచ్‌కు ముందు ఈ వార్త శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని గుజరాత్ జట్టును కలవరపెడుతోంది.టామ్ బాంటన్ స్థానాన్ని భర్తీ చేసేందుకు గుజరాత్ టైటాన్స్ వేగంగా పావులు కదిపింది. దక్షిణాఫ్రికాకు చెందిన యువ వికెట్ కీపర్, బ్యాటర్ కానర్ ఎస్టర్‌హుజెన్‌ను బాంటన్ రీప్లేస్‌మెంట్‌గా జట్టులోకి తీసుకుంది. కేవలం రూ. 75 లక్షల బేస్ ధరతో ఎస్టర్‌హుజెన్ గుజరాత్ జట్టులో చేరాడు. 24 ఏళ్ల ఈ యువ ప్లేయర్ ఐపీఎల్‌లో అడుగుపెట్టడం ఇదే తొలిసారి. టామ్ బాంటన్ దూరం కావడంతో వచ్చిన లోటును ఈ యువ సంచలనం ఏ మేరకు భర్తీ చేస్తాడన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. దక్షిణాఫ్రికా క్రికెట్‌లో కానర్ ఎస్టర్‌హుజెన్ స్టార్‌గా పేరు తెచ్చుకున్నాడు. గత నెలలో న్యూజిలాండ్‌తో జరిగిన 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ ద్వారా కానర్ ఎస్టర్‌హుజెన్ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. ఆ సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన ఎస్టర్‌హుజెన్.. రెండుసార్లు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డులను గెలుచుకోవడమే కాకుండా 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా కూడా నిలిచాడు. దక్షిణాఫ్రికా 1-2తో వెనుకబడిన స్థితి నుంచి సిరీస్‌ను 3-2తో గెలవడంలో అతను కీలక పాత్ర పోషించాడు.ఐపీఎల్ టోర్నమెంట్ అత్యంత కీలక దశకు చేరుకుంటున్న సమయంలో ఈ మార్పు చోటుచేసుకోవడం గమనార్హం. గుజరాత్ టైటాన్స్ తమ తదుపరి మ్యాచ్‌ను అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ఆడనుంది. ఈ హోమ్ మ్యాచ్‌కు ముందే కొత్త ఆటగాడు జట్టుతో చేరనుండటం గిల్ సేనకు కొంత ఊరటనిచ్చే విషయమే. దక్షిణాఫ్రికాలో తన సత్తా చాటిన ఈ యువ హిట్టర్, భారత గడ్డపై ఐపీఎల్ అరంగేట్రంలో ఎలాంటి మ్యాజిక్ చేస్తాడో చూడాలి.







## కోహ్లీ ఒక్క లైక్‌తో సోషల్ మీడియాలో ట్రెండ్

ఒకే ఒక్క లైక్... సోషల్ మీడియానే షేక్ చేస్తోంది. ఇండియన్ స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ తాజాగా మోడల్ లిజ్‌లాజ్ పోస్ట్ లైక్ చేయడం హాట్ టాపిక్‌గా మారింది. దీనిపై నెటిజన్లు నెట్టింట మీమ్స్‌తో హల్చల్ చేస్తున్నారు. ఒక్కసారిగా సదరు మోడల్ పేరు నెట్టింట ట్రెండ్ అయిపోయింది. ఇన్‌ఫ్లుయెన్సర్ లిజ్‌లాజ్ ఫోటోలతో కూడిన పోస్టును కోహ్లీ లైక్ చేయడం వైరల్‌గా మారింది. ఆమెను ఫాలో కానప్పటికీ లైక్ కొట్టడం చర్చనీయాంశమైంది. జర్మనీకి చెందిన ఈమె 'గోల్డెన్ అవర్ షాట్స్' అంటూ తన ఫోటోలను షేర్ చేసింది. జనవరి 30న పెట్టిన ఈ పోస్టుకు కోహ్లీ లైక్ కొట్టినట్లు కనిపించింది. దీన్ని ఆయన అభిమానులు సోషల్ మీడియాలో తెగ షేర్ చేస్తున్నారు. అయితే, ఇది అనుకోకుండా జరిగిందా? అల్గారిథమ్ వల్ల జరిగిందా? అంటూ డిబేట్ మొదలెట్టారు. కొందరు ఫన్ ఎమోజీస్‌తో నింపేశారు. అసలు ఆమె ఎవరు? అంటూ తెగ సెర్చ్ చేస్తున్నారు. లిజ్ లాజ్ జర్మనీకి చెందిన ఇన్‌ఫ్లుయెన్సర్. సగం సౌతాఫ్రికాకు చెందిన మూలాలు కూడా ఉన్నాయి. ఎంఎస్సీ సైకాలజీ కంప్లీట్ చేసింది. వ్లోగర్, సింగర్‌గా తన ఇన్ స్టా ఐడీని పెట్టుకున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ... ట్రావెల్ వ్లాగ్స్, లైఫ్ స్టైల్ కంటెంట్, మ్యూజిక్ వీడియోలు షేర్ చేస్తుంటుంది.ఆర్సీబీకి ఫ్యాన్స్ అంటూ తాజాగా ఓ వీడియోను తన ఇన్ స్టా స్టోరీలో



పెట్టుకుంది. సెలబ్రిటీ ఫోటోగ్రాఫర్ అద్వైత్ వైద్య ఆమెతో ఫోటో షూట్ చేయగా... వాటిని ఇన్ స్టాలో షేర్ చేశారు. ఇప్పటివరకూ లిజ్‌లాజ్‌కు దాదాపు 4.27 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. 274 పోస్టులు చేశారు. సాక్షాత్తూ భారత క్రికెట్ లెజెండ్ ఆమె పోస్టుకు లైక్ చేయడంతో ఒక్కసారిగా ఫేమస్ అయిపోయారు. లిజ్ లాజ్ జర్మనీకి చెందిన ఇన్‌ఫ్లుయెన్సర్. సగం సౌతాఫ్రికాకు చెందిన మూలాలు కూడా ఉన్నాయి. ఎంఎస్సీ సైకాలజీ కంప్లీట్ చేసింది. వ్లోగర్, సింగర్‌గా తన ఇన్ స్టా ఐడీని పెట్టుకున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ... ట్రావెల్ వ్లాగ్స్, లైఫ్ స్టైల్ కంటెంట్, మ్యూజిక్ వీడియోలు షేర్ చేస్తుంటుంది. ఆర్సీబీకి ఫ్యాన్స్ అంటూ తాజాగా ఓ వీడియోను తన ఇన్ స్టా స్టోరీలో పెట్టుకుంది. సెలబ్రిటీ ఫోటోగ్రాఫర్ అద్వైత్ వైద్య ఆమెతో ఫోటో షూట్ చేయగా... వాటిని ఇన్ స్టాలో షేర్ చేశారు. ఇప్పటివరకూ లిజ్‌లాజ్‌కు దాదాపు 4.27 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. 274 పోస్టులు చేశారు. సాక్షాత్తూ భారత క్రికెట్ లెజెండ్ ఆమె పోస్టుకు లైక్ చేయడంతో ఒక్కసారిగా ఫేమస్ అయిపోయారు.

# వరల్డ్‌కప్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ కలకలం

భారత్ - శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన 2026 టీ20 ప్రపంచకప్ గతనెల విజయవంతంగా ముగిసింది. ఈ టోర్నీ ఫైనల్?లో న్యూజిలాండ్?ను చిత్తుగా ఓడించి భారత్ విశ్వవిజేతగా నిలిచింది. అయితే ఈ టోర్నమెంట్ ముగిసి నెల రోజులు గడిచిన తర్వాత తాజాగా దీనిపై ఓ షాకింగ్ వార్త వెలుగులోకి వచ్చింది. టోర్నీలో న్యూజిలాండ్?తో జరిగిన మ్యాచ్?లో కెనడా మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ మ్యాచ్‌పై ఐసీసీ తాజాగా విచారణ ప్రారంభించింది.చెన్నై చెపాక్ స్టేడియం వేదికగా కెనడా - న్యూజిలాండ్ జట్ల మధ్య లీగ్ స్టేజ్‌లో మ్యాచ్ జరిగింది. ఇందులో కివీస్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి సూపర్ 8కు దూసుకొచ్చింది. అయితే ఈ మ్యాచ్‌లో కెనడా మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడిందని ఇటీవల సీబీసీ ఓ డాక్యుమెంటరీ రూపొందించింది. ఇది ఇప్పుడు క్రికెట్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఈక్రమంలోనే కెనడా క్రికెట్ జట్టుపై ఐసీసీ అవినీతి నిరోధక విభాగం రెండు కీలక విచారణలను ప్రారంభించినట్లు ఈఎస్?పీఎన్ క్రిక్ఇన్ఫో నివేదిక పేర్కొంది. ఈ మ్యాచ్ ఛేజింగ్?లో? కివీస్ నాలుగు ఓవర్లకు 35- 2 స్కోర్?తో ఉంది. అయితే ఆ తర్వాత కెనడా కెప్టెన్ దిల్ప్రీత్ బాజ్వా వేసిన ఐదో ఓవర్?లో ఒక 'నో- బాల్', ఓ 'వైడ్' సహా 15 పరుగులు వచ్చాయి. ఆ ఓవర్ తర్వాత మ్యాచ్



స్వరూపమే మారిపోయింది. కివీస్ బ్యాటర్లు రెచ్చిపోయి ఆడాడు. ఫలితంగా కివీస్ 174 పరుగుల ఛేదనలలో 15.1 ఓవర్లలో అందుకుంది. అయితే మ్యాచ్?లో ఆ ఓవర్ టర్నింగ్ పాయింట్ అయ్యింది. ఈ క్రమంలో కెప్టెన్ బజ్వా వేసిన ఓవర్?పై అనుమానాలు మొదలయ్యాయి. మ్యాచ్?లో ఆ ఓవర్ అనుమానస్పదంగా మారిందని కెనడాకు చెందిన ఇన్వెస్టిగేషన్ కార్యక్రమం 'ది ఎఫ్త్ ఎస్టేట్' పేర్కొంది. అది నిజంగానే పేలవమైన బౌలింగా, లేక కెప్టెన్ ఉద్దేశపూర్వకంగానే అన్ని పరుగులు ఇచ్చేశాడా? అన్న అశంలో ఐసీసీ విచారణ జరుపుతోంది. ఇప్పుడు ఈ ఓవర్ విచారణ పరిధిలోకి వచ్చింది. అది నిజంగానే పేలవమైన బౌలింగా, లేక కెప్టెన్ ఉద్దేశపూర్వకంగానే అన్ని పరుగులు ఇచ్చేశాడా? దీనికి ఏదైనా 'స్పాట్ - ఫిక్సింగ్' లేదా బెట్టింగ్‌తో సంబంధం ఉందా? అనే కోణంలో విచారణ జరుపుతోంది. ఇలాంటి వ్యవహారాలపై ఎప్పటికప్పుడు స్పందించే స్థితిలో ఏసీయూ లేదని ఐసీసీ తాత్కాలిక జీఎం అంద్రూ ఎఫ్?గ్రేవ్ తెలిపారు. దీని గురించి విచారణ తర్వాతే అసలు నిజాలు తేలుతాయని పేర్కొన్నారు. అయితే ఇక్కడ గమనించదగ్గ విషయం ఏమిటంటే, 2026 టీ20 ప్రపంచ కప్ ప్రారంభానికి కేవలం మూడు వారాల ముందే బాజ్వా కెనడా జాతీయ జట్టు కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. కెనడా క్రికెట్ జట్టు ప్రస్తుతం క్లిష్ట సమయాన్ని ఎదుర్కొంటోంది. ఆటగాళ్లపై వచ్చిన అవినీతి ఆరోపణలే కాకుండా, జట్టు ఎంపికలో జరిగిన అవకతవకలను వెల్లడించే ఒక టెలిఫోన్ సంభాషణ రికార్డింగ్ కూడా బయటపడింది. ఆ ఆడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. అందులో, జాతీయ జట్టులోకి కొందరు ఆటగాళ్లను పక్కాగా ఎంపిక చేయాలని తనపై ఒత్తిడి వచ్చిందని మాజీ కోచ్ ఖుర్రం చౌహాన్ పేర్కొన్నట్లు అందులో ఉంది. తనపై ఒత్తిడి తెచ్చిన వ్యక్తులు బోర్డులోని సీనియర్ సభ్యులేనని అతను తెలిపాడు.



## హార్దిక్ పాండ్యా కెప్టెన్సీ ఆశించిన స్థాయిలో లేదు

**హార్దిక్ పాండ్యాపై మనోజ్ తివారీ విమర్శలు**

ఐపీఎల్ 2026 సీజన్లో భాగంగా ముంబై ఇండియన్స్ జట్టు వరుస పరాజయాలతో సతమతమవుతోంది. ఇప్పటివరకు ఆడిన 5 మ్యాచ్‌ల్లో కేవలం ఒకే ఒక్క విజయాన్ని నమోదు చేసిన ముంబై ఇండియన్స్.. పాయింట్ల పట్టికలో అట్టడుగు నుంచి రెండో స్థానంలో ఉంది. గురువారం పంజాబ్ కింగ్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కూడా ఘోరంగా ఓడిపోవడంతో కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం మార్చి 29న కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుపై మాత్రమే ముంబై ఇండియన్స్ విజయం సాధించింది.ముంబై ఇండియన్స్ వైఫల్యాలపై మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ ఘాటుగా స్పందించారు. హార్దిక్ పాండ్యా కెప్టెన్సీ ఆశించిన స్థాయిలో లేదని.. జట్టును ముందుండి నడిపించడంలో హార్దిక్ విఫలమవుతున్నాడని విమర్శించారు. రోహిత్ శర్మ సారథ్యంలో ముంబై జట్టు 2013 నుంచి 2023 మధ్య 5 ట్రోఫీలను గెలుచుకుందని గుర్తు చేసిన మనోజ్ తివారీ.. రోహిత్‌ను కెప్టెన్సీ నుంచి తొలగించడం ద్వారా ఫ్రాంచైజీ పెద్ద అన్యాయం చేసిందని అభిప్రాయపడ్డారు."హార్దిక్ పాండ్యా తనంతట తానుగా కెప్టెన్సీ బాధ్యతల నుంటి తప్పుకుని, తిరిగి రోహిత్ శర్మకు పగ్గాలు అప్పగించాలి" అని మనోజ్ తివారీ సూచించారు. గత రెండేళ్లుగా ముంబైకి ట్రోఫీ రాలేదని.. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఈ ఏడాది కూడా అదే పునరావృతమయ్యేలా ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జట్టులో ఐకమత్యం లోపించిందని, కెప్టెన్ నిర్ణయాలు సరిగ్గా లేవని ఆయన కుండబద్దలు కొట్టారు.పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో హార్దిక్ తీసుకున్న నిర్ణయాలను మనోజ్ తివారీ తప్పుబట్టారు. విధ్వంసకర బ్యాటర్ షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్‌ను కాదని, హార్దిక్ తనను తాను బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు ప్రమోట్ చేసుకోవడం వల్ల జట్టు నష్టపోయిందని విమర్శించారు. అలాగే జస్ప్రీత్ బుమ్రాతో మొదటి ఓవర్ వేయించకపోవడం.. ఫామ్‌లో లేని దీపక్ చాహర్‌కు బంతిని ఇవ్వడం వంటి వ్యూహాత్మక లోపాలు ముంబై ఓటమికి కారణమయ్యాయని ఆయన విశ్లేషించారు.

## నా రికార్డును వైభవ్ సూర్యవంశీ బద్దలు కొడతాడు

**గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్**

టీమిండియా స్టార్ క్రికెటర్, గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో అత్యంత కీలక విషయం క్లారిటీ అని వాషింగ్టన్ సుందర్ పేర్కొన్నారు. స్టేడియంలోకి వెళ్లే ముందే ప్రతి ఆటగాడికి తన బాధ్యత ఏంటో.. కెప్టెన్ తన నుంచి ఏం ఆశిస్తున్నాడో గిల్ చాలా స్పష్టంగా వివరిస్తాడని సుందర్ చెప్పుకొచ్చాడు. ఈ విధానం వల్ల ఆటగాళ్లపై ఒత్తిడి తగ్గి, ప్రశాంతంగా తమ సహజసిద్ధమైన ఆటను ఆడగలుగుతున్నారని పేర్కొన్నాడు. భారత క్రికెట్‌లో ప్రస్తుతం సెన్సేషన్‌గా మారిన బీహార్ యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ గురించి వాషింగ్టన్ సుందర్ గొప్పగా మాట్లాడాడు. టీ20 క్రికెట్‌లో భారత్ తరపున అరంగేట్రం చేసిన అత్యంత పిన్న వయస్కుడిగా తన పేరిట ఉన్న రికార్డును వైభవ్ సూర్యవంశీ బద్దలు కొట్టే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డాడు. వైభవ్ వయసు తక్కువైనా అతని ఆలోచనా విధానం, నైపుణ్యం చూస్తుంటే చాలా ఆశ్చర్యంగా ఉంటుందని, అతడు భవిష్యత్తులో టీమిండియాకు సుదీర్ఘ కాలం ఆడుతాడని వాషింగ్టన్ సుందర్ ఆశాభావం వ్యక్తం చేశాడు.టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌కు, గుజరాత్ టైటాన్స్ డ్రెస్సింగ్ రూమ్‌కు పెద్దగా తేడా ఏమీ లేదని సుందర్ తెలిపాడు. ఇక్కడ ఆటగాళ్లందరి మధ్య మంచి సమన్వయం ఉందని, జట్టులోని భారతీయ ఆటగాళ్లంతా టీమిండియాలో కూడా కలిసి ఆడిన వారు కావడంతో ఒకరి గురించి ఒకరికి బాగా తెలుసని చెప్పాడు. కేవలం మైదానంలోనే కాకుండా టీమ్ రూమ్‌లో కూడా అందరం కలిసి ఎక్కువ సమయం గడపడం వల్ల ఓ కుటుంబంలా కలిసిపోయామని, ఈ వాతావరణమే గుజరాత్ టైటాన్స్ జట్టును ప్రత్యేకంగా నిలుపుతుందని పేర్కొన్నాడు.కోచ్ ఆశిష్ నెహ్రా గురించి మాట్లాడుతూ.. ఆయనతో కలిసి పనిచేయడం ఎప్పుడూ గొప్ప అనుభూతినిస్తుందని వాషింగ్టన్ సుందర్ తెలిపాడు. గత నాలుగేళ్లుగా గుజరాత్ జట్టుతో నెహ్రాకు ఉన్న అనుబంధం అద్భుతమని, ఆయన ఆటగాళ్ల బలాలు, బలహీనతలను చాలా సులభంగా అర్థం చేసుకుంటారని కొనియాడాడు. ఐపీఎల్ తన జీవితాన్ని మార్చివేసిందని, 2017లో మొదలైన తన ప్రయాణం ఇప్పుడు ఒక దశాబ్దానికి చేరువవుతోందని, సీనియర్ ఆటగాడిగా తన బాధ్యతలను నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నానని వాషింగ్టన్ సుందర్ స్పష్టం చేశాడు.